అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 4-8-2017

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 3 సంచిక : 217 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 5.00

ప్రజల గొంతుక నొక్కజాలరు

'నవతెలంగాణ' మీద సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ విరుచుకు పడ్డారు. తమ స్థాయి మరచి మాట్లాడారు. ప్రజల హృదయస్పందనగా పత్రిక నడవడాన్ని సహించలేక పోయారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పాలకుల అసహనం శ్రేయస్కరం కాదు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో సైతం పత్రిక పేరు చెప్పి నిందించిన పాలకులు లేరు. అధినేతల అంతరంగంలోని కల్లోలానికిది ప్రతీక. "ఈ రాతలు రాసేవారు ఈ రాష్ట్రానికి అవసరమా?" అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రానికి ఎవరు అవసరమో ప్రజలు నిర్ణయించుకుంటారు. ఇంతకూ ఈ పత్రిక చేసిన నేరం ఏమిటి? మల్లన్నసాగర్‌లో మునిగే రైతుల గోడు, వేములఘాట్ ప్రజల గుండె చప్పుడు వినిపించింది. "నేరెళ్లలో గూండాగిరీ చేస్తే పోలీసులు ఊర్కుంటారా" అని ప్రశ్నించారు ముఖ్యమంత్రి. నేరెళ్ల పోలీసుల గూండాగిరీని ప్రజల ముందు నిలిపింది నవతెలంగాణ. "వారి మెడలో దళితులనే బోర్డు ఉన్నదా" అని ఆయన అన్నారు. దళితులు కాకపోతే వారి మీద దౌర్జన్యం చేయవచ్చా అని ప్రశ్నించింది ప్రజల గొంతుక. 2013 భూసేకరణ చట్టానికి తూట్లు పొడిచిన వైనం బట్టబయలు చేసింది. కంచే చేను మేసినట్టు పాలకులే చట్టాన్ని ఉల్లంఘించిన తీరును ఎండగట్టింది. జీఓ 123 పేరుతో చేసిన మోసపూరిత ప్రయత్నాలను ప్రజల ముందుంచింది. 'ధర్నాచౌక్'ను ఎత్తేసే ప్రయత్నాన్నీ నిలదీసింది. స్థానికుల వేషంలో దిగిన పోలీసుల నిర్వాకాన్ని నిగ్గుదేల్చింది. సన్నబియ్యం పేరుతో జరుగుతున్న దందాను ప్రశ్నించినప్పుడు పాలకులకు కోపం వచ్చింది. కానీ అదే విషయం తర్వాత ఇతర పత్రికలు కూడా చెప్పటంతో నోటమాట ఆగింది. ఏడాది కిందనే నగరాన్ని ఆవహించిన గంజాయి భూతం గురించి ఎలుగెత్తి చాటింది నవతెలంగాణ. అప్పుడే పాలకులు కదిలి ఉంటే ఇప్పుడు డ్రగ్స్ మాఫియా వికటాట్టహాసాలు ఉండేవి కాదు. ఒక బాధ్యతాయుతమైన పత్రికగా రైతుల ఆత్మహత్యలకు మూలకారణాలూ పరిష్కారాలూ సూచించింది. ఆత్మహత్యల నిజమైన సంఖ్యను పూర్తి వివరాలతో నిగ్గుదేల్చింది. కుల దురహంకార హత్యలను వెలుగులోకి తెచ్చింది. వివక్షమీద అక్షరాయుధాలు సంధించింది. అధినేతలు నీరోచక్రవర్తి బాట పట్టటాన్ని ప్రశ్నించింది.

సంపాదకీయం

తెలంగాణ ఆడబిడ్డలు ఆశాల గొంతు వినిపించింది. దళితులూ, బడుగూ బలహీన వర్గాల వారైన పారిశుద్ధ్య కార్మికుల వెన్నంటి నిలిచింది. ముఖ్యమంత్రి కార్యాలయం సాక్షిగా సాగుతున్న వసూళ్ల దందాను వెలుగులోకి తెచ్చింది. ప్రశ్నాపత్రాల లీకేజీలైనా, నయీం మాఫియా, ఇసుక మాఫియా, భూమాఫియా, డ్రగ్స్ మాఫియా... ఎలాంటి మాఫియాలనైనా ప్రశ్నించటమే బాధ్యతగా నిలిచింది. తెలంగాణ గడ్డమీద నిజాయితీగా పనిచేయదలచిన యువ పోలీసుల ఆత్మహత్యల నేపథ్యాన్నీ ప్రశ్నించింది. అన్నంపెట్టే రైతులకు సంకెళ్లా? అని నిలదీసింది. శృతీ, సాగర్‌ల అమానుష హత్యలనూ ఖండించింది. ఒక్కటేమిటీ? ప్రజాస్వామ్యం కోసం, ప్రజల కోసం ప్రజల గొంతుకగా నిలిచింది. బహుశా... ఇదే పాలకుల ఆగ్రహానికి కారణమైందేమో..?!

పత్రికలంటే ప్రజాస్వామ్యపు నాలుగో స్తంభం. ప్రశ్నించటం పత్రికల లక్షణం. ఇది చరిత్ర చెప్పిన సత్యం. ప్రశ్నించడాన్ని ముఖ్యమంత్రి సహించటం లేరు. పత్రికలన్నీ పాలకుల భజన చేయాలని కోరుకోవటం అత్యాశే. మానవజాతి చరిత్రలో ప్రజాపోరాటాలే పత్రికల పుట్టిల్లు. పాతకాలపు రాచరికాల బూజు దులిపి ప్రజాస్వామ్యపు గొంతు వినిపించిన చరిత్ర పత్రికలది. నవతెలంగాణను ఆనాడు ఆశీర్వదించిన దాశరథి రంగాచార్య "నా తెలంగాణ కోటి రతనాలవీణ, ఇది ప్రజలకు దక్కాలి" అన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ పత్రికను ప్రజల ఒడిలో పెట్టిననాడూ ఇదే మాట చెప్పాం. నాడు ముఖ్యమంత్రి సమక్షంలో ఏమి చెప్పామో అదే చేస్తున్నాం. మాట తప్పింది ముఖ్యమంత్రి. ప్రజల గొంతుకగా ఉండవల్సిన ఈ పత్రిక పాలకుల గొంతుకగా ఉంటుందని వారు ఆశిస్తే... ఆ తప్పు మాది కాదు. తెలంగాణ ఏర్పడిన పది నెలలకు ఈ పత్రిక ప్రజల ఒడిలో చేరింది. "నిండు చూలాల ఈ తెలంగాణ తల్లి కొత్త జీవితాన్ని ఇస్తుందా? లేక అవే సమస్యల తోరణాన్ని ఆవిష్కరిస్తుందా" వేచి చూడాలని ఆనాడే నవతెలంగాణ చెప్పింది. సంబురాలు మంచు తెరలు కాకూడదని జనం ఆశించారు. 'తెలంగాణ' పదానికీ, ప్రాంతానికీ గుర్తింపూ, గౌరవాన్నీ తెచ్చిన మహత్తర సాయుధ రైతాంగ పోరాట గడ్డ ఇది. మౌలిక సమస్యల పరిష్కారానికి మార్గం చూపి సాంస్కృతిక పునరుజ్జీవనానికి ఊపిరులూదిన ఉద్యమమిది. ఆ వారసత్వం పుణికి పుచ్చుకున్న తెలంగాణ ప్రజలు చైతన్యయుతంగానే స్పందిస్తారు. ప్రజల కదలికలను కట్టడి చేయబూనుకోవటం గానీ, వారి గుండె చప్పుడైన పత్రికల నోళ్ళు నొక్కే ప్రయత్నం గానీ చరిత్రలో జయప్రదం కాలేదు. అక్షరాలను బంధిస్తే జైలు గోడల మీద అక్షరాలు దిద్దిన దాశరథి పుట్టిన వీరగడ్డ ఈ తెలంగాణ. నిజాం బందిఖానాలో దాశరథి నోట జాలువారిన నిప్పుకణికలను గోడలమీద బొగ్గుతో అక్షరమాలలు కూర్చిన వట్టికోట ఆళ్వారుస్వామి జన్మించిన నేల. ఫ్యూడల్ సామాజిక రుగ్మతలను సున్నితంగానూ, సునిశితంగానూ ప్రశ్నించిన సురవరం ప్రతాపరెడ్డి సృజించిన భూమి. షోయబుల్లాఖాన్ చేయి నరికి, నడిబజారులో హత్య చేసిన నిజాం నిరంకుశత్వానికి గోరీ కట్టిన గడ్డ. పదవుల కోసమో... పంపకాల కోసమో కాకుండా, తెలంగాణ ప్రజల కోసం అక్షరాయుధాలు ప్రయోగించిన నిస్వార్థ సాహితీకారులూ, పాత్రికేయులే ఆదర్శంగా అడుగులు వేస్తున్న పత్రిక నవతెలంగాణ. రాజులు తల్చుకుంటే దెబ్బలకు కొదవకాదు. నవతెలంగాణ మీద ముఖ్యమంత్రి దాడిచేసిన మరుసటిరోజే ప్రగతిభవన్ సాక్షిగా పాత్రికేయులమీద పోలీసులు దాడి చేసారు. మహిళా జర్నలిస్టును పోలీసు అధికారి బూతులు తిట్టారు. ముఖ్య మంత్రి సంకేతాల ఫలితం కాదా ఇది? కక్షపూరిత చర్యలకు తలవంచితే పాత్రికేయ ధర్మం కాదు. తీవ్ర నిస్పృ హలో ఉన్న సీఎం వివేకం మరిచి, వివక్ష పూరితంగా వ్యవహరిస్తూ, అక్కసు వెళ్లగక్కడం విజ్ఞత కాదు. ముఖ్యమంత్రి స్థాయికి ఇది తగదు. ప్రజలనూ, ప్రజల గొంతుకలనూ గౌరవించటం ప్రజాస్వామ్యాన్ని విశ్వసించే పాలకుల విధి.

ఖాకీ దాడి

మీడియాపైనా, ఆందోళనలపైనా ముఖ్యమంత్రి కేసీఆర్ నిప్పులు చెరిగిన మరుసటిరోజే గురువారం ఉదయం ప్రగతిభవన్ ముందు నిరసన చెబుతున్న ఉద్యమకారులపై పోలీసులు తమ ప్రతాపం చూపించారు. మహిళలను మగపోలీసులు ఈడ్చుకుంటూ వెళ్లి వ్యాన్లలో ఎక్కించారు. ఈ సంఘటనను కవర్ చేసిన 10 టీవీ, మిగతా మీడియా సిబ్బందిపైనా దాడి చేశారు. రాయడానికి వీల్లేని రీతిలో మహిళా రిపోర్టర్‌పై భాషను ఉపయోగించారు

సీఎం క్యాంప్ ఆఫీసు ముందే మీడియాపై పోలీసుల వీరంగం


కెమెరామెన్‌ను అడ్డుకుంటూ రిపోర్టర్ రాధికను నెట్టేస్తున్న ఏసీపీ

రెగ్యులరైజేషన్ చేయాలని అడిగితే జులుం

- మహిళలను ఈడ్చుకుంటూ వ్యాన్లలో తరలింపు
- మహిళలపై మగ పోలీసుల లాఠీచార్జ్
- పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఏఎన్ఎం
- మీడియా ప్రతినిధులపైనా దౌర్జన్యం


మహిళా ఎఎన్ఎంలను అడ్డుకుంటున్న మగపోలీసులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్ బ్యూరో

సమస్యల పరిష్కారం కోసం వైద్యఆరోగ్యశాఖలోని 300 మంది యూరోపియన్ కాంట్రాక్టు మహిళా ఏఎన్ఎంలు గురువారం ఉదయం 'ప్రగతిభవన్'ను ముట్టడించారు. ఎన్నో ఏండ్లుగా డిమాండ్ చేస్తున్న గ్రాస్‌సాలరీ, రెగ్యులరైజేషన్ చేయాలని నినదించారు. ఈ విషయమై ముఖ్యమంత్రి కేసీఆర్ తమతో చర్చించాలని డిమాండ్ చేశారు. ఏఎన్ఎంలు నినాదాలతో ప్రగతిభవన్ దద్దరిల్లింది. సీఎంను కలవడానికి అనుమతి లేదంటూ పోలీసులు నిర్బంధం ప్రయోగించారు. వారిని అడ్డుకుని అరెస్టులు చేశారు. ఈ అరెస్టులు మగ పోలీసులు చేయడం గమనార్హం. మహిళలపై కనీస గౌరవం పాటించకుండా ఈడ్చుకుంటూ వ్యాన్లలో ఎక్కించారు. ఎదురుతిరిగిన వారిపై లాఠీచార్జ్ చేశారు. ఈ ఘటనలో చాలామందికి గాయాలయ్యాయి. మరోవైపు సంఘటనను కవర్ చేయడానికి వచ్చిన మీడియా ప్రతినిధులనూ పోలీసులు వదల్లేదు. నిరసనకారులను పశువులను ఈడ్చినట్లుగా లాగేస్తున్న ...9లో



హిమాన్షు యాక్టివిటీలో లేదు

ఉన్నదని అఫిడవిట్‌లో చూపిస్తే తప్పేంటీ

- ఎన్నికల కమిషన్ అడిగితే సమాధానమిస్తాం :ప్రభుత్వ విప్ పల్లా



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పోలీసులకు వాహనాల కొనుగోలులో హిమాన్షు మోటర్స్ కంపెనీకి సంబంధం ఉందని ఆయా రాజకీయ పార్టీలు విమర్శలు చేయడాన్ని టిఆర్ఎస్ఎల్పీ ఖండించింది. హిమాన్షు కంపెనీ ఏడెండ్ల నుండి యాక్టివిటీలో లేదని పేర్కొంది. యాక్టివిటీలో లేకపోయినా, కంపెనీ ఉందని అఫిడవిట్‌లో చూపిస్తే తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించింది. ఈ వ్యవహారంపై వామపక్షాలు ఎన్నికల అధికారి భన్వర్‌లాల్‌ను కలిసి మంత్రి కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇచ్చిన నేపథ్యంలో శాసనమండలిలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పైవిధంగా స్పందించారు. గురువారం టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పల్లా మాట్లాడారు. మంత్రి కేటీఆర్‌పై చర్యలు తీసుకోవాలని వామపక్షాలు ఎన్నికల ...9లో

జీఎస్టీ దెబ్బకు సేవల రంగం ధాం

- పీఎంఐ అనుబంధ సూచీలో నాలుగేండ్ల కనిష్టానికి
- 45.2 పాయింట్లుగా నమోదు

బెంగళూరు:జులై నెలలో సేవల రంగం నాలుగేండ్ల కనిష్టానికి దిగజారినట్టు గురువారం విడుదల చేసిన అనుబంధ సర్వేలో వెల్లడైంది. భారత ఆర్థిక వ్యవస్థలో కీలకమైన సేవల రంగం కొనుగోలుదారు మేనేజర్ల(పీఎంఐ) అనుబంధ సూచీలో 45.2 పాయింట్లు నమోదైంది. గతేడాది నవంబర్‌లో మోడీ ప్రభుత్వం తీసుకున్న పెద్దనోట్ల రద్దు తర్వాత ఆరు నెలల్లో చూస్తే.. జూన్ నెలలో సేవల రంగం పుంజుకొని 53.3 పాయింట్లు నమోదు చేసింది. తాజాగా కొత్త పన్నుల విధానం జీఎస్టీ జులై 1 నుంచి అమలులోకి రావడంతో



సేవల రంగం మరోసారి కుదింపునకు గురైంది. తాజా సర్వే ద్వారా జులై నెలలో సేవల రంగం ఆరు నెలల్లో అతి తక్కువే కాకుండా,సెప్టెంబర్ 2013 తర్వాత నాలుగేండ్ల కనిష్టానికి కుంచించుకుపోయింది. జులై నెలలో తయారీ, ...9లో

నాటకాలు ఆపండి

తెలంగాణ వస్తే ఇంటికో ఉద్యోగమన్న కేసీఆర్..వాటి జాడేది?

- ఇప్పటికైనా వాగ్దానాలు అమలు చేయండి.. లేదంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం : సీఎం కేసీఆర్‌కు టీ మాస్ ఫోరం డిమాండ్
- జిల్లెళ్ల, నేరెళ్ల ఘటనపై న్యాయ విచారణ జరిపించాలి
- ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా 9లో



తెలంగాణ వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తామంటూ నమ్మబలికిన ముఖ్యమంత్రి కేసీఆర్.. ఇప్పటి వరకూ ఆ వాగ్దానాన్ని నెరవేర్చలేదని తెలంగాణ సామాజిక, ప్రజా సంఘాల ఐక్య వేదిక (టీ మాస్ ఫోరం) విమర్శించింది. కోర్టులు కొట్టేసే విధంగా నోటిఫికేషన్లను జారీ చేస్తున్న ప్రభుత్వం ఈ విషయంలో నాటకాలాడుతున్నదని ఎద్దేవా చేసింది. ఇలాంటి నాటకాలన్నింటినీ కట్టిపెట్టి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలన్నిం టినీ అమలు చేయాలని ముఖ్యమంత్రికి సూచించింది. లేదంటే రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని ఫోరం నాయకులు హెచ్చరించారు

కాల్పుల్లో ఆర్మీ మేజర్, జవాను మృతి

- కుల్గామ్ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతం



శ్రీనగర్: జమ్మూకాశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఆర్మీ మేజర్, మరో జవాను ప్రాణాలు కోల్పోయారు. కుల్గామ్ జిల్లాలో జరిగిన మరో ఘటనలో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. పోలీసుల వివరాల ప్రకారం ...9లో



కేసీఆరే పెద్ద అసమర్థుడు

పాలన చేయలేక కాంగ్రెస్‌పై విమర్శలు

- అన్యాయం జరిగితే...కోర్టుకు కాక మరెక్కడికి పోతారు?
- నోరు అదుపులో పెట్టుకో.. లేకపోతే తరిమి కొడతారు : సీఎంకు ఉత్తమ్ కౌంటర్



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పరిపాలన చేయడం చేతగాక, కాంగ్రెస్‌పార్టీ, ఇతర పార్టీలు, మీడియాపై విమర్శలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు పెద్ద అసమర్థుడు అని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. సన్న, చిన్నకారు రైతులంతా తమ భూములకు సరైన న్యాయం జరగడం లేదని, న్యాయం కోసం కోర్టులను ఆశ్రయిస్తే...కాంగ్రెసోళ్లు కేసులు వేసి ఆపుతున్నారని సీఎం చెప్పడం సిగ్గు చేటన్నారు. పేదల భూములు బలవంతంగా లాక్కుంటుంటే చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. గురువారం గాంధీభవన్‌లో పార్టీ నేతలు మల్లుభట్టి విక్రమార్క, పొన్నాల లక్ష్మయ్య, మల్లు రవి, దాసోజు శ్రవణ్, నేరెళ్ల శారద, వినోద్‌రెడ్డి తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పాలకులు న్యాయం చేయపోతే రాజ్యాంగం ప్రకారం కోర్టులకు వెళ్లే హక్కు ప్రతి ఒక్కరికి ఉందన్నారు. విలాసవంతమైన భవనాల్లో జీవించే హక్కు మీకుండగా... పేదలు కోర్టుకు పోయే హక్కు ఉండదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో మిగిలి పోయిన ...9లో

నిరాశ.. నిస్పృహలతో బురదజల్లే ప్రయత్నం

- ఎవరి దయాదాక్షిణ్యాల వల్ల తెలంగాణ రాలేదు :ఈటల



నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం ఏ పార్టీ దయాదాక్షిణ్యాల వల్ల రాలేదని ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ అన్నారు. 'బరిగీసి కొట్లాడినం, బలిదానాలు చేసినం, రక్తం చిందించి రాష్ట్రము సాధించుకున్నాం. సాధించిపెట్టిన పార్టీకి, ఉద్యమ సారథికి ప్రజలు పట్టం కట్టారు. తెలంగాణ ఉద్యమంలో జంకకుండా, వెరవకుండా, అవమానాలను దిగమింగుతూ కమిట్మెంట్‌తో రాష్ట్రాన్ని సాధించినం. ప్రజలు ఇచ్చిన బాధ్యతను నెరవేర్చేందుకు అంతే బాధ్యతతో రాష్ట్రము గొప్పగా ఎదగాలని పని చేస్తున్నాం. ఎక్కడ కూడా వేలెత్తి చూపే పని లేకుండా మూడు సంవత్సరాల పాలనలో ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నం. తెలంగాణ రాష్ట్రానికి ఒక దిశ దశ ఉంది కమిట్మెంట్ ఉంది అని అన్ని రాష్ట్రాల వారు మెచ్చుకుంటున్నరు. ఇవన్నీ చూసి ఓర్వలేని మీరు సీఎం వేగాన్ని కాళ్లలో కట్టెలు పెట్టి ఆపే ప్రయత్నం చేస్తున్నారు.' అని ఈటల రాజేందర్ అన్నారు. గురువారం టిఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో శాసనమండలిలో ప్రభుత్వచీఫ్ ...9లో

నవతెలంగాణ

కేసీఆర్... సీఎం అని మర్చిపోకు

కొడుకుని కాపాడుకునేందుకే ఈ పాట్లన్నీ

- అభియోగాలు ఆధారాలతో నిరూపించేందుకు సిద్ధం
- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సవాల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు వామపక్షాలు ప్రత్యేకించి మార్క్సిస్టు పార్టీపై విషం కక్కారని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ విమర్శించింది. వామపక్షాలకు కాలం చెల్లిందని ఎగతాళిగా మాట్లాడ్డాన్ని ఖండించింది. కేసీఆర్... సీఎం అని మర్చిపోవద్దని తెలిపింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీఎం కొడుకుపై వస్తున్న అభియోగాలు ఆధారాలతో సహా నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రతిసవాల్ విసిరారు. వేములఘాట్‌లో కమ్యూనిస్టులు కిరికిరి పెడుతున్నారని వ్యాఖ్యానించి ప్రజా ఉద్యమాల పట్ల మరోసారి తన నైజాన్ని వెళ్లగక్కారని తెలిపారు. వాస్తవాలను ప్రజల ముందుంచే మీడియానూ వదలకుండా ఇష్టం వచ్చినట్టు నోరుపారేసుకున్నారని పేర్కొన్నారు. ప్రతిపక్షాలను బెదిరించడానికి బరితెగించారని తెలిపారు. ప్రజా ఉద్యమాలను చులకన చేస్తూ ఎటకారంగా ప్రసంగించారని పేర్కొన్నారు. అవాస్తవాలను వాస్తవాలుగా నమ్మించడానికి రెండు గంటలపాటు విలేకరుల సమావేశం నిర్వహించారని తెలిపారు. ఉద్యమాలను ఎగతాళి చేయడం తెలంగాణ సమాజాన్ని అవమానపర్చడమేనని విమర్శించారు. కన్నంలో దొంగలా దొరికిన కొడుకును కాపాడుకోవడానికే సీఎం మీడియా సమావేశాన్ని జరిపి పడరాని పాట్లు పడ్డారని తెలిపారు. పుత్రవాత్సల్యం ఎక్కువై కేసీఆర్ ముఖ్యమంత్రి అన్న స్థాయిని మర్చిపోయారని పేర్కొన్నారు. సవాళ్లు విసిరారని తెలిపారు. కొన్ని రోజులుగా ముఖ్యమంత్రి, మంత్రి కేటీఆర్‌పై వామపక్షాలు, సీపీఐ(ఎం) చేస్తున్న అభియోగాలకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. సీఎం సవాల్‌ను స్వీకరిస్తున్నామని తెలిపారు. ఆధారాలతో సహా నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రతి సవాల్ విసిరారు. 1951 ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 9 ప్రకారం కేటీఆర్ అనర్హుడిగా ప్రకటించడానికి ఆధారాలన్నీ తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఎప్పుడు, ఎక్కడ చర్చకు వస్తారని పేర్కొన్నారు. కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల ఇసుక క్వారీలో ముఖ్యమంత్రి సమీప బంధువులకే అత్యధిక లారీలున్నాయని తెలిపారు. ప్రభుత్వ అండతోనే వేల కోట్ల రూపాయల ఇసుక అవినీతి జరుగుతోందని పేర్కొన్నారు. నేరెళ్ల ఘటన అనుకోనిది కాదని, ప్రభుత్వం లారీ యజమానులతో, ఇసుక కాంట్రాక్టర్లతో లాలూచీ పడటం వల్లనే ఐదుగురు చనిపోయారని తెలిపారు. 42 సార్లు ప్రమాదాలు జరిగాయని పేర్కొన్నారు. బుధవారం ఒకరు చనిపోయారని తెలిపారు. ఎనిమిది మందిని పోలీసులు చితకబాదారని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రత్యక్ష, పరోక్ష అండతోనే ఇసుక మాఫియా బరితెగించిందని తెలిపారు. ఈ ఆధారాలన్నింటినీ తాము నిరూపిస్తామని పేర్కొన్నారు. ప్రాజెక్టులకు తాము వ్యతిరేకం కాదని వందలసార్లు చెప్పామని తెలిపారు. వాస్తవాలు తెలిసీ పదేపదే గోబెల్స్ ప్రచారాన్ని చేస్తున్నారని విమర్శించారు. రైతులను భూములను కారుచౌకగా కాజేయడానికి కంపెనీలు, ప్రభుత్వం ఉమ్మడిగా భూదందాకు పాల్పడ్డాయని తెలిపారు. 123 జీవో తెచ్చింది అందుకు కాదా?అని ప్రశ్నించారు. 2013 చట్టాన్ని సవరించి తలలేని మొండెంగా 2017 కొత్తచట్టంగా సవరణ చేశారని తెలిపారు.

వీటిపై రైతులు, వ్యవసాయ కార్మికులు, వృత్తిదారులు రాజకీయాలతో నిమిత్తం లేకుండా తిరగబడుతున్నారని పేర్కొన్నారు. భూములను కాజేయాలని ప్రభుత్వం కుట్రలు చేసింది కాబట్టే రైతులు కోర్టులను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. భూసేకరణ జరుగుతున్న కేంద్రాలవారీగా తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. మల్లన్నసాగర్‌లో ఏడాది కాలంగా రైతాంగం, వ్యవసాయ కార్మికులంతా సుదీర్ఘ ఉద్యమాలు చేస్తుంటే ఇంతవరకూ సీఎంగానీ, సంబంధిత మంత్రిగానీ ఆ ప్రాంతాలను పర్యటించలేదని తెలిపారు. వేములఘాట్ వెళ్లటానికి సిద్ధమని సీఎం చెప్పారని, తాము దాన్ని ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏ తేదీ నిర్ణయించినా తమకు అభ్యంతరం లేదని తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో రజక కులానికి చెందిన నరేష్, స్వాతిల కులాంతర వివాహం చేసుకున్నందుకు హత్య కాబడ్డారని పేర్కొన్నారు. పోలీసులు అండగా ఉండటం వల్లనే శ్రీనివాసరెడ్డి ఈ హత్యలకు తెగించాడని తెలిపారు. పోలీసుల అండతోనే తెలంగాణలో భూస్వాములు, పెత్తందారులు సామాజిక తరగతులకు చెందిన వారిని చంపుతున్నారని పేర్కొన్నారు. దీనిపై ఆధారాలతో సహా నిరూపిస్తామని తెలిపారు.

దిగజారి తెలంగాణ సమాజాన్ని అవమానపర్చొద్దు



హిమాన్షు మోటారు పత్రాలను చూపిస్తున్న తమ్మినేని (ఫైల్)

సంస్కారహీనమైన భాష

కమ్యూనిస్టు పార్టీలపై సీఎం కామెంట్లు..

ప్రతిగా లెఫ్ట్ నేతలు, మేధావుల స్పందనలు...

పదవులు త్యజించాననడం సిగ్గుచేటు



కేసీఆర్ సంస్కారహీనమైన భాషను వాడారు. మానవాళికే వెలుగునిచ్చే సిద్ధాంతాన్ని కమ్యూనిస్టులు కరదీపికగా చేసుకున్నారు. ప్రజల కోసం త్యాగాల కత్తి మొనమీద నడుస్తున్న వీర చరిత కమ్యూనిస్టులది. అధికారం కోసం ఏ గడ్డైనా కరవాలన్నది కేసీఆర్ సిద్ధాంతం. దశాబ్దాలపాటు పదవులను అనుభవించిన ఆయన తాను పదవులను త్యజించానంటూ చెప్పుకోవటం సిగ్గుచేటు. ప్రజల కోసం నిరంకుశ పాలకులను ఎదిరించి పోరాడుతున్న కమ్యూనిస్టుల త్యాగాల ముందు ఆయన త్యాగమెంత...?"

- చాడ వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

భూస్వామ్య వర్గాల పదజాలం..



"కమ్యూనిస్టులు, విపక్షాల నుద్దేశించి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణాలోని భూస్వామ్య వర్గాల పదజాలంలోంచి వచ్చినవి. వీటిని ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలి. హిమాన్షు మోటార్ల వ్యవహారానికి సంబంధించి అడిగిన ప్రశ్నలకు సూటిగా, నేరుగా సమాధానం చెప్పని సీఎం... వాటిని బైపాస్ చేశారు. ఆయన వ్యాఖ్యలు పూర్తిగా అప్రజాస్వామికంగా ఉన్నాయి..."

- ప్రొ.తిరుమలి, టీ మేధావుల ఫోరం చైర్మెన్

ప్రతిఘటన, ప్రతిస్పందన అవసరం...

"ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై ప్రతిఘటన, ప్రతిస్పందన అవసరం. ఆయన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అసహనాన్ని మొత్తం వెళ్లగక్కారు. ఇప్పుడు వామపక్షాలు, ఇతర విపక్షాల గురించి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు కూడా ఇదే నానుడి వర్తిస్తుంది..."



-వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్

బంగారుతెలంగాణ అంటే ఇదేనా..?



"కమ్యూనిస్టులనుద్దేశించి సీఎం చేసిన వ్యాఖ్యలు అత్యంత గర్హనీయం. వీర తెలంగాణ సాయుధ పోరాటంలో నాటి నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన ఘన చరిత్ర కమ్యూనిస్టులది. భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం రక్తాన్ని ధారపోసిన కమ్యూనిస్టులు తెలంగాణా మట్టికి విప్లవాన్ని నూరిపోశారు. అలాంటి మహత్తర చరిత్రగల కమ్యూనిస్టునుద్దేశించి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు ఆయన అసహనాన్ని, దిగజారుడుతనాన్ని తెలియజేస్తున్నాయి..."

-జూలకంటి

ఇంత అహంభావమా...?



"వామపక్షాలు, ప్రజా సంఘాలు, ప్రజాతంత్ర శక్తులు, దళితులపట్ల ముఖ్యమంత్రి సంస్కారహీనంగా వ్యవహరిస్తున్నారు. ఆయనకు ఇంత అహంభావం పనికిరాదు. ఆఖరికి దేశంలో ప్రముఖ దళిత నాయకురాలు, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్‌నుద్దేశించి కూడా ఆయన అనుచిత వ్యాఖ్యలు చేశారు. దళితులంటే సీఎంకు ఇంత చులకనా...? దీనిపై పెద్ద ఎత్తున నిరసనలు తెలపాలి..."

-జెబి రాజు, దళిత ఉద్యమ నాయకులు

సీఎం వ్యాఖ్యలకు నిరసనగా నేడు దిష్టిబొమ్మల దహనం

- టీ-మాస్ ఫోరం పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహిళలు, ప్రతిపక్షాలు, సామాజికోద్యమ నాయకులను దిగజారుడు పద్ధతుల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతున్న తీరును నిరసిస్తూ శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా సీఎం దిష్టిబొమ్మల దహనానికి తెలంగాణ సామాజిక ప్రజాసంఘాల ఐక్య వేదిక (టీ-మాస్ ఫోరం) పిలుపునిచ్చింది. ఈ మేరకు ఫోరం స్టీరింగ్ కమిటీ సభ్యులు జాన్‌వెస్లీ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేదలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, రిజర్వేషన్ల పెంపు, ఖాళీపోస్టుల భర్తీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్‌ప్లాన్ అమలు, కనీస వేతనం రూ.18వేలు, పేదలందరికీ డబుల్‌బెడ్‌రూమ్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

నవతెలంగాణపై సీఎం వ్యాఖ్యలు సరికావు

- టీడబ్ల్యూజేఎఫ్, ఐఎఫ్‌డబ్ల్యూజే ఖండన
- నేడు కలెక్టర్లకు వినతిపత్రాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నవతెలంగాణ దినపత్రికపై రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేసిన వ్యాఖ్యల పట్ల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. బుధవారం నాడు ప్రగతిభవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో నవతెలంగాణను ఇష్టానుసారం మాట్లాడటం మంచిపద్ధతి కాదని అభిప్రాయపడింది. ఈ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం. సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్‌డబ్ల్యూజే) జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యులు పి. ఆనందం, హెచ్‌యూజే అధ్యక్షులు చంద్రశేఖర్, కార్యదర్శి బీవీఎన్ పద్మరాజు గురువారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. పత్రికల్లో వచ్చే వార్తలు, వ్యాసాలు, ఇతర అంశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికిగానీ, ముఖ్యమంత్రికిగాని ఏవైనా అభ్యంతరాలు ఉంటే ప్రెస్‌కౌన్సిల్‌కు ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుందని గుర్తు చేశారు. వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న సంస్థను తూలనాడటం సరికాదన్నారు. నిరంతరం ప్రజల పక్షాన నిలవడం, వారికి అండగా వార్తలు రాయడమే పత్రికల పని అని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా మీడియా ఉండాలన్నారు. ఆ పనిని నవతెలంగాణ చేస్తున్నదన్నారు. రాజకీయ కారణాలతో పత్రికకు ప్రభుత్వ ప్రకటనలను ఎందుకు ఇవ్వాలని అనడం దారుణమని వ్యాఖ్యానించారు. తద్వారా వేలాది మంది ఉద్యోగులకు అన్యాయం చేసినట్టేనని వ్యాఖ్యానించారు. పత్రికపై సీఎం చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు కలెక్టర్లకు వినతిపత్రాలు

నవతెలంగాణపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా జిల్లా కలెక్టర్లకు శుక్రవారం వినతిపత్రాలు సమర్పించాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. జిల్లా కమిటీలు ఈమేరకు స్పందించి కలెక్టర్లకు వినతిపత్రాలను అందజేయాలని సూచించింది.



ఏసీపీపై చర్యలు తీసుకోవాలి

మీడియా ప్రతినిధులపై దాడికి పాల్పడ్డ ఏసీపీ పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ సభ్యులు .. డీజీపీ అనురాగ్‌శర్మకు వినతి పత్రం అందజేశారు.

జాతీయం

కేరళపై దుష్ప్రచారం తగదు

బీజేపీవి అవాస్తవ ఆరోపణలు

- లోక్‌సభలో సీపీఐ(ఎం) ఎంపీల ఆందోళన
- బీజేపీ ఎంపీల దురుసు ప్రవర్తన
- బీజేపీ ప్రణాళికలో భాగంగానే స్పీకర్ సభ వాయిదా : కరుణాకరన్
- ప్రజాస్వామ్యాన్ని హత్య చేస్తున్నారు : ఎం.డి సలీం

న్యూఢిల్లీ : కేరళలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేసి, దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని, అలాంటి ప్రభుత్వంపైన బీజేపీ దుష్ప్రచారం చేస్తోందని లోక్‌సభలో సీపీఐ(ఎం) పక్షనేత పి.కరుణాకరన్ విమర్శించారు. ప్రజా ప్రభుత్వంపై దుష్ప్రచారం తగదని హితావు పలికారు. బీజేపీ ఎంపీలు, నాయకులు అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని, ముఖ్యమంత్రి పినరయి విజయన్, సీపీఐ(ఎం) కేరళ రాష్ట్ర కార్యదర్శి కొడియేరి బాలకృష్ణన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఇలాంటి అవాస్తవ దుష్ప్రచారం తగదని హెచ్చరించారు. విద్యా, వైద్యం, హౌసింగ్, అభివృద్ధిలో కేరళ ప్రగతి పథంలో నడుస్తోందని, దేశానికే దిక్సూచిగా నిలుస్తోందని గుర్తు చేశారు. ఇలాంటి ప్రజా రంజక ప్రభుత్వంపై బురద జల్లడం తగదని హితవు పలికారు. సీపీఐ(ఎం) కార్యకర్తలను అనేక మందిని ఆరెస్సెస్, బీజేపీ పొట్టన పెట్టుకున్నాయని విమర్శించారు. ఇంతలోనే అధికార బీజేపీ ఎంపిలు కరుణాకరన్ ప్రసంగాన్ని అడ్డుకునేందుకు అరుపులు, కేకలు వేశారు. సభలో గందరగోళాన్ని సృష్టించారు. దీంతో స్పీకర్ సభను వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలో మాట్లాడేందుకు అవకాశమివ్వలేదు. ఈ నేపథ్యంలో సీపీఐ(ఎం) సభ్యులు కరుణాకరన్, ఎం.డి సలీం, శ్రీమతి టీచర్, ఎం.బి రాజేష్, పి.కె బిజూ, జితింద్ర చౌదరి, శంకర్ ప్రసాద్ దత్తు, ఎ.సంపత్, భద్రుద్దజాఖాన్‌లు ఆందోళన చేపట్టారు. అప్పుడు స్పీకర్ మళ్లీ మాట్లాడేందుకు అవకాశమిచ్చారు. వెంటనే రెండు నిమిషాలైన మాట్లాడకుండానే మైక్ కట్ చేశారు. దీంతో స్పీకర్ సుమిత్రా మహాజన్, బీజేపీ ఎంపిల తీరుపైన సీపీఐ(ఎం) సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీపీఐ(ఎం) పైన, కేరళ ప్రభుత్వంపైన బీజేపీ చేస్తోన్న అవాస్తవ ఆరోపణలపై చర్చించాలని, కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలని గురువారం ఆ పార్టీ నేత పి.కరుణాకరన్ వాయిదా తీర్మానం ఇచ్చారు. ఆ తీర్మానాన్ని స్పీకర్ చర్చకు అనుమతించకుండా తిరస్కరించి, జీరో అవర్‌లో మాట్లాడేందుకు అవకాశమిచ్చారు. సీపీఐ(ఎం) లోక్‌సభ పక్షనేత పి.కరుణాకరన్ మాట్లాడారు. "బిజెపి ఎంపిలు, నాయకులు సీపీఐ(ఎం)పైన అవాస్తవ ఆరోపణలు చేయడం తగదు. సిపిఎం టెర్రరిస్టు పార్టీ అని ఆరోపించడం చాలా హాస్యాస్పదంగా ఉంది. కేరళలో సీపీఐ(ఎం) కార్యాలయాలపైన, అనుబంధ ప్రజాసంఘాల పైన బీజేపీ, ఆరెస్సెస్ మూకలు దాడి చేస్తున్నాయి. ఇప్పటికే సిపిఎం అనేక మంది కార్యకర్తలను కోల్పోయింది. కేరళకే పరిమితం కాకుండా ఢిల్లీలోని మా పార్టీ ప్రధాన కార్యాలయంపైన రెండు మూడు సార్లు దాడి చేశారు. దేశంలో ఇతర రాష్ట్రాల్లో కూడా దాడులు కొనసాగుతోన్నాయి. మా పార్టీ ప్రధాన కార్యదర్శిపైనే రెండు సార్లు దాడికి యత్నించారు. ఇప్పుడు ఎవరిది టెర్రరిస్టు పార్టీయో అర్థమవుతోంది. కేరళకు లౌకిక వాదాన్ని రక్షించే చరిత్ర ఉంది. దశాబ్దాల తరబడి లౌకిక విలువలకు నెలవుగా కేరళ ఉంది. దాన్ని మతతత్వ కేరళగా మార్చాలని కొన్ని శక్తులు కుట్రలు చేస్తోన్నాయి. కేరళ ప్రజలు అందుకు ఆస్కారం ఇవ్వరు. రాజకీయ హింసను, రాజకీయ హత్యలను రూపు మాపేందుకు సీపీఐ(ఎం) విధాన రూపకల్పన చేసింది. అందులో భాగంగానే శాంతి సభలను నిర్వహిస్తోంది. ఈ నెల 9న అఖిల పక్ష సమావేశం నిర్వహిస్తున్నారు. దీన్ని గమనంలో పెట్టుకొని బీజేపీ నేతలైనా, ఎంపీలైనా మాట్లాడాలి" అని హితవు పలికారు. వెంటనే బీజేపీ ఎంపీలు అరుపులు, కేకలు వేస్తూ సభలో గందరగోళం సృష్టించారు. కరుణాకరన్‌ను మాట్లాడనివ్వకుండా అడ్డుకునేందుకు కుటిల ప్రయత్నం చేశారు. కాని కరుణాకరన్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. రెచ్చిపోయిన అధికార బీజేపీ సభ్యులు సభను సజావుగా జరగనివ్వకుండా అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ(ఎం) లోక్‌సభ పక్ష ఉపనేత ఎం.డి సలీం స్పీకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీరు మీ సభ్యుల్ని నిలువరించలేరా? సభను సజావుగా నిర్వహిం చలేరా? ఇది పద్ధతి కాదు. ప్రజాస్వామ్యంలో ఎవరికైన మాట్లాడే హక్కు ఉంటుంది. మీరే మాట్లాడేందుకు అవకాశం ఇచ్చారు. మీరిచ్చిన అవకాశాన్ని సభ్యుడు వినియోగించుకో వాలంటే, సభ సజావుగా నిర్వహించాలి. మీ సభ్యులు అసహనంతో రెచ్చిపోతున్నారు. తప్పుంటే కదా అంతలా రెచ్చిపోతారు. మాపై బురద జల్లి, మా హక్కును కాలరాస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ సభ్యుల దురుస ప్రవర్తనపై సభలోని ఇతర పార్టీల సభ్యులు నివ్వెరపోయారు. వెంటనే లోక్‌సభ ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ ఉపనేత జ్యోతిరాధిత్య సింధియా, కాంగ్రెస్ ఎంపిలు కె.సి వేణుగోపాల్, సురేష్, స్వతంత్ర ఎంపిలు లేచి అధికార పార్టీ సభ్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో స్పీకర్ సభను వాయిదా వేశారు. అనంతర ప్రారంభమైన సభలో కరుణాకరన్ మాట్లాడేందుకు స్పీకర్ అవకాశం ఇవ్వలేదు. దీంతో సీపీఐ(ఎం) ఎంపిలు వెల్‌లోకి దూసుకెళ్లి స్పీకర్ పోడియం వద్ద నినాదాలు చేశారు. వారికి మద్దతుగా స్వతంత్ర ఎంపీలు కూడా ఆందోళనలో పాల్గొన్నారు. "మాకు న్యాయం కావాలి. ప్రజాస్వామ్యాన్ని హత్య చేయొద్దు, ప్రతిపక్షాల గొంతు నొక్కొద్దు" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీపీఐ(ఎం) సభ్యుల ఆందోళనకు తలొగ్గిన స్పీకర్ మాట్లాడేందుకు అవకాశమిచ్చారు. కరుణాకరన్ మాట్లాడటం ప్రారంభించగానే, అధికార బీజేపీ సభ్యులు మళ్లీ రెచ్చిపోయారు. అరుపులు, కేకలు వేస్తూ భయాందోళనలను సృష్టించారు. వెంటనే స్పీకర్ రెండు నిమిషాలైన మాట్లాడకుండానే మైక్ కట్ చేశారు. అయినా సరే తన ప్రసంగాన్ని కొనసాగించి పూర్తి చేశారు. అనంతరం కరుణాకరన్, సలీం మీడియాతో మాట్లాడుతూ "అధికార పక్షం వ్యూహంలోనే సభ వాయిదా పడింది. బీజేపీకి చెందిన ఇద్దరు ఎంపీలు అరగంట సేపు గందరగోళం సృష్టించారు. మాట్లాడే ప్రాథమిక హక్కును కాలరాశారు. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని హత్య చేస్తోంది" అని విమర్శించారు.





పన్సారే హంతకుల ఆచూకీ తెలిపితే 10 లక్షల రివార్డు

ముంబయి: కమ్యూనిస్టు సీనియర్ నేత, హేతువాది గోవింద్ పన్సారేను కాల్చి చంపిన వారి ఆచూకీ తెలిపితే రూ.10 లక్షల రివార్డు ఇస్తామని మహారాష్ట్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. 2015, ఫిబ్రవరి 16న పన్సారే, ఆయన భార్యపై గుర్తు తెలియని ఇద్దరు దుండగులు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఘటనలో తీవ్రంగా గాయపడిన పన్సారే ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఫిబ్రవరి 20న కన్ను మూశారు. అయితే కాల్పులకు తెగబడిన ఇద్దరిని వినయ్ పవార్, సారంగ్ దిలీప్‌గా పోలీసులు గుర్తించారు. కానీ, ఘటన జరిగి రెండున్నరేండ్లు జరిగినా వారిని పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారు. రివార్డుతో పాటు ఇద్దరు నిందితులపై నాన్ బెయిలబుల్ వారెంట్ కూడా జారీ అయ్యింది.

సెప్టిక్ ట్యాంకు కడగాలంటూ ఒత్తిడి

- దళిత విద్యార్థులకు తీవ్ర అస్వస్థత
- తమిళనాడులోని ప్రభుత్వ పాఠశాలలో ఘటన

చెన్నై: విద్య నేర్చుకునేందుకు పాఠశాలకు వెళ్తే చేయకూడని పనులు చేయించారు. చెత్త ఎత్తిపోయడం, నాళాలను శుభ్రం చేయడం వారికి నిత్య కృత్యాలుగా మారాయి. ఆఖరుకు దళిత విద్యార్థులతో సెప్టిక్ ట్యాంకును కడిగించేందుకు కూడా ఆ పాఠశాల యంత్రాంగం వెనుకాడలేదు. ఈ క్రమంలోనే కొందరు విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారు. తమిళనాడులోని ప్రభుత్వ పాఠశాలలో చోటు చేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రామేశ్వరంలోని మండపం ప్రాంతంలో ఉన్న సర్కారు బడిలో 120 మంది విద్యార్థులున్నారు. పాఠశాలలోని సెప్టిక్ ట్యాంక్ నుంచి కొద్దిరోజులుగా దుర్వాసన వస్తుండటాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి యంత్రాంగానికి ఫిర్యాదు చేశారు. అయితే.. 6, 7 తరగతులు చదువుతున్న దళిత విద్యార్థులతో ట్యాంకును కడిగించేందుకు పాఠశాల యంత్రాంగం సిద్ధపడింది. విద్యార్థులు ట్యాంకు మూతను తీసేసరికి విష వాయువులు ఒక్కసారిగా బయటకు వచ్చాయి. దీంతో పలువురు విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురవడంతో వారిని ఆస్పత్రిలో చేర్పించారు. ఘటన జరిగిన పదిరోజులైనా కొందరు విద్యార్థులు ఇంకా కోలుకోలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు బడిలో టీచర్ల వేధింపులు కూడా ఎక్కువే అని విద్యార్థులు వాపోతున్నారు. ఘటనపై విద్యాశాఖ అధికారులు దర్యాప్తు చేపట్టారు.

అమిత్‌షా కోసం స్కూళ్లకు సెలవు

- బస్సులన్నింటినీ ర్యాలీ కోసం కేటాయించిన వైనం

రోహ్‌తక్: బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా పర్యటన సందర్భంగా హర్యానాలోని రోహ్‌తక్‌లో స్కూళ్లకు సెలవు ప్రకటించాలని జిల్లా పరిపాలనా విభాగం ఒత్తిడి తెచ్చింది. ఈ క్రమంలో ప్రయివేటు పాఠశాలల బస్సులన్నింటినీ అమిత్‌షా ర్యాలీ కోసం కేటాయించడం గమనార్హం. అయితే, రాజకీయ పార్టీల కార్యక్రమాలకు స్కూల్ బస్సులను వినియోగించవద్దన్న నిబంధన బీజేపీకి వర్తించదా? అని నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు(స్కూల్ బస్సులను రాజకీయ పార్టీల కార్యకలాపాల కోసం వినియోగించడంపై నిషేధం విధిస్తున్నట్టు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రామ్‌నివాస్ ఈ యేడాది మార్చిలో పంజాబ్-హర్యానా హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు). రోహ్‌తక్‌లో బుధవారం స్కూళ్లకు సెలవులు ప్రకటిస్తున్నట్టు మంగళవారం రాత్రి విద్యార్థుల తల్లిదండ్రులకు యాజమాన్యాలు సమాచారం ఇచ్చాయి. అమిత్‌షా పర్యటన కోసం బస్సులను పంపాలని జిల్లా పరిపాలనా విభాగం నుంచి ఆదేశాలు అందిన నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు యాజమాన్యాలు వివరించాయి. మరోవైపు పార్టీ ర్యాలీల కోసం స్కూల్ బస్సులను కేటాయించడాన్ని నిరసిస్తూ పాఠశాలల నిర్వాహకులు.. కోర్టును ఆశ్రయించారు. నిబంధనలను రాష్ట్రప్రభుత్వం ఖాతరు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మరోసారి రెచ్చిపోయిన 'గో రక్షకులు'

భోపాల్, పాట్నా : ఆవు రక్షణ పేరుతో దళితులు, ముస్లింలను కొట్టి చంపుతున్న మతాలపై చర్యలు తీసుకోవాలని, హిందుస్తాన్‌ను లించిస్తాన్‌గా మార్చొద్దంటూ పార్లమెంటులో ప్రతిపక్షాలన్నీ పెద్దఎత్తున ఆందోళన చేస్తుండగా... మరోపక్క వారి ఆగడాలు మాత్రం యథేచ్ఛగా కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో 'గో రక్షకులు' రెచ్చిపోయిన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఆవుల స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారన్న అనుమానంతో మధ్యప్రదేశ్‌లో నలుగురిని గోరక్షకులు చితకబాదారు. బేటుల్ జిల్లా శివారు గిరిజన గ్రామంలో గతవారం జరిగిన ఈ దారుణ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. కాగా, దాడికి పాల్పడిన వారు పరారీలో ఉన్నారని, బాధితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నా మని పోలీసులు తెలిపారు. గ్రామంలో జనమంతా చూస్తుండగానే నలుగురు యువకులను కట్టేసి... అతి క్రూరంగా కొట్టినట్టు వీడియోలో కనిపిస్తోంది. 'శ్యామ్, మనక్, సుందర్ ప్రతాప్, మరికొందరు గోరక్షక దళం సభ్యులపై కేసు నమోదుచేశాం. వారంతా పరారీలో ఉన్నారు' అని సబ్ డివిజనల్ పోలీసు అధికారి ప్రేమ్ సింగ్ టాకూర్ చెప్పారు. అలాగే గోవుల స్మగ్లింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న బాధి తులైన సమీప హర్దా జిల్లా రేహత్గో గ్రామానికి చెందిన యువకులపై కూడా మరో కేసు నమోదు చేసినట్టు చెప్పారు. 'వీడియో క్లిప్‌ను పరిశీలిస్తున్నాం, దాని ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటాం' అని ప్రేమ్ సింగ్ చెప్పారు.

బీఫ్ తరలిస్తున్నారన్న అనుమానంతో...

బీహార్‌లోని బోజ్‌పూర్ జిల్లాలో బీఫ్ తరలిస్తున్నారన్న అనుమానంతో ముగ్గురు వ్యక్తులపై హిందూత్వ దళాలు దాడి చేశాయి. ట్రక్కు డ్రైవర్, మరో ఇద్దరిని కొట్టి, అనంతరం బాధితులను పోలీసులకు అప్పగించారు. కాగా, వారిని జిల్లా మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. షాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాణిసాగర్‌లో గల అక్రమ కబేళాల నుంచి ఈ మాంసాన్ని తరలిస్తున్నారని పోలీసులు మేజిస్ట్రేట్‌కు తెలిపారు. అక్రమ కబేళాలను నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు. మాంసాన్ని పరీక్ష నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాల్సిందిగా జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశించారు.

ప్రభుత్వ వాహనంతో జల్సా

లెప్రసీ అండ్ టీ శాక్స్ అధికారి నిర్వాకం



వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో వెలిసిన పోస్టర్ ఇదే...

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ వాహనాన్ని కుటుంబ సభ్యుల కోసం ఉపయోగిస్తున్న ఓ అధికారి నిర్వాకం ఆలస్యంగా వెలుగు చూసింది. కొన్నేండ్లుగా ఈ వ్యవహారం జరుగుతున్నదని పలువురు వ్యాఖ్యానించడం విశేషం. జాన్‌బాబు అనే అధికారి రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖలో లెప్రసీ అడిషనల్ డైరెక్టర్‌గానూ, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (టీ శాక్స్) ప్రాజెక్టు డైరెక్టర్‌గానూ విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు ప్రభుత్వం లెప్రసీ విభాగం నుంచి ఒక వాహనం (ఏపీ 28 డబ్ల్యూ 2154), టీ శాక్స్ నుంచి ఇంకో వాహనాన్ని (ఏపీ 9 ఏకే 9900) కేటాయించింది. అయితే డాక్టర్ జాన్‌బాబు ఈ రెండు వాహనాలను వినియోగిస్తుండటం గమనార్హం. ఇందులో ఒక వాహనాన్ని అధికారికంగా వాడుతుండగా, మరో వాహనాన్ని ఇంటివద్ద కుటుంబ సభ్యుల కోసం ఉపయోగిస్తునారనే వాల్‌పోస్టర్లు కోఠిలోని ఆ శాఖ ప్రధాన కార్యాలయంలో కలకలం రేపుతున్నాయి. డీజిల్ పేరుతో అక్రమంగా నిధులను కాజేస్తూ ప్రభుత్వ ధనాన్ని కొల్లగడుతున్నారనేది ఆ పోస్టర్ల సారాంశం.

మరోవైపు ఆ శాఖలో ఏ నలుగురు ఉద్యోగులు కలిసిన దీని గురించే చర్చించుకోవడం కనిపించింది. ఇలాంటి అధికారులపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వినిపిస్తున్నది. ఇదే విషయమై గత నెల 18న ఎం. లింగయ్య అనే వ్యక్తి కమిషనర్ వాకాటి కరుణకు ఫిర్యాదు చేశారు.

పోలీస్ మొబైల్ ఎంప్లాయ్‌మెంట్

- వ్యాన్‌ను ప్రారంభించిన డీజీపీ

నవ తెలంగాణ,ప్రత్యేక ప్రతినిధి

ప్రజలతో మరింతగా సన్నిహితం కావడానికి నిరుద్యోగ యువతకు ఏయూత నిచ్చే కార్యక్రమాన్ని పోలీసు ఉన్నతాధికారులు చేపట్టారు. ఇందులో భాగంగా పోలీసు-టీఎంఐ సంస్థల భాగస్వామ్యంగా కొత్తగా ఎంప్లాయ్‌మెంట్ మొబైల్ వ్యాన్‌ను రాష్ట్ర డీజీపీ అనురాగ్‌శర్మ గురువారం డీజీపీ కార్యాలయం ప్రాంగణంలో ప్రారంభించారు. నగర పోలీసు శాఖ, టీఎంఐ సంస్థలు చేసుకున్న ఒప్పందం మేరకు వివిధ కంపెనీలకు అవసరమైన ఉద్యోగులను సమకూర్చి పెట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతు పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను మరింతగా పటిష్ట పరిచే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం రిగిందన్నారు. దీని వలన చదువుకోని, చదువుకున్న యువతకు అవసరమైన వివిధ కంపెనీలు, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలను వెతికి పెట్టడానికి వీలవుతుందని అన్నారు.

విక్రమ్‌గౌడ్ అరెస్టు

కోర్టులో హాజరుపర్చిన పోలీసులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మాజీ మంత్రి ముఖేశ్‌గౌడ్ తనయుడు, కాంగ్రెస్ నేత విక్రమ్ గౌడ్‌ను హైదరాబాద్‌లో గురువారం పోలీసులు అరెస్టు చేశారు. ప్రజల సానుభూతి పొందేందుకు తనపై కాల్పుల డ్రామాకు తెరదీసిన విక్రమ్ గాయాలతో అపోలోలో చికిత్స పొందిన విషయం తెలిసిందే. కోలుకున్న విక్రమ్‌ను గురువారం వైద్యులు డిశ్చార్జి చేశారు. ఆ వెంటనే బంజారాహిల్స్ పోలీసులు విక్రమ్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించారు.

14రోజుల రిమాండ్

విక్రమ్ గౌడ్‌కు నాంపల్లి న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ ఘటనలో ఆయనతో సహా మొత్తం ఆరుగురిని అరెస్టుచేసిన పోలీసులు గురువారం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. విచారించిన న్యాయస్థానం విక్రమ్ గౌడ్‌కు 14 రోజుల రిమాండ్ విధించింది. దాంతో విక్రమ్‌ను పోలీసులు చంచల్‌గూడ జైల్‌కు తరలించారు. అయితే విక్రమ్‌గౌడ్ గాయపడి ఉన్నారని, మరికొన్ని రోజులు చికిత్స అవసరమని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు.

దీంతో విక్రమ్‌కు ఉస్మానియా లేదా గాంధీ ఆస్పత్రిలో వైద్యం చేయించాలని జైళ్ల శాఖను న్యాయస్థానం ఆదేశించింది. విక్రంగౌడ్‌కు చికిత్స అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని జైలు అధికారులు తెలిపారు.

సంపాదకీయం

ప్రగతిశీల వెబ్‌సైట్లను నిరోధిస్తున్న గూగుల్!

వర్గ సమాజంలో సామాజిక తాటస్థ్యం దుస్సాధ్యమైనట్టే సాంకేతిక తాటస్థ్యం కూడా దుస్సాధ్యమేనని ఇంటర్‌నెట్‌లో గూగుల్ పోషిస్తున్న పాత్ర మరోసారి గుర్తుచేస్తున్నది. గత మూడు నెలలుగా సామ్యవాద, యుద్ధ వ్యతిరేక, ప్రగతిశీల వెబ్‌సైట్లు గూగుల్ సెర్చ్‌లో 45శాతం ట్రాఫిక్ కోల్పోయాయని ఇంటర్‌నెట్ వార్తా సంస్థల ప్రతినిధులు, సెర్చ్ సాంకేతిక నిపుణులు పేర్కొంటున్నారు. గూగుల్ సెర్చ్ ప్రొటోకాల్స్‌లో ఉద్దేశపూర్వకంగా చేసిన మార్పు ఫలితంగా ఇలా జరుగుతున్నది. 'ఇబ్బందికరమైన' వెబ్‌సైట్లను నిరోధించేందుకు, 'అధికారిక సమాచారాన్ని' మరింతగా అందుబాటులోకి తెచ్చేవిధంగా గూగుల్ సెర్చ్ ఇంజిన్‌లో మార్పులు తీసుకువచ్చామని గూగుల్ ఇంజినీరింగ్ విభాగంలో ఉపాధ్యక్షుడిగా వున్న బెన్ గోమ్స్ ఏప్రిల్25వ తేదీన విడుదల చేసిన ఒక ప్రకటనలో చెప్పాడు. గూగుల్ చేసిన ఈ మార్పు ఫలితంగా గణనీయమైన సంఖ్యలో పాఠకులు గల 13వెబ్‌సైట్లపై ప్రతికూల ప్రభావం పడుతున్నదని సెర్ముస్ అందిస్తున్న సమాచారం తెలియజేస్తున్నది.

అన్ని ప్రపంచ భాషలలో గల ప్రగతిశీల వెబ్‌సైట్లలో ఈ సెన్సార్‌షిప్‌కు వ్యతిరేకంగా ప్రతిఘటన ఉండాలి. ఇంటర్‌నెట్‌పై కార్పొరేట్-రాజ్య పెత్తనానికి వ్యతిరేకంగా చేసే పోరాటం ప్రజల ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణకు కేంద్రంగా ఉంటుంది గనుక ఈ పోరాటంలో ప్రపంచంలోని అన్ని ప్రగతిశీల శక్తుల ఐక్యత ప్రతిబింబించాలి.

గూగుల్ చేసిన మార్పువల్ల జరిగిన నష్టం ఈవిధంగా ఉన్నది. wsws.org 67శాతం, alternet.org 63 శాతం, globalresearch.ca 62శాతం, consortiumnews.com 47శాతం, socialistworker.org 67శాతం, mediamatters.org 42శాతం, commondreams.org 67శాతం, internationalviewpoint.org 36శాతం, democracynow.org 36శాతం, wikileaks.org 30శాతం, truthout.org 25శాతం, counterpunch.org 25శాతం, theintercept.com 19శాతం ట్రాఫిక్ పతనమైంది. గూగుల్‌వంటి గుత్త పెట్టుబడిదారీ ఐటీ కంపెనీలు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇటువంటి కుట్రలకు పాల్పడటానికి కారణమేమిటి? అనే ప్రశ్నకు జవాబు ప్రపంచ ప్రజలలో సోషలిస్టు రాజకీయాలపట్ల అనూహ్యంగా పెరిగిన ఆసక్తిలో ఉన్నది. ముఖ్యంగా 2016లో గూగుల్ తన సెర్చి ఇంజిన్ ప్రొటోకాల్స్ మార్చటానికి 12నెలల ముందు అనేక ప్రగతిశీల, సోషలిస్టు వెబ్‌సైట్లను దర్శించే పాఠకుల సంఖ్య ఊహాతీతంగా పెరిగింది. ఈ పెరుగుదల గూగుల్ శోధనల్లో నమోదయింది. ట్రంప్ ఎన్నికై తరువాత ప్రజలలో సోషలిస్టు రాజకీయాలపట్ల విపరీతమైన ఆసక్తి పెరిగింది. ఈ ఆసక్తి 2017 ఏప్రిల్ నెలలో శిఖరాగ్రానికి చేరుకుంది. సరిగ్గా ఇదే సమయంలో గూగుల్ తన సెన్సార్‌షిప్ ప్రొటోకాల్స్ అమలు చేసింది. ఆ విధంగా లక్షిత ప్రగతిశీల వెబ్‌సైట్లను ప్రజలకు అందుబాటులో లేకుండా చేయటానికి గూగుల్ అమెరికా సామ్రాజ్యవాదం చేతుల్లో ఆయుధంగా మారి అనేక రకాల ప్రొటోకాల్స్ రూపొందిస్తున్నది. పైన వివరించిన ప్రగతిశీల వెబ్‌సైట్ల పట్టికను గూగుల్ బహిరంగంగా రూపొందించింది. ఈ వెబ్‌సైట్లకు ప్రతికూల రేటింగ్ ఇవ్వటం ద్వారా వాటిలోని వ్యాసాలను అందుబాటులోకి రాకుండా గూగుల్ జాగ్రత్తలు తీసుకుంటున్నది. అంతేకాకుండా గూగుల్



ఎంపికలను, దాని రాగద్వేషాలను కంప్యూటర్లు అనుసరించే విధంగా ఒక నూతన ప్రోగ్రామింగ్ టెక్నాలజీని గూగుల్ సృష్టించింది. అంతిమంగా సోషలిస్టు, వామపక్ష, ప్రగతిశీల రాజకీయాలలో వాడే పారిభాషిక పదాలను, పద బంధాలను, వివిధ విషయాలను విస్మరించే టెక్నిక్‌లను ఈ ఆపరేషన్‌లో గూగుల్ వాడుతున్నది.

తత్ఫలితంగా యుద్ధం, భౌగోళిక రాజకీయాలు, సామాజిక అసమానతలు, కార్మికవర్గ పోరాటాలు వంటి విషయాలపై దృష్టిని సారించే వెబ్‌సైట్స్ గూగుల్ శోధనలలో లిస్టు కావటం లేదు. దానితో సాధారణ స్థితిలో 'సోషలిజం', 'మార్క్సిజం'వంటి విషయాలపై శోధించినప్పుడు అత్యంత ఎక్కువ సంఖ్యలో లిస్ట్ అయ్యే వెబ్‌సైట్ల సంఖ్య ప్రస్తుతం పడిపోయింది. మరింత పదునైన సాంకేతిక పరిజ్ఞానం ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తుందనటం సందేహం లేదు. ఇప్పటివరకు సేకరింపబడిన సమాచారాన్ని బట్టి అర్థమవుతున్నదేమంటే ప్రజల ప్రజాస్వామిక హక్కులపై దాడి చేయటానికి కార్పొరేట్-రాజ్యం పన్నిన వ్యూహంలో గూగుల్ క్రియాశీలంగా పనిచేస్తున్నది. సామాజిక అసమానతలను, యుద్ధాలను, నియంతృత్వాలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఈ వ్యతిరేకతలు ఉద్యమాలుగా పరిణామం చెందకుండా చేయటానికి వారికి వాస్తవ సమాచారం అందకుండా చూడటం ఒక మార్గం. ఈ మార్గాన్ని అవలంబించి గూగుల్ ప్రజల వాక్‌స్వాతంత్ర్యం మీద దాడి చేస్తున్నది. ఈ దాడిలో గూగుల్ పోషిస్తున్న పాత్ర ఇంటర్‌నెట్‌పై కార్పొరేట్ నియంత్రణ వాక్‌స్వాతంత్ర్యానికి, స్వేచ్ఛాయుత ఆలోచనకు ప్రమాదకారిగా మారగలదని సూచిస్తున్నది.

ఇలా ప్రజల ప్రాథమిక హక్కులపై గూగుల్ చేస్తున్న దాడిని యావత్ ప్రపంచ ప్రజలంతా నిరసించాలి. గూగుల్ అనుసరిస్తున్న ఈ ఇంటర్‌నెట్ సెన్సార్‌షిప్ కార్యక్రమాన్ని వెంటనే నిలిపివేయాలనే డిమాండ్ అన్ని దేశాలలో ప్రతిధ్వనించాలి. అంతేకాకుండా అన్ని ప్రపంచ భాషలలో గల ప్రగతిశీల వెబ్‌సైట్లలో ఈ సెన్సార్‌షిప్‌కు వ్యతిరేకంగా ప్రతిఘటన ఉండాలి. ఇంటర్‌నెట్‌పై కార్పొరేట్-రాజ్య పెత్తనానికి వ్యతిరేకంగా చేసే పోరాటం ప్రజల ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణకు కేంద్రంగా ఉంటుంది గనుక ఈ పోరాటంలో ప్రపంచంలోని అన్ని ప్రగతిశీల శక్తుల ఐక్యత ప్రతిబింబించాలి.

గతించిన గరక గురించి భయమెందుకో...!



ఎం. విప్లవ కుమార్

ఎవడురా కూసింది... కమ్యూనిజం చచ్చిపోయిందని
ఎవడురా తెగనాడింది.. ఎర్రజెండా నేలకొరిగిందని...
తూర్పున సూర్యుడు పొడిచినంతకాలం
మనిషి ఒంట్లో రక్తం ఎర్రగా ఉన్నంతకాలం
కమ్యూనిజం అజేయం దాన్ని ఆపడం ఎవడబ్బ తరం...

అని ఎలుగెత్తి చాటిన తెలంగాణ మహాకవి సినారె అంతిమయాత్రలో పాల్గొని నెల్లాళ్ళు అయిందో లేదో ఆయన చెప్పిన కవిత్వం అప్పుడే యాదిమరిసినట్టుంది సారూ. గిప్పుడు తెలంగాణ ప్రభుత్వాధినేత అన్నట్టే తన మాతృసంస్థ తెలుగుదేశం అధినేత చంద్రబాబు ఉమ్మడి

గరకతిన్న గాడిద గతిస్తుందేమో కాని గరక మాత్రం ఎన్నడూ గతించదని ప్రత్యర్థులకు తన చలోక్తులతో బుద్ధిచెప్పిన విషయం ఇప్పుడు గుర్తొస్తోంది. కాబట్టి అధికారాలను అధిరోహించి ఆసాంతం తామే ఉండాలనుకునేవారు గతించడం అనివార్యం. కానీ అనునిత్యం ప్రకృతిలా, తలలో నాలుకలా ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టులు గతిస్తారనడం మతిచలించినవారి మాటలేనన్నది చరిత్ర రుజువు చేస్తున్న సత్యం.

రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా కమ్యూనిస్టులు గతించిపోయారని మాట్లాడిండు. 2009 ఎన్నికల ఆపతి రాంగనే గతించిన పార్టీలన్నవాటితో సోపతి కూడితే తప్ప భవిష్యత్ లేదని కమ్యూనిస్టులతో టీడీపీ టీఆర్ఎస్‌లు సర్దుబాటు చేసుకున్న సంగతి మరిచిపోతే ఎట్టా. గతించారని చేసిన ప్రచారమంతా బూటకం, రాజకీయ స్వార్థంకోసమేనని అర్థమవుతల్లేదా? తెలుగుదేశం నుండి పుట్టుకొచ్చిన ఇద్దరు చంద్రులకు అధికారం ఉన్నప్పుడల్లా కమ్యూనిస్టులను ఎన్నిసార్లు గతింపచేస్తారో! ఓ భూమిలో వరి నాటు పెడితే ఎకరానికి 6 పుట్లు పండితే ఇంకోసారి మూడే పండొచ్చు, లేందంటే కాలం గాకపోవచ్చు, చీడపట్టొచ్చు. ఎవుసం అంతా చేతికి రాకపోవచ్చు. అయినంతమాత్రాన ఆ భూమి గతించిందని మూర్ఖుడు మాత్రమే చెప్పగలడు. మాటవరసకు గతంలోకి తొంగి చూస్తే గతం లోతు, ఎత్తు, పొడుగు, విస్తీర్ణం, విలువ, సారం కనిపిస్తుంది. గతం వర్తమానానికి వారథే కాదు రహదారి కూడా. రహదారి కదా అని రయ్యినపోతాంటే సరికాదు. మంచి చెడు జూసుకోవాలే. నలుగురి మాట వినాలే. వారిని మెప్పించి ఒప్పించాలే. అధికారం ఉందని యాడికైనా ఎక్కేస్తాం, జనాన్ని తొక్కేస్తాం అంటే కుదరదు. నేటి ప్రవర్తన పరిపాలనే రేపటి ఫలితాలకు ప్రతీకగా నిలుస్తాయన్నది మరువరాదు. ఎందుకంటే వర్తమానం భవిష్యత్తుకూ కొనసాగింపు. అందుకే గతంపై గౌరవం, వర్తమానంపై బాధ్యత, భవిష్యత్‌పై ముందుచూపుండాలి. నాలుగు నెలల కింద హైదరాబాద్ వస్తే ఇంటికి ఆహ్వానించి మర్యాదలు చేసింది కమ్యూనిస్టు ముఖ్యమంత్రికేనన్న సంగతికూడా యాదుండకుంటే ఎట్లా? ఒకే పార్టీ ఒక రాష్ట్రాన్ని ఏకబిగిన ఎక్కువ ఏండ్లు పాలించింది కమ్యూనిస్టులే. ఇప్పటికీ దేశంలోని కేరళ, త్రిపుర రాష్ట్రాల్లో అధికారంలో ఉండటమే కాదు ఆదర్శవంతమైన పాలన అందిస్తూ అన్ని రంగాల్లో అగ్రశ్రేణిలో నిలుపుతుందీ కమ్యూనిస్టులే. చరిత్రను మరిచినోడెప్పుడూ బతికి బట్టకట్టిన దాఖలాలు లేవు. కాలగర్భంలో కలిసిపోతాడంతే.

ఒక వ్యక్తి పదునైన భాష మాట్లాడవచ్చు, తన యాస ప్రాకారమై వర్ధిల్లవచ్చు, పదాలపై పట్టుండవచ్చు అలాంటి వ్యక్తి ఒక రాష్ట్రాధినేత స్థానంలో ఉండి ఏది మాట్లాడినా చెల్లుతుందనుకుంటే పొరపాటే. ఆ స్థాయి వారి నోటి నుండి వచ్చే పదాలు పచ్చదనాన్ని ప్రసరిస్తున్నట్టుండాలే. శత్రువునుండైనా సరే స్నేహాన్ని కోరుతున్నట్టుండాలే. అందరినీ కలుపుకుపోగలిగే విశాల స్వభావం కలిగి ఉండాలే. ఆపతి ఉందని వస్తే కలిసేందుకు అపాయింట్‌మెంట్ ఇయ్యాలే. కనీసం ఆదరించడమైనా ప్రాథమిక లక్షణమని గుర్తెరగాలి. ఆ నా కొడుకులకు అపాయింట్‌మెంట్ ఎందుకియ్యాలే అని సాక్షాత్తూ ముఖ్యమంత్రే మాట్లాడాల్సిన మాటాలా ఇవి? అనామకుడిలా, అవాకులూ, చెవాకులూ పేలడం అడ్డం, నిలువు మాట్లాడడం అనాగరిక సంస్కృతి. గల్లీల్లో కొట్లాడేప్పుడు తిట్టుకునే మాటలు అంతటి మనిషి నోటి నుండి రావడం సిగ్గుచేటు.

జనం సమస్యలనే జెండాగా చేసి వాటి పరిష్కారంకోసం తమ జీవితాన్నే ఎజెండాగా మలిచే కమ్యూనిస్టులకు అపాయింట్‌మెంట్ ఇస్తే తప్పేమిటి? ఏ సమస్యనైనా లోతుగా అధ్యయనం చేసి విశదీకరించే కమ్యూనిస్టులపై మూర్ఖంగా మాట్లాడుతారు కాబట్టే అపాయింట్‌మెంట్ ఇవ్వననే అభాండం ఒకటి. 80వేల పుస్తకాలు చదివిన మనిషికి ఎవరు చెప్పినా వినకుండా ఏకపక్షంగా చేస్తున్న తన నిర్ణయాలన్నీ సరైనవేనని మెప్పించలేడా? బహుశా అలా చేయలేనివారే అడిగేవారిని కలవడానికి నిరాకరిస్తారేమో! తన ఏకపక్ష నిర్ణయాలను ప్రశ్నించడం, పదిమందికి విప్పి చెప్పి చైతన్యం చేయడం మూలంగానే వామపక్షాలపై ఇంత అక్కసుకు కారణం కావచ్చు. కలవడానికి వచ్చినవారికి ఎవరైనా అపాయింట్‌మెంట్ ఇచ్చి చర్చల ద్వారా పరస్పర అనుమానాల నివృత్తిద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలిగాని అపాయింట్‌మెంటే ఇవ్వను అనడం నిజమైన మూర్ఖత్వమే అనిపిస్తుంది. మూడేండ్ల పాలనలో ఒకటీ అరా మినహా ఏ సమస్యపైనైనా అఖిలపక్ష సమావేశం కూడా వేయకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం నియంత ధోరణికి నిదర్శనం కాదా? పైగా భిన్నాభిప్రాయాలు చెప్పినవారిని నిందించడం నాకంటే నీకే ఎక్కువ తెలుసా అని దబాయించడం పరిపాటిగా మారింది. మంత్రులకు, ఎంఎల్ఎలకు కూడా అపాయింట్‌మెంట్ దొరకడంలేదని మొత్తుకుంటుంటే ఇక సామాన్య ప్రజలకు దిక్కెవరు ప్రతిపక్షాలు, కమ్యూనిస్టులు తప్ప. నా జీవితంలో అత్యంత కీలకమైన 15 సంవత్సరాలు కష్టపడ్డా. అప్పుడు ఈ కూతలు కూసే నా కొడుకులు ఎక్కడున్నారు? వీళ్లెవరండీ నా కొడుకులు అని వికారంగా మాట్లాడడం తెలంగాణ సమాజానికి మాయనిమచ్చ. తెలంగాణ చైతన్య మూలాలకు ప్రమాదకర గుర్తు.

కాలం కడుపుతో కమ్యూనిజాన్ని కన్నదని, కాలం - కమ్యూనిజం వేరు కావని జర్నలిస్టులకు తెలుసు. అలాంటి వారితో మీరు కాలం చెల్లినవాటిని పట్టుకొని వేలాడడంలో అర్థం లేదని హితవు పలకడం తెలంగాణ దొరకే చెల్లింది.




ఒకవైపు వామపక్షాలు ఉన్నాయా? వారెంత శాతం ఉన్నారో అంటూ మరోవైపు పోచంపాడులో వామపక్షాలను నిలదీయడం కాదు. ఎండగడతాననడం తన ద్వంద్వ నీతికి అద్దం పడుతోంది. లేరు, గతించిపోయారంటూనే వామపక్షాల మగటిమి గురించి మాట్లాడడం వారి శక్తి ప్రభావాల ఒప్పుకోలుకు, తన పురుషాధిక్య నోటిదురుసుకు నిదర్శనంగా కనిపిస్తోంది. అరసమ్మె అవసరం కూడా రాకుండానే కార్మికుల డిమాండ్లు నెరవేరాలని కోరుకునేది కేవలం కమ్యూనిస్టులు, కార్మిక సంఘాలు మాత్రమే. అలాంటి ప్రజా కార్మిక సంఘాలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినందుకు ప్రశంసించడం ప్రజాస్వామ్య కర్తవ్యం. దానికి బదులు వారిని పగపట్టడం, పరమశత్రువుల్లా చూడడం, చిలవలు పలవలుగా ప్రచారం చేయడం దేనికి? ప్రభుత్వమే సమస్యలు పరిష్కరిస్తే సమ్మెల అవసరమేముంది? కాని సమస్యను ఎలుగెత్తినపుడు పరిష్కరించకుండా పట్టుదలకు పోయి ఇప్పుడు సరే అంటే ఆ పేరు కమ్యూనిస్టులకేడ వస్తుందోనని సమ్మెలను నీరుగార్చిన సంగతి కార్మికులకు తెలవందైతే కాదు.

రాష్ట్రంలో నిక్కచ్చిగా ప్రజల పక్షాన వుండి అసలైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న పత్రిక నవతెలంగాణ. కాబట్టి అలాంటి పత్రికను కూడా వదలకుండా దుర్విమర్శలతో ముంచెత్తడం సబబు కాదు. రాష్ట్రం మొత్తానికి అవసరమైన ఒక ప్రాజెక్టును ఆ పత్రిక ఒక ఊరును రెచ్చగొట్టడం ద్వారా ఆపొచ్చా అని ప్రశ్నించారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు నీళ్లు రాష్ట్రం మొత్తం పారిస్తారా? అలాపారించి ఫ్లోరిన్ భూతంతో పీడింపబడుతున్న నల్లగొండ జిల్లా మర్రిగూడెం, కొమురం భీం జిల్లా లొద్దిగూడా లాంటి గ్రామాల ప్రజలకు ఇక్కడనుండే నీళ్లు తాపిస్తారా? రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా అన్నట్టు తను చెప్పిందంతా నిజమేనన్నట్టు ప్రవక్తలా ప్రవర్తిస్తే ఎట్టా? తన చేతుల మీదుగా ఆవిష్కరించిన నవ తెలంగాణ నిజంగా ప్రజల పక్షం నిలుస్తున్నందుకు సంతోషించడానికి బదులు అడ్డగోలు ఆరోపణలు చేసినా వాటిని నవతెలంగాణ పత్రిక తన ప్రజాపక్ష పాత్రకు ప్రశంసగానే స్వీకరిస్తుందని భావిద్దాం.

ఆత్మవిమర్శ చేసుకోవడం, అందరినీ కలుపుకుపోవడం, అపాయింట్‌మెంట్ ఇవ్వడంలాంటి అంశాలకు బదులు నిందాపనిందలూ తిట్లూ బూతులతోనే ప్రెస్‌మీట్ సాగిందనిపిస్తోంది. విశాలమైన ప్రజాదేహంలో గుండెలాంటి కమ్యూనిస్టులతో తన కపట పాలనకు ముప్పు వాటిల్లనున్నదనే భయంతో కలిగిన అభద్రతవల్ల వచ్చిన మాటలే కమ్యూనిస్టులు గతించిపోయిండ్రనటానికి కారణమనుకోవచ్చు. దాదాపు మూడు దశాబ్దాలు ఏకధాటిగా అసెంబ్లీలో ఉండి ఎంతో ప్రత్యేకత సంతరించుకొని అనేక మంది ముఖ్యమంత్రులను దగ్గరిగా చూసి సలహాలు సూచనలు ఇచ్చిన ప్రజానేత నర్రా రాఘవరెడ్డి. అంత అనుభవం ఉన్న పెద్ద మనిషై ఉండి కూడా ఎన్నడూ విర్రవీగలేదు. పాలక పక్షం చేసే విమర్శలకు హాస్యచతురతతో సమాధానం చెప్పేవాడే కాని నోటికొచ్చిందల్లా మాట్లాడలేదు. అలాంటివారుండిపోయిన అసెంబ్లీ పాలిస్తున్న నేటి నేతలు ఇలానా ఉండేదనిపిస్తుంది. గరకతిన్న గాడిద గతిస్తుందేమో కాని గరక మాత్రం ఎన్నడూ గతించదని ప్రత్యర్థులకు తన చలోక్తులతో బుద్ధిచెప్పిన విషయం ఇప్పుడు గుర్తొస్తోంది. కాబట్టి అధికారాలను అధిరోహించి ఆసాంతం తామే ఉండాలనుకునేవారు గతించడం అనివార్యం. కానీ అనునిత్యం ప్రకృతిలా, తలలో నాలుకలా ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టులు గతిస్తారనడం మతిచలించినవారి మాటలేనన్నది చరిత్ర రుజువు చేస్తున్న సత్యం.


సెల్ : 9030546896

ఎవుడ్రాబై ఫామౌస్‌ల కెల్లి తోల్కొచ్చింది..!



పుప్పాల మట్టయ్య

మొద్దోడు పొద్దుగాల లేసి ఆరాంచైర్ల గూసొని పేపర్ సద్వబట్టిండు. ఆడి పెల్లాం బంగారాన్ని జరంత చాయ్ దెమ్మన్నడు. అర్రలకెల్లి ఉత్త చాయ్‌కప్పు మొద్దోని మీదికి ఇసిరింది. 'ఏమైందే చాయ్‌బొయ్యమంటే ఉత్తకప్పు మీదికి ఇసిరినవ్' అన్నడు మొద్దోడు. 'గ్యాస్ ఉడ్సిపోయిందని రాత్రి జెప్తిగా. పొద్దుగాల్ల లేవంగనే చాయ్ యాడికెల్లి వస్తది. పొయి గ్యాస్ బండ తీస్కరాపో' అన్నది బంగారం. గ్యాస్‌బండ తీస్కొచ్చేందుకు బోయిండు. 'గీ డబ్బులకు గ్యాస్‌బండరాదు పో' అన్నడు దక్నపోడు. 'రొండునెలల కింద ఇచ్చినవుగా.. గిప్పుడేమైంది' అన్నడు మొద్దోడు. 'గిప్పటి సంది నెలనెలా గ్యాస్ రేటు పెంచాలని మోడీసాబ్ చెప్పిండు' అన్నడు దుక్నపోడు. 'ప్రధానమంత్రి అయితే మా బ్యాంకు ఖాతాల పదేను లచ్చలు ఏస్తనన్నోడు గిప్పుడు మా జేబుల కెల్లి డబ్బులు గుంజుడు షురూ జేసిండు.. ఇగ ఈ గ్యాస్ బండ మా నెత్తిన పెద్దబండే' అని గునుక్కుంటూ ఇంటికి బోయిండు. గట్ల ఇంట్లెకు బోతుండగానే బంగారానికి పుర్టినొప్పులు షురూ అయినయ్. దోస్తు బుచ్చిగానికి మొద్దోడు ఫోన్‌చేసి 'ఆటోదీస్కొనిరా మీ చెల్లెను దవాఖానకు తోల్కబోవాలె' అన్నడు. బుచ్చిగాడు గబ్బగబ్బ ఆటో దీస్కొని వచ్చిండు. ఆమెను ఆటోల తీస్కొని దవఖానాకు బోయిండు. గామెను ఎమర్జెన్సీ వార్డుల చేర్పిచ్చిండు. గామె నొప్పులతోని గోసదీస్తుంది. కాని ఒక్కడాక్టర్ గీన లేడు. కాంపోండర్లు మాత్రం అర్రల ఉన్నరు. 'డాక్టర్లు ఎక్కడ్రాబై'అని ఆల్లను అడిగితే 'ఆల్లు దవఖాన ఎనకాల మృత్యుంజయ




యజ్ఞం జేస్తుండ్రు' అని చెప్పిండ్రు. గబ్బగబ్బ దవఖాన ఎన్కకు బోయిండు. గక్కడ ఒక గుంట తీసి కట్టెలు, పిడకలతో మంట బెడుతుండ్రు. నడ్మనడ్మ మంటల నెయ్యి బోస్తుండ్రు.. మందు గోలీలు, సూదులు, టానిక్కులు, గ్లూకోస్‌సీసాలు, ఆపరేషన్ జేసే కత్తెర్లు అన్ని గుంట చుట్టూ బెట్టి కూసుండ్రు. పూజారి మంత్రాలు సదువుడు షురూ జేసిండ్రు... 'ఓం శుక్లాంభర దరం విష్ణుం..శశివర్ణం చతుర్భుజం. ప్రసన్న వదనం ధ్యాయే.. సర్వ విఘ్నోపశాంతయే...' 'డాక్టర్‌గారూ..! నేను చెప్పినట్లు జెప్పండి.. 'ఓం



పారాసెట్మాలాయ నమహ, ఓం జండూబామాయ నమహ, ఓం విక్స్‌బిళ్లాయ నమహ...మధ్యమధ్య టానిక్కు సమర్పయామీ.. అయ్యా నీ కోటు విప్పి, స్టెతస్కోపు తీసి హోమగుండంలో వేయండి.. లేచి నిలబడి మూడుసార్లు గుండ్రంగా తిరుగు... తర్వాత తూర్పుదిరిగి దండం పెట్టుకో...అంతా భగవంతుడి దయ అని మనసుల అనుకో.. గీ నువ్వులు నెత్తిన జల్లుకో...గీ సెలైన్ వాటర్‌ను మూడుసార్లు తీర్థంలా తీస్కో... గీ దర్భలు తీస్కొని బొడ్లో పెట్టుకో..ధైర్యంగుంటది' అని చెబుతుండు పూజారి. ఇక్కడ గీ తీర్న పూజ జరుగుతుంటే గక్కడ బంగారానికి నొప్పులు బగ్గ పెరిగినయ్. మొద్దోడు డాక్టర్ తాన్కి అచ్చి 'సార్ గాడ పానం బోయేట్టుంది.. జల్దిరండి' అన్నడు. 'మేం జేసేది మృత్యుంజయ యజ్ఞం. ఎవల్లపానంబోదు. గిది జేస్తే గామెకు నార్మల్‌డెలివరీ అయితాది. బిడ్డగీన బతుకుతడు. అందుకే జరంత ఓపికబట్టు' అన్నడు డాక్టరు. 'అస్సలు ఏం జరుగుతుందిక్కడ' అని కంపౌండర్‌ను అడిగిండు మొద్దోడు. 'గీ ఆసుపత్రికి వాస్తు దోషముందంట. అందుకే గిక్కడికి వచ్చినోల్ల పానంబోతుంది అనుకుంటుండ్రు. అందుకే గీ యజ్ఞం జేపిస్తుండ్రు' అన్నడు. 'గీల్లంతా మస్తు సదుకున్నోళ్లు వైద్యాన్ని నమ్మాలిగాని గీ వాస్తును నమ్ముడేందిరాబై.. గీ సంగతి సీఎం కేసీఆర్ సార్‌కు తెలిస్తే వీల్ల కొల్వులు బోవా' అన్నడు మొద్దోడు. కాంపోండరు పెద్దగా నవ్వి.. 'అసలు వాస్తుకు తెలంగాణల బ్రాండ్ అంబాసిడర్ మన కేసీఆర్ సారేగా సారూ.. గప్పుడు వాస్తు బాలేదని సెక్రటేరియట్‌ను, ఉస్మానియా దవాఖానాను కూలుస్తానన్నడు. పదేళ్లు పదవిల ఉండాలని వాస్తు ప్రకారం ప్రగతిభవన్ కట్టుకుండు.. గీయన్ను జూసినంకనే అన్ని చోట్ల వాస్తు పేర పోలీస్‌స్టేషన్లు, పెభుత్వ ఆఫీసులు అన్ని కూల్చి కట్టుడు షురూ జేసిరి' అన్నడు. దీంతో మొద్దోడికి గుస్సా బగ్గున అచ్చింది. గీసంగతేందో సీఎం సార్‌తాన్నే తేల్చుకుందామని సీఎం ఆఫీసు తాన్కిబోయిండ్రు మొద్దోడు, బుచ్చిగాడు. గప్పటికే గక్కడ మస్తుమంది జమైండ్రు. అందరికన్నా ఎనకాల ఉన్న వీల్లకు ఏవో మాటలు ఇనిపిస్తున్నయ్... 'ఈ కూతలు కూసే నా కొడుకులు ఎక్కడున్నరు.. గీల్లంతా జోకర్లు.. బోకర్ నా కొడుకులు, పిచ్చినా కొడుకులు, మీరాకుమార్.. బోరాకుమారా.. పిచ్చోల్లు చేసిన కామెంట్లు.. గదో పేపరు.. ఆల్లో రాసుడుగాల్లు..సైతాన్' అంటూ ఏమో మాటలు ఇన్పిస్తున్నాయ్. 'ఒరే బుచ్చిగా సీఎం ఆఫీస్ అనుకుని గిదేదో తాగుబోతుల అడ్డాకు ఒచ్చినట్టున్నాం పోదాం పా' అన్నడు మొద్దోడు. 'లేదురా గాయన సీఎం కేసీఆర్ సారే' అన్నడు బుచ్చిగాడు.. 'మరి గిదేందిరా బై గట్ల సిగ్గుసెరం లేకుండా బూతులు మాట్లాడుతుండు' అన్నడు. 'ఏం లేదురా..! గాయన సీఎం కుర్చీ ఎక్కినప్పుడు ఏం జెప్పిండు.. గత పాలకుల తీర్న మా పెభుత్వం ఉండదని చెప్పిండా..! మరి తీరా జూస్తే ఆల్లకు మించి అన్నట్టు భూదందాలు, ఇసుక మాఫియా, డ్రగ్స్, ప్రాజెక్టుల్లో కమీషన్లు, ఉద్యోగాల నోటిఫికేషన్లలో తిరకాసులు, కొడుకు కేటీఆర్ కంపెనీ పేరుతో, మిషన్ కాకతీయ, భగీరథతో డబ్బులు దండుకునుడు, దళితులపై దాడులు, తప్పుడు జీవోలు, తప్పుడు కేసులు బనాయించుడు జేస్తుండె. నీ పాలన అడ్డదిడ్డంగా బోతుందని కాంగ్రెసోల్లు, టీడీపోల్లు, కమ్యూనిస్టోల్లు దినాం చెబుతున్నరుగా.. గీ తప్పులన్నీ ఆయనకు చెబితే సరిజేసుకోవాల్సింది బోయి గీ తీర్న కల్లుతాగిన కోతిలెక్క తిక్కతిక్క చేసి తిట్టుడు షురూ జేసిండు' అన్నడు బుచ్చిగాడు. 'ఒరే బుచ్చి...ఆయన్ను ఫామౌస్‌లకెల్లి డైరెక్టుగా తీస్కొచ్చి ప్రెస్‌మీట్ల గూసోబెడితే ఎట్లా? గాయన ఏ కండీషన్ల ఉండో ఏమో అన్నడు మొద్దోడు ఆడ్నించి బయల్దేరుతు.

సెల్: 9490099332

కండ్లు మూసుకున్నా కనపడే కఠోర సత్యం



భూపతి వెంకటేశ్వర్లు

అధికార బలం ఉన్నవాడికి ప్రతిదీ అల్పంగానే అగుపడుతుంది. అర్థబలం ఉన్నవారికి ప్రతిదీ అమ్ముడు పోయే సరుకుగానే కనపడతది. ఆశలు కల్పించడం, ప్రలోభపెట్టడం, స్వార్థం, లాభం ఇవి తప్ప మనుషుల్ని నడిపించేవి ఏవీ ఉండవని వీళ్ల గట్టినమ్మకం... చరిత్రలో అన్ని యుద్ధాలు అట్లానే సమాన స్థాయిలో జరిగాయా? కొండలను ఢీకొట్టిన పొట్టేళ్లున్నాయి. ఈ గడ్డ మీద, మహాశక్తులతో తలపడే అల్పప్రాణులున్నాయి. మానవజాతి నిండా బ్రిటిష్ సేనల బలం ఎంతటిదో... తిరగబడ్డ రాంజీ గోండుకు తెలియదా! విల్లు పట్టిన అల్లూరికీ, కొమురం భీంకు తెలియదా? విస్నూర్, ఎర్రబాడు, దొరల శక్తి ఏమిటో తెలియదా? మన చాకలి ఐలవ్వకు, బండి యాదగిరికి కచ్చితంగా తెలుసు. లొంగిపోవడం, ఓడిపోవడం పిరికితనమని తెలుసు. ప్రజల పట్ల మొక్కవోని సంకల్పం. ఇది మన ప్రభువులకు, పాలకులకు మూర్ఖత్వంగానే ఉండవచ్చు.

ప్రజల నమ్మకమే ఎర్ర(అ)"జెండా" ఇది అసలు చరిత్ర. 80వేల గ్రంథాలు చదివినా మీకు గీ..చరిత్ర తెలియదా..? మొరగడానికీ, గర్జించడానికీ తేడా తెలియకపోతే ఎట్లా? కమ్యూనిస్టులు ప్రశ్నిస్తేనే... మన ముఖ్యమంత్రికి ఎందుకింత కోపం? కమ్యూనిస్టు వ్యతిరేకత వారికి నేడొక ఫ్యాషన్ అయిపోయింది. మూడేండ్ల పాలనలో ఎప్పుడు ప్రెస్‌మీట్ పెట్టినా కమ్యూనిస్టుపార్టీల ప్రస్తావన, అవాకులూ, చెవాకులూ, చవకబారు మాటలతో అవహేళన చేయడం అలవాటుగా మారింది. కమ్యూనిస్టులంటే ఎందుకింత కసీ కక్షా మనకు అర్థం కావల్సి ఉంది. "కాలం చెల్లిన కమ్యూనిస్టులు, వరంగల్‌లో 300 సంఘాలు కల్సి పోటీచేస్తే 350 ఓట్లు రాని పార్టీ చెప్పితే దానిపై మేం మాట్లాడాలా..?" అన్నారు. మాట్లాడకండిసారూ? మౌనంగానే ఉండండి. మీకు ప్రజలిచ్చిన అధికారం శాశ్వతమా? ఐదేండ్ల కాలంలో ప్రజలు మౌనంగా ఉంటామనే పూచీకత్తు ఇచ్చారా? కమ్యూనిస్టు పార్టీలు రోజు రోజుకూ కుచించుకు పోతున్నాయన్నారు. ఊసు లేదు, ఉనికి లేదు, ఒక్కశాతం ఓట్లు కూడా లేవు అన్నారు. ఈ కమ్యూనిస్టులంటే మీకెందుకు భయం? కాగితపు పులి అయితే కండ్లల్లో కలవరమెందుకు?

గద్దెనెక్కించిన జనం ఎవరినైనా ఎక్కించగలరనే విషయం సీఎంకు తెలియంది కాదు. జనం ప్రేమను నిరంతరాయంగా పొందడం ద్వారానే అధికారాన్ని నిలుపుకోవచ్చుననే అవగాహన వారికి బరువుగా అనిపిస్తున్నది. కమ్యూనిస్టులెప్పుడూ అర్థం పర్థం లేని ఆరోపణలు చెయ్యరు. అప్పుడే యాది మర్చితే ఎట్లా? ఐదునెలలు ఊరి నుంచి ఊరికీ, మనిషి నుంచి మనిషికీ అపరిచిత అభాగ్యులను అల్లుకుంటూ 4,200 కి.మీ., పదిహేను వందల గ్రామాలు సాగిన పాదయాత్ర, ప్రజలు చెప్పిన బాధలు, మీరు చేసిన బాసలు, మేము చూసిన నిజాలు ఇందులో ఏది అబద్ధం? జనం చేతిలో ప్రశ్నించే ఆయుధమే తమరి చేతికి అధికారాన్నిచ్చింది. ఆ.. ఆయుధాన్ని లేకుండా చేయడం ద్వారా తాము భద్రంగా ఉండగలమనుకుంటున్నారు. జనం నమ్మకాన్ని పదవిలోకి తర్జుమా చేసుకున్న తరువాత జనం మీద ప్రేమలు, నమ్మకాన్ని కోల్పోవడమే తెలంగాణలో అతిపెద్ద విషాదం.

తెలంగాణ ప్రజలతోనే ఉద్యమం నిర్మితమైంది. నమ్మకమైన ప్రజల పక్షం, ప్రతిపక్షం కోసం ఎదురు చూస్తున్నారు. లాల్-నీల్ ఐక్యతగా అడుగులు పడుతున్నాయి. వామపక్ష, సామాజిక, ప్రజా సంఘాలు నడుపుతున్న ఉద్యమాలకు చేదోడుగా నిలబడుతున్నాయి. ఎర్రజెండా ముందుంటే మేము మీ వెనుక వస్తామని 271 సామాజిక ప్రజా సంఘాలు తమ దృఢ నిశ్చయాన్ని తెలియజేస్తున్నాయి.

నిజాలు చెప్పితే అక్కసా! సాధించుకున్న తెలంగాణ ప్రజలు సంతృప్తిగా లేరు అని చెప్పితే ఆగ్రహమా? మేలు కొల్పిందని కోడిమీద కోపం తెచ్చుకుంటే ఎట్లా? అలారం మోగిందని గడియారాన్ని బద్దలు కొడితే ఏమి ఉపయోగం. మొగం బాగలేక అద్దం పగలగొడితే... అది ఎంత విడ్డూరమూ, ఎంత విచిత్రమూ! ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి ఏ వాదన అయినా ఉండవచ్చు కానీ... ప్రశ్నించేతత్వాన్ని శిథిలం చేయాలని ప్రయత్నించడం మాత్రం ఆత్మహత్యా సదృశం. నేనూ, నా కుటుంబం మాత్రమే అధికారంలో శాశ్వతంగా ఉంటామనీ, ఇక తెలంగాణ బడుగు జనాలకు కావల్సినవన్నీ నెరవేరిపోయాయనీ చెప్పదలిచారా? ప్రగతి భవన్ వెలుగులు చూసి గ్రామీణ పేదల బతుకుల్లో వెలుగులు ప్రసరిస్తున్నాయనే భ్రమలో ఉన్నట్టున్నారు. ధిక్కారము సైతుమా అన్న ధోరణే కొనసాగుతున్నది. ప్రజల పత్రికలపై విషపు దాడులు, వికృత చేష్టలా? జయాప జయాలు, ఎదురు దాడులు, నిర్బంధాలు, నిందా ప్రచారాలు ఖాతరు చేయక ఆశయబలంతో అరుణారుణ ప్రస్థానం సాగిస్తున్న నాటి, నేటి, రేపటి కమ్యూనిస్టులపై చద్దిపాఠాలూ కట్టుకథలు పుట్టలు పుట్టలుగా ప్రచారం చేశారు. మాకు తెలుసు వర్గపోరాటంలో అసత్య ప్రచారాలపై సమరం కూడా ముఖ్యమైన భాగం. వాటిని నిర్ద్వంద్వంగా ఎదుర్కోవడమే తప్ప ఎలాంటి గందరగోళానికీ గురికానవసరం లేదు.

తెలంగాణ ప్రజలతోనే ఉద్యమం నిర్మితమైంది. నమ్మకమైన ప్రజల పక్షం, ప్రతిపక్షం కోసం ఎదురు చూస్తున్నారు. లాల్-నీల్ ఐక్యతగా అడుగులు పడుతున్నాయి. వామపక్ష, సామాజిక, ప్రజా సంఘాలు నడుపుతున్న ఉద్యమాలకు చేదోడుగా నిలబడుతున్నాయి. ఎర్రజెండా ముందుంటే మేము మీ వెనుక వస్తామని 271 సామాజిక ప్రజా సంఘాలు తమ దృఢ నిశ్చయాన్ని తెలియజేస్తున్నాయి. ఇవన్నీ తెలంగాణ ప్రజలకు గర్వకారణం. ఈ విషయాలు మన ముఖ్యమంత్రికి కడుపు మంటలు ఎందుకింత అసహనం! తరతరాలుగా తమను బంధిస్తున్న భూస్వామ్య విధాన శృంఖలాలను బద్దలు కొట్టేందుకు కదులుతున్న పురోగమిస్తున్న ప్రజా చైతన్యాన్నీ, ధర్నాచౌక్‌పై సాగిన ఆందోళననూ మీరు కండ్లుండి కనలేరు. ప్రజల సమరశంఖా రావాన్ని మీరు చెవులుండీ వినలేరు. ప్రజలంతా నడుస్తున్న దారిని కనలేని ఒక ఉలిపికట్టెకు ఉడుకుమోతుతనం తప్ప ఉదాత్త భావాలు ఎలా వస్తాయి.

పరుల కలిమికి పొరలిఏడ్చే పాపికెక్కడ సుఖము కలదోయ్... అని కవీంద్రుడు ఏనాడో చెప్పాడు. తనతో పాటు పోరాడిన ప్రజల స్థితి గతులను చూడలేని చుప్పనాతికి ఏ గతి గలదో... ఎవరు చెప్పగలరు?

సెల్: 9490098343

నవతెలంగాణ మానవి
manavi@navatelangana.com
హైదరాబాద్ శుక్రవారం 4-8-2017 5

మెరిసే చర్మం కోసం...

రోజువారి చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే చాలు మెరిసే చర్మం మీ సొంతవుతుంది. సరైన ఆహారం, సరిపోను నిద్ర పోవాలి. ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్వాడకం తగ్గించి.. సహజమైన హారం తీసుకోవాలి. వాటితోపాటు ఇంట్లోనే దొరికే పదార్థాలతో చిన్నచిన్న మాస్కులు ట్రై చేయండి.

- చాలామంది ఎక్కడికెళ్లినా బ్యాగ్‌లో మాయిశ్చరైజర్ తీసుకెళ్తారు. ఎందుకంటే పొడిచర్మం. పొడిచర్మాన్ని బాగుచేసే గుణం అరటిపండులోని పొటాషియంలో ఉంది. బాగా పండిన అరటిపండును తీసుకుని... మెత్తగా చేయండి. దానికి కొన్ని చుక్కల నిమ్మరసం కలపండి. దానికి కొంత కాలమైన్ పౌడరు(మార్కెట్‌లో దొరుకుతుంది)ను చేర్చండి. దీన్ని ముఖానికి అప్లై చేసి ఆరిపోయాక కడగండి. మృదువైన చర్మం మీ సొంతమవుతుంది.



- బయటకు వెళ్లినప్పుడు అన్నిసార్లు సన్‌స్క్రీన్ లోషన్ రాయడం కుదరదు. అలాంటప్పుడు కంగారుపడాల్సిన అవసరం లేదు. తిరిగి ఇంటికి వచ్చాక... సంత్రా గుజ్జు తీసి దానికి కొద్దిగా పాల క్రీమ్‌ను కలపాలి. ఈ మిశ్రమానికి ముల్తానిమట్టిని చేర్చి బాగా మిక్స్ చేయాలి. దీనికి ముఖానికి మాస్క్‌లాగా వేసుకుని ఆరిపోయిన తరువాత కడిగేయండి. ముఖం మీద టాన్ పోయి... చర్మానికి నిగారింపు వస్తుంది. మృదువుగా మారుతుంది.
- బయటికి వెళ్లివచ్చామంటే కాలుష్యంతో ముఖం మాడిపోతుంది. అలాంటిచర్మానికి మంచి ఫేస్‌ప్యాక్ ఇది. ఒక గిన్నెలో ఆపిల్ ముక్కలను తీసుకుని మెత్తగా చేయండి. దీనికి పచ్చిపాలు, పాల పొడి కలపాలి. తరువాత ముల్తాని మట్టిని చేర్చి మెత్తగా చేసుకోవాలి. దీనిని ముఖానికి అప్ల చేసి పదిహేను నిమిషాల తరువాత నీటితో కడిగేయాలి.
- పెద్దవాళ్లు చెబితే చాదస్తం అనుకుంటాం కానీ... పసుపు చేసే మేలు అంతా ఇంతా కాదు. పసుపు, శనగపిండి సమపాళ్లలో తీసుకోవాలి. రెంటిని కలపాలి. దానికి పచ్చిపాలు, కొన్ని నీళ్లు చేర్చి మెత్తని పేస్టుగా చేసుకోవాలి. దీనిని ముఖానికి అప్లై చేసి... ఎండిపోయేదాకా ఉంచాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. కడిగేటప్పుడు ముఖంపై గుండ్రంగా చేతులతో మసాజ్ చేస్తే ముఖం మృదువుగా మారుతుంది.
- **గమనిక**

ఏ ఫ్రూట్ ప్యాక్ అయినా సరైన ఫలితాలు ఇవ్వాలంటే దాన్ని మెత్తగా చేయాలి. అలాగే... ఆరడానికి ఎక్కువ సమయం ఇవ్వాలి. కాలమైన్ లేదా ముల్తాని మట్టిని చేర్చడం వల్ల... వాటిని ముఖంపై అప్లై చేయడానికి సులభం అవుతుంది. నిమ్మ జాతి పండ్లతో ప్యాక్ తయారు చేస్తున్నప్పుడు దానికి కచ్చితంగా నీళ్ల లేదా గులాబీ నీళ్ల జత చేయాలి. లేకపోతే అందులో ఉన్న ఆమ్ల స్వభావం చర్మానికి హాని చేస్తుంది.

ఇ ట్ల చే ద్దాం

ఇంగువ నిల్వ చేసే డబ్బాలో పచ్చిమిరపకాయ వేస్తే తాజాగా ఉంటుంది.



రెండు చేతులు పోగొట్టుకోవడం... ఆ ఊహే భరించలేం. కానీ ఆమె విషయంలో అదే నిజం. బాంబు పేలుడులో రెండు చేతులను పోగొట్టుకుంది. కానీ ఆత్మ విశ్వాసాన్ని కాదు. అందుకే ఇప్పుడు మోటివేషనల్ స్పీకర్‌గా ఎదిగింది. హక్కుల ఉద్యమకారిణిగా మారింది. సామాజిక శాస్త్ర పరిశోధనలు చేస్తోంది. టెడెక్స్ స్పీకర్‌గా ఎంతోమందిలో స్ఫూర్తినింపుతోంది. మోడల్‌గా తన కలను నెరవేర్చుకుంటోంది. దురదృష్టాన్ని తిట్టుకుంటూ కూర్చోకుండా... ఓడించి గెలిచి నిలిచిన సజీవ ఉదాహరణ మాళవిక అయ్యర్. ఆమె పరిచయం మానవికోసం...

వైకల్యాన్ని జయించి...

మాళవిక అయ్యర్. తమిళనాడులోని కుంబకోణంలో జన్మించింది. తల్లి హేమ, తండ్రి కృష్ణన్. రాజస్థాన్‌లోని బికనేర్‌లో పెరిగింది. అక్కడ ఉండగానే ఊహించని ఉపద్రవం. 2002 మే 26... ఆదివారం మిట్ట మధ్యాహ్నం. ఎండలు మండిపోతున్నాయి. 13 ఏండ్ల మాళవిక.. తొమ్మిదో తరగతిలో చేరిన నెలన్నర రోజుల తరువాత వేసవి సెలవుల్లో ఇంటి దగ్గర ఉన్నది. అతిథులు వస్తే వాళ్ల నాన్న హాల్లో కూర్చుని వారితో మాట్లాడుతున్నారు. వాళ్ల అక్క వచ్చినవారికి టీ పెడుతోంది. తల్లి కూలర్‌లో నీళ్లు పోస్తోంది. మాళవిక మాత్రం తన చిరిగిన జీన్స్‌ని ఎలా బాగు చేయాలా అని ఆలోచిస్తున్నది. అలా గ్యారేజ్‌వైపు నడిచింది. అక్కడ ఓ పెద్ద వస్తువు కనిపించింది. కొత్తగా కనిపించిన ఆ వస్తువును తీసుకుని జీన్స్ పాకెట్‌లో వేసుకుని తిరిగి గదిలోకి వెళ్లింది. ఇంట్లోకి వెళ్లిన తరువాత ఒక్కసారి దాన్ని గట్టిగా రబ్ చేసి చూసింది. అంతే... ఆమె చేతుల్లో అది పేలిపోయింది. అది గ్రెనేడ్ అన్న విషయం ఆమెకు తెలియదు(ఇంటికి దగ్గరలోని ఓ అమ్యూనియేషన్ డిపోలో మంటలు చెలరేగి... చుట్టపక్కల ప్రాంతాల్లో దాని షెల్స్ పడ్డాయి. అలాంటి గ్రనేడ్ ఒకటి వీళ్ల ఇంటి సమీపంలోనూ పడింది).

శరీరమంతటా గ్రెనేడ్ ముక్కలు...

టీవీ పేలిందేమో అనుకున్న తల్లిదండ్రులు ఆమె గదిలోకి పరుగెత్తుకుంటూ వచ్చారు. చూసేసరికి బిడ్డ రక్తపు మడుగులోఉంది. ఏం జరిగిందో కూడా తెలియదు మాళవికకు. 'నా బిడ్డ చేతులు పోయాయి' అంటూ ఏడుస్తున్న తల్లిగొంతు మాత్రం వినబడుతోంది. తండ్రి, అతని స్నేహితుడు కలిసి మాళవికను కారులో పడుకోబెట్టారు. అంత జరిగినా మానవికకు నొప్పి తెలియడం లేదు. కారణం నరాల వ్యవస్థ దెబ్బతినడం. శరీరం నుంచి వేరై వేలాడుతున్న కాళ్లను చూసి.. తండ్రి స్నేహితునికి చెప్పింది. వెంటనే ఆయన తన చేతిలో ఉన్న దస్తీతో కాళ్లను కట్టేశాడు. హాస్పిటల్లో చేరిన నాలుగు రోజుల తరువాత నొప్పి తెలిసొచ్చింది మాళవికకు. విరిగిపోయిన కాళ్లు, చేతుల్లో గ్రెనేడ్‌లోని చిన్నచిన్న ముక్కలు వేలకొద్దీ ఉండిపోయాయి. అవి తొలగించడానికే మూడు నెలలు పట్టింది.

అనేక సర్జరీల తరువాత...

రెండేండ్ల పాటు చెన్నైలోని హాస్పిటల్‌లో ఉంది. చాలా సర్జరీలు జరిగాయి. అంతకుముందు మాళవిక జీవితంలో అందమైన పూదోటలా ఉండేది. కాలనీలోని పిల్లల గ్రూప్‌కి ఆమే నాయకురాలు. మ్యూజిక్, డ్యాన్స్, ఆమెకెంతో ఇష్టమైన స్కేటింగ్... అన్నీ కలగలిసి ఎంతో రంగులరంగుల జీవితం. అలాంటిది ఒక్కసారిగా అంతా తలకిందులైపోయింది. రెండు చేతులు పోయాయి. కాళ్లలోని నరాలు 80శాతం దెబ్బతిన్నాయి. నడవడం కష్టమేనన్నారు డాక్టర్. కానీ తాను ఎలాగైనా నడవగలగాలి అని దృఢంగా అనుకుంది మాళవిక. కాళ్లు మాత్రమే ఎలాగోలా సెట్ అయ్యాయి. ప్రోస్తటిక్ చేతులు పెట్టారు. తిరిగి కోలుకోవడానికి చాలా కాలమే పట్టింది. డిప్రెషన్ మీద యుద్ధమే చేసింది. గాయాలు వాటితాలూకు మచ్చలతో ఏర్పడిన ఆత్మన్యూనత మీద పోరాటం చేసింది.

పట్టుదలతో బోర్డ్ ఎగ్జామ్స్...

దాదాపు రెండేండ్ల తరువాత తిరిగి ఆమె ఇంటికి వచ్చేసరికి ఫ్రెండ్స్ అంతా టెంత్ బోర్డ్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అవుతున్నారు. తాను తొమ్మిది చదవలేదు... ఇప్పుడు పదో తరగతికి పరీక్షలకు ఒకేసారి వెళ్లడం. నిజానికి మాళవిక సగటు విద్యార్థిని. చదువుతోపాటు అన్ని యాక్టివిటీస్‌లో చురుకుగా పాల్గొనేది. కానీ ఈసారి తనను తాను ప్రూవ్ చేసుకోవాలంటే అంతకుమించి చదవాలి. అందుకే ప్రయివేట్‌గా టెంత్ ఫీజు కట్టింది. పుస్తకాలతో కుస్తీ పట్టింది. ట్యూషన్ చెప్పించుకుంది. మూడునెలల పోరాటం తరువాత ఆమె కల ఫలించింది... కేవలం ఉత్తీర్ణురాలవ్వడం మాత్రమే కాదు.. స్టేట్ ర్యాంక్ సాధించింది. 500లకు 483 మార్కులు సాధించింది.

ఆత్మస్థైర్యానికి అవార్డులు...

ఆమె కష్టపడే తీరు, ఆమెలోని అసాధారణ తత్వం.. రాష్ట్రపతి భవన్‌దాకా పాకింది. అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలామ్‌ను కలవడం తన జీవితంలో అత్యంత తీపి జ్ఞాపకం అంటుంది మాళవిక. ఆ తరువాత న్యూఢిల్లీలోని సెంట్ స్టీఫెన్స్ కాలేజీలో చేరి ఎకనామిక్స్‌లో గ్రాడ్యుయేషన్ చేసింది. ఢిల్లీ స్కూల్ ఆఫ్ సోషల్ వర్క్‌లో చేరి అక్కడే సోషల్ వర్క్‌లో మాస్టర్స్ పూర్తి చేసింది. తరువాత మద్రాస్ స్కూల్ ఆఫ్ సోషల్ వర్క్‌లో ఎంఫిల్ చదివింది. దేశంలోనే కాదు... అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు దక్కించుకుంది. ఐఐఎం కోజీకోడ్, నార్వే, ఇండోనేషియా, సౌత్ ఆఫ్రికా సహా అనేక దేశాల్లో తన ప్రసంగాలతో యువతలో స్ఫూర్తి నింపింది. చెన్నైకి చెందిన ఎబిలిటీ ఫౌండేషన్, నిఫ్ట్ సంయుక్తంగ నిర్వహించిన ఓ షోలో టాపర్‌గా ర్యాంప్‌పై నడిచింది. వైకల్యంతో ఉన్నవాళ్ల మీద సమాజం చూపుతున్న వివక్షకు వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితితో కలిసి పనిచేస్తోంది.

జెన్నీ



బ్లాస్ట్‌కు రుణపడి ఉంటా...

'బ్లాస్ట్‌కు నేను రుణపడి ఉంటాను. ఎందుకంటే... అదే జరగకపోయి ఉంటే, అందరూ అమ్మాయిల్లాగే నేను సాధారణంగా మిగిలిపోయేదాన్ని. అసాధారణ పరిస్థితులను ఎదుర్కొని నిలబడటంలోనే అసలైన జీవితం ఉంది. నేను బాధితురాలిగా మిగిలి పోదలుచుకోలేదు. విజేతగా నిరూపించుకోవాలనుకున్నాను. జీవితంలో ప్రతి ఒక్కరికీ ఏదో ఒక అవకాశం వస్తుంది. దాన్ని అందిపుచ్చు కోవాల్సింది మనమే!'



చుట్టుపక్కల వాళ్లు నవ్వుకున్నా....

ఓ మండువేసవి. చెన్నైలోని మార్కెట్‌కి వెళ్లింది మాళవిక. విపరీతమైన ఉక్కపోత, వేడితో ఆమెకున్న ప్రోస్తెటిక్ హ్యాండ్స్.. జారి కిందపడిపోయాయి. కాళ్లు సైతం నిలబడలేని స్థితికి తీసుకొచ్చాయి. ఆ స్థితిలో ఆమెకు సహాయపడాల్సిన చుట్టుపక్కలవాళ్లు.. నవ్వడం మొదలుపెట్టారు. అవయవాలు కలిగించే నొప్పి ఒకటయితే... వాళ్ల నవ్వులు కలిగించిన నొప్పి అంతకంటే రెట్టింపు. అప్పుడే అనుకుంది... 'నేను రాష్ట్రపతిగా ఉన్నా... నవ్వేవాళ్లు ఇలా నవ్వుతూనే ఉంటారు. కాబట్టి ఇతరులు ఏమనుకుంటున్నారో అని పట్టించుకోవడం, స్పందించడం మానేయాలి' అని. ఆ స్థితప్రజ్ఞతే ఆమెను తిరిగి కోలుకునేలా చేసింది.

కండ్ల దురద తగ్గాలంటే !



ఎక్కువగా కంప్యూటర్ ముందు పని చేసే వారు కండ్లకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోకపోతే కంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. అలా తదేకంగా కంప్యూటర్‌ను చూస్తు కూర్చోవడం వల్ల కంటిపై వెలుతురు, వేడి ప్రభావం ఎక్కువగా పడుతుంది. స్క్రీన్ వెలుతురు నుంచి వచ్చే వేడి వల్ల కండ్లు పొడి బారడం, మంట పుట్టడం లాంటి సమస్యలు వస్తాయి. వాటిని అధిగమించాలంటే కొన్ని చిట్కాలు తప్పని సరిగా పాటించాలి.

- కంప్యూటర్ ముందు ఎక్కువ సమయం పని చేసే వారు యాంటీ రిఫ్లెక్షన్ గ్లాస్సెస్ ఉపయోగించాలి. దీని వల్ల వెలుతురు, వేడి తీవ్రత నుంచి కండ్లను కాపాడుకోవచ్చు.
- అలాగే కాంటాక్ట్ లెన్స్ వాడేవాళ్లు ఎప్పుడూ వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నిర్ణీతకాలం వరకు మాత్రమే వాడి తర్వాత తీసేయాలి. లేదంటే కండ్ల నుంచి నీరు కారడం, మంటలు పుట్టడం వంటి సమస్యలు ఎదురవుతాయి. ఈ లక్షణాలు ఎక్కువగా ఉంటే డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.
- కండ్లలో ఏదైనా పడి దురదగా, మంటగా అనిపించినప్పుడు అదేపనిగా నలపకూడదు. దానివల్ల కంట్లో ఉండే సున్నితమైన పొరలు దెబ్బతింటాయి. ఇన్‌ఫెక్షన్ ఏదైనా ఉంటే అది మరింత ముదిరే ప్రమాదం ఉంటుంది.
- దాంతో పాటు కంటికి ఉపయోగించే అలంకరణ సామాగ్రిని కూడా జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలి. ఏదైనా సరే పరిమితంగా ఉపయోగించాలి. అలాగే మేకప్ వేసుకునేటప్పుడు నాణ్యమైన బ్రష్‌లను వాడాలి. చేతితో కంటిని శుభ్రం చేసుకోవద్దు ఎందుకంటే చేతికి ఉండే బ్యాక్టీరియా కంట్లోకి చేరొచ్చు.
- కంప్యూటర్ ముందు గంటల తరబడి కూర్చునేవారు వైద్యుల సలహా మేరకు కండ్లకు సంబంధించిన డ్రాప్స్ వాడితే.. పొడిబారే సమస్య ఉండదు. అలాగే చల్లటి నీటితో కండ్లను అప్పుడప్పుడూ శుభ్రం చేసుకోవాలి.

వైట్‌హౌస్ మీడియా ప్రతినిధి



హెలెన్ అమేలియా థామస్
(ఆగష్టు 4, 1920 - 20 జూలై, 2013)

సుదీర్ఘకాలం పాటు వైట్‌హౌస్ మీడియా ప్రతినిధిగా పనిచేసిన మహిళ హెలెన్ థామస్. అమెరికా మాజీ అధ్యక్షుడు కెనెడీ నుంచి ఒబామా వరకు ఆమె ప్రెస్ వ్యవహారాన్ని చూశారు. యునైటెడ్ ప్రెస్ ఇంటర్నేషనల్ (యుపిఐ)లో 57సంవత్సరాలు కొనసాగారు. అంతే కాదు ఆమె నేషనల్ ప్రెస్ క్లబ్ మొదటి మహిళా అధికారి. వైట్ హౌస్ కరెస్పాండెంట్ అసోషియేషన్, గ్రిడిర్సన్ క్లబ్ లోనూ మొదటి మహిళా సభ్యురాలు. తన అనుభవాలను ఆరు పుస్తకాలుగా ప్రచురించారు. ఆమె రాసిన చివరి పుస్తకం 'మిస్టర్ ప్రెసిడెంట్: ఎవిటీస్ యు ఆల్వేస్ వాంటెడ్ యువర్ ప్రెసిడెంట్ టు నో అండ్ డో (2009)' మరో రచయిత క్రెయిగ్ క్రాఫోర్డ్‌తో కలిసి ఈ పుస్తకాన్ని ప్రచురించారు. కొన్ని సందర్భాలలో వివాదస్పద వ్యక్తిగా పత్రికలో వార్తగా మారారు.

హెలెన్ కుటుంబం త్రిపోలి నుండి అమెరికాకు వలస వచ్చింది. చిన్న షాపు వారి జీవనాధారం. థామస్ ప్రధానంగా డెట్రాయిట్, మిచిగాన్లో పెరిగారు. ఆమె 1920లలో డెట్రాయిట్‌లో చదువుకుంటున్న రోజుల్లో నాన్ అమెరికన్‌గా వివక్షను ఆమె ఎదుర్కొన్నారు. హైస్కూలు చదువుతున్నప్పుడే జర్నలిస్ట్ కావాలని నిర్ణయించుకున్నారు. వేన్ విశ్వవిద్యాలయంలో ఇంగ్లీష్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ పొందిన తరువాత ఆమె వాషింగ్టన్ డి.సికి మారారు. అక్కడే వాషింగ్టన్ డైలీ న్యూస్‌లో కాపీరైటర్‌గా పనిచేశారు. ఎనిమిది నెలల తర్వాత ఆమె సమ్మెలో పాల్గొన్న కారణంగా ఉద్యోగం నుంచి తొలగించారు. ఆ తర్వాత యునైటెడ్ ప్రెస్‌లో చేరడంతో పాటు రేడియోలో మహిళల అంశాలపై, సామాజిక సమస్యలపై కార్యక్రమాలను నిర్వహించేవారు. వాషింగ్టన్‌లోని అనేక మంది ప్రముఖులను ఆమె ఇంటర్వ్యూ చేశారు. అనేక డిపార్ట్‌మెంట్స్‌ను ఆమె కవర్ చేశారు. 1959 నుండి 1960 వరకు థామస్ ఉమెన్స్ నేషనల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షురాలిగా పనిచేశారు. 1959 లో సోవియట్ నాయకుడు నికితా క్రుషెవ్ మీటింగ్‌కు మహిళా జర్నలిస్టులు వెళ్లకుండా అడ్డుకున్నారు. నేషనల్ ప్రెస్ క్లబ్ తరపున ఆమె మహిళా జర్నలిస్టుకు అనుమతించేలా చొరవ తీసుకున్నారు.

నవంబరు 1960లో నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన జాన్ ఎఫ్. కెనెడీ వార్తలను ఆమె కవర్ చేసేవారు. ఆమెలోని చురుకుదనం 1961 లో వైట్ హౌస్ కరెస్పాండెంట్‌గా మార్చింది. ఆ తర్వాత ఐదు దశాబ్దాల పాటు ఆమె వైట్ హౌస్ మీడియా ప్రతినిధిగా కొనసాగారు. వైట్‌హౌస్ నుంచి వెలువడే ప్రతి ప్రకటన ఆమె ద్వారా వెలుగు చూడాల్సిందే. కెనెడీ నుంచి ఒబామా వరకు అందరూ అధ్యక్షులకు సంబంధించిన ప్రెస్ బాధ్యతలను ఆమె నిర్వహించారు. కొన్ని సార్లు వివాదాస్పదమైనప్పటికీ అధ్యక్షుడికి.. మీడియాకు మధ్య వారధిగా పనిచేశారు. 30 గౌరవ డాక్టరెట్లను అందుకున్నారు. అనేక అవార్డులను సొంతం చేసుకున్నారు.

పొదుపు ప్రారంభించండి

మనందరికి డబ్బు దాచుకోవాలని, భవిష్యత్ కోసం పొదుపు చేయాలనే కోరిక ఉంటుంది. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో డబ్బు పొదుపు చేసే ప్రయత్నాన్ని ఒక్కసారైనా చేసే ఉంటారు. కానీ కొనసాగించలేకపోవచ్చు. ఎందుకుంటే పొదుపు చేయడం అనే పదం వినడానికి ఎంతో బాగుంటుంది. కానీ మొదలుపెడితే తప్ప తెలియదు పొదుపు కొనసాగించడం ఎంత కష్టమో. బహుశా ఈ కష్టానికి కారణం 'ఎలా పొదుపు చేయాలి' అనే ప్లాన్ లేకపోవడమే. మరి డబ్బు పొదుపు చేయాలంటే ఎలా..? అంటే.. ఐదు సింపుల్ చిట్కాలు ఇక్కడ ఉన్నాయి. వీటిని ఒక్కసారి అనుసరించి చూడండి...



ఎప్పుడు, ఏం కావాలో నిర్ణయించుకోండి

మీకు ఏ అవసరం ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు ఏం కావాలో అనే విషయాలపై కచ్చితంగా ఓ అవగాహన ఉండాలి. అంటే దీర్ఘకాలిక దృష్టి ఉండాలి. పొదుపు చేయాలి అనుకుంటున్న వారికి ఇది చాలా అవసరం. ఇప్పటికే మీరు కొంత పొదుపు ప్రారంభించినట్లయితే ఎంత చేశారో ఒక్కసారి చెక్ చేసుకుని మీ అవసరాలకు, ఖర్చులకు తగ్గట్టు కొత్త ప్లాన్ ప్రారంభించండి.

లక్ష్యాలను నిర్ణయించుకోండి

డబ్బు పొదుపు చేయాలనుకున్నప్పుడు మీకు రెండు రకాల లక్ష్యాలు కచ్చితంగా ఉండాలి. అవి ఎంత పొదుపు చేయాలి, ఎంత కాలం చేయాలి. మీరు ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే ముందు 'పొదుపు చేయాలి' అని మీరు తీసుకునే నిర్ణయమే మీ ప్రాథమిక లక్ష్యం. అలాగే ఎంత కాలం పొదుపు చేయాలి అనే సమయాన్ని కూడా నిర్ణయించుకుంటే ఒక క్రమ పద్ధతిలో పొదుపు చేయడానికి, మీ లక్ష్యాన్ని చేరుకోవడానికి ఉపయోగపడుతుంది.

బడ్జెట్ ప్రకారం పొదపు ప్రారంభించండి

స్వీయ నియంత్రం దీని పరిదిలోకే వస్తుంది. మీ లక్ష్యం పైనే దృష్టిపెట్టాలి. అంతేకాని అనవరమైన వస్తువుల కోసం మీ డబ్బును వృధా చేయకూడదు. అలాగే ఓ పొదుపు ఖాతాను తెరవడం కూడా మంచి ఆలోచన. ఎందుకంటే డబ్బు చేతిలో ఉంటే అనవసర ఖర్చులే గుర్తుకొస్తాయి. అదే అకౌంట్లో ఉంటే ఖర్చుచేయడానికి కాస్త ఆలోచిస్తాం.

ఖర్చులను రికార్ట్ చేసుకోండి

మీ రోజు వారి, నెల వారి ఖర్చులపై ఓ అవగాహన లేకుండా పొదుపు చేయడం, మీ జీవితంలో ఆర్థిక పురోగతి సాధించడం చాలా కష్టం. అందుకే మీ రోజువారి ఖర్చులను కచ్చితంగా రాసుకోండి. దేనికి ఎంత ఖర్చు అవుతుందో రికార్డ్ చేసుకోండి. అప్పుడే మీ అవసరాలు, అనవసరాల గురించి తెలుసుకోగలుగుతారు. ఇది మొదట్లో కాస్త కష్టమే. అయితే ఎంత కష్టమైనా కొనసాగించగలిగితే మాత్రం తర్వాతర్వాత అలవాటైపోతుంది.

నిరాశ చెందకండి

కష్టకాలంలో నిరాశ చెందకండి. ఎలాంటి పరిస్థితుల్లో ధైర్యాన్ని వదలకండి. ఇది మీరు గుర్తు పెట్టుకోవల్సిన అత్యంత ముఖ్యమైన విషయం. లక్ష్యాలను చేరుకోడానికి మీరు ఎంచుకున్న దారిలో సమస్యలు ఎదురైతే మరో దారి వెతకండి. అంతేకానీ నిరాశ చెందకూడదు. పట్టుదల ఉన్న వారికి విజయం కచ్చితంగా వరించి తీరుతుంది. పొదుపు కూడా అంతే. అనుకున్న ప్రణాళిక ప్రకారం ముందుకు వెళితే అనుకున్న లక్ష్యాలను సులభంగా చేరుకోగలం.

చివరగా కొన్ని మాటలు...డబ్బును పొదుపు చేయడం కష్టమనే విషయాన్ని గుర్తించాం. పొదుపు ప్రారంభించడం అలస్యమైనప్పుడు అది మరీ కష్టంగా అనిపిస్తుంది. అయితే పైన చెప్పిన విషయాలు మీ ఆర్థిక జీవితాన్ని నియంత్రించుకోడానికి, పురోగతి సాధించడానికి సహకరిస్తాయి. వీటిని పాటించగలిగితే కష్టకాలంలో ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం రాదు. వీటిని చదివిన తర్వాత పొదుపుపై మీకు ఓ అవగాహన వచ్చే ఉంటుంది. ఇప్పటి వరకు మీరు నిర్వహించిన ఆర్థిక వ్యవహారాల కంటే ఇవి సవాల్‌తో కూడుకున్నవే. కానీ మీ డబ్బును ఆదా చేయడంలో మాత్రం ఇవి కచ్చితంగా ఉపయోగపడతాయి. మరింకెందుకు ఆలస్యం మీరు కూడా మీ భవిష్యత్ కోసం పొదుపు ప్రారంభించండి. ఆల్ ది బెస్ట్...

నంద్యాలతో నాంది

● వైసీపీ అధినేత వైఎస్.జగన్మోహన్ రెడ్డి



కర్నూలు: అవినీతి కుంభకోణాల్లో మునిగిపోయిన చంద్రబాబు ప్రభుత్వాన్ని ఓడించేలా 2019లో జరిగే ఎన్నికల కురుక్షేత్ర సంగ్రామానికి నంద్యాల ఉప ఎన్నికలు నాంది కావాలని వైసీపీ అధినేత వైఎస్. జగన్మోహన్‌రెడ్డి అన్నారు. కర్నూలు జిల్లా నంద్యాల ఉప ఎన్నికలలో భాగంగా వైసీపీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ గురువారం నంద్యాల ఎస్‌పీజీ మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగించారు. ఒక పార్టీ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లా కొనుగోలు చేసి రాజకీయం చేస్తున్నాడని చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి నీతిలేని రాజకీయానికి భిన్నంగా.. శిల్పా చక్రపాణి రెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారని, దానిని స్పీకర్ ఫార్మాట్‌లో పంపుతున్నామని ప్రకటించారు.

ఇండ్ల తొలగింపును నిరసిస్తూ టీడీపీ కార్పొరేటర్ ఆత్మహత్యాయత్నం

అనంతపురం : అనంతపురం నగరంలోని విజయనగర కాలనీలో నాలుగేళ్లుగా నివాసముంటున్న పేదల ఇండ్లను ఉన్న పళంగా తొలగించడాన్ని నిరసిస్తూ స్థానిక తెలుగుదేశం పార్టీకి చెందిన కార్పొరేటర్ ఉమామహేశ్వరరావు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. అనంతపురం నగరంలోని విజయనగర కాలనీలో నాలుగేండ్లుగా నివాసముంటున్న పేదల ఇళ్లను తొలడించడానికి అధికారులు సిద్ధపడ్డారు. గురువారం జెసిబిలతో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు వెళ్లి తొలగింపునకు సిద్ధపడ్డారు. నోటీసులు ఇవ్వకుండా తొలగింపు ఏమిటంటూ స్థానికులు అడ్డుపడే ప్రయత్నం చేశారు. వినకుండా ఇళ్ల తొలగింపు మొదలుపెట్టారు. బాధితులకు మద్దతుగా కార్పొరేటర్ ఉమామహేశ్వరరావు నిలిచారు. అయిన ఇళ్లను తొలగిస్తుడటంతో ఆయన వాస్మాల్-33 ద్రావణం తాగారు. వెంటనే స్థానికులు ఆయన్ని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఇంత జరిగినా అధికారులు మాత్రం తొలగింపు ప్రక్రియను నిలపుదల చేయలేదు. చెరువులో ఇళ్ల నిర్మాణాలు చేపట్టినందునే వీటిని తొలగిస్తున్నట్టు అధికారులు తెలిపారు.

జనం 'పల్స్' పట్టుకుంటాం !

మీ పార్టీ బలంగా ఉందా..బలహీనంగా ఉందా

● చెబుతామంటున్న సర్వే సంస్థలు

● ఆశ్రయిస్తున్న పలు రాజకీయ పార్టీలు, నేతలు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాజకీయాల్లో కొత్త ట్రెండ్ మొదలైంది. రాజకీయ పార్టీలు కష్టపడకుండా ప్రజల నాడిని తెలుసుకుంటామని పలు సర్వే సంస్థలు పుట్టుకొస్తున్నాయి. గతంలో మాదిరి రాజకీయ పార్టీలు, నాయకులు నిరంతరం గ్రామాల్లో ఉండాల్సిన అవసరం లేదు. ప్రజలు ఏ విషయాల్లో కోపంగా ఉన్నారు, ఎక్కడ అనుకూలంగా ఉన్నారు. వారు ఏమి కోరుకుంటున్నారు. కార్యకర్తల మధ్య చీలిక ఎందుకు వచ్చింది. వారిని ఏ రకంగా బుజ్జగించాలి. వారికి ఏమి కావాలన్నది తమ మద్దతుదారులను పంపించి అష్టకష్టాలు పడాల్సిన పనీ లేదు. ఆ పని మేమే చేస్తామంటున్నాయి సర్వేల సంస్థలు. ఏయే పార్టీకి, ఏ నాయకుడికి ఏ ప్రాంతంలో ఎలా ఉంది, ఏ సామాజికవర్గం ప్రజలు దూరంగా ఉన్నారు. వారు ఏమి కోరుకుంటున్నారు, దూరంగా ఉన్నవారిని దగ్గరకు చేర్చుకోవడానికి ఏమీ చేస్తే బాగుంటుంది అన్ని వర్గాల మనోగతం ఆధారంగా పూర్తిస్థాయి నియోజక, రాష్ట్రస్థాయి నివేదికను అందిస్తామంటున్నాయి. నియోజకవర్గానికి పది లక్షలు ఖర్చు పెట్టుకోగలిగితే ఎన్నికల నాటికి పూర్తి ముఖ చిత్రాన్ని అందించి, గెలుపుబాటకు మార్గాలు వేస్తామని చెబుతున్నాయి. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రశాంత్‌కుమార్(ఐ ప్యాక్ సంస్థ) వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీకి సలహాలు అందిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కేంద్రీకరించి పనిచేయడానికి పీపుల్స్ పల్స్ కూడా ముందుకొచ్చింది. ఈ సంస్థతో ఆయా రాజకీయ పార్టీల నేతలు వ్యక్తిగతంగా కలిసి చర్చించినట్టు తెలిసింది. జనం నాడిని తెలుసుకుని ఏమి చేస్తే గెలవగలరో, ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు ఓడటానికి ఎలా చేస్తే బాగుంటుందో రాజకీయ పార్టీలకు పరిణామాలను తెలియజెబుతామని పీపుల్స్‌పల్స్ సంస్థ నిర్వాహకులు బత్తుల సురేష్‌బాబు, నరసింహారెడ్డి తెలిపారు. ఇంకా సిఎస్‌డిఎస్(లోక్‌నీతి), చాణిక్య, నీల్స్‌మార్గ్ వంటి తదితర సంస్థలు కూడా పనిచేస్తున్నాయి. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గాల వారీగా ఒక సంస్థతో సర్వే చేయించిన వివరాలు వెల్లడించారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 106 స్థానాలు టీఆర్ఎస్‌పార్టీనే గెలుస్తుందని సర్వేలో వచ్చిందని పేర్కొన్నారు. ప్రశాంత్ కిషోర్ సలహాలతోనే వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీకి వచ్చే ఎన్నికలకు సిద్ధమవుతున్నది. ఎన్నికలకు రెండేండ్ల సమయం ఉండడంతో ప్రతీ నాలుగు నెలలకోసారి నియోజకవర్గ ముఖచిత్రాన్ని ఆ సంస్థ జగన్‌కు అందించనుంది. ఎన్నికల వరకు ఆ సంస్థ జగన్ పార్టీకి పూర్తిగా పనిచేయనుంది. ఆ సంస్థ సర్వేలో వచ్చిన ప్రజల నాడి ఆధారంగానే తమ నాయకుడు కార్యక్రమాలు చేపడుతున్నారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇటీవల జరిగిన జరిగిన ప్లీనరీలోనూ ప్రశాంత్‌కిషోర్ హాజరుకావడం, ఆయన వల్లే కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని జగన్ చెప్పిన విషయం తెలిసిందే. ప్రశాంత్ వల్లే నరేంద్రమోడీ ప్రధాని అయ్యారని బీజేపీ నేతలు చెబుతుంటారు. దీని ఆధారంగా బీజేపీ అధికారంలోకి రావడానికి మీడియా సంస్థలను గుప్పిట్లో పెట్టుకోవడం, పెద్దపెద్ద పారిశ్రామికవేత్తలకు అనుకూల నిర్ణయాలు తీసుకోవడం, పేద, మధ్యతరగతి ప్రజలు, ఇలా అన్నివర్గాల ఓటర్ల దరిచేరడం కోసం కొన్ని హామీలు ఇవ్వడం చేసింది. నరేంద్రమోడీని సోషల్ మీడియాలో ఆకాశానికెత్తింది. అధికారంలోకి రావడానికి ఇలాంటి సంస్థలు పనిచేస్తాయి తప్ప, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ప్రభుత్వాలు ప్రజల కోసం మంచిగా పనిచేస్తాయా లేదా అన్నది మాత్రం చెప్పబోవని పలువురు నేతలు తెలిపారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏమి చేస్తుందనేది అందరికీ తెలిసిందేనని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు అదే మార్గంలో మిగతా పార్టీలు వెళుతున్నాయి. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో ఇద్దరు ముఖ్యమంత్రులు మూడునెలకోసారి ఎమ్మెల్యేల పనితీరుపై సర్వేలు చేయించుకుంటున్న విషయం తెలిసిందే.

శాస్త్రీయత ఉందా..?

అయితే సంస్థల సర్వేల్లో శాస్త్రీయత ఉండడం లేదన్న అభిప్రాయం ఉంది. ఆ సంస్థ ఎవరిని కలిసింది. ఓటర్లు ఏమి కోరుకుంటున్నారు, ఎంతమందిని కలిశారు, శాస్త్రీయబద్ధంగా జరిగిందా, శాంపిల్స్ ఏమిటి అన్న వాటిని పక్కనపెట్టేసి, తూతూమంత్రంగా సర్వే చేస్తున్నాయి. ఊర్లో ఒకరిద్దరిని కలిసి అదే ప్రామాణికం అన్నట్టుగా సర్వే రిపోర్టును వెల్లడిస్తున్నాయి. ఇతర పార్టీలకు బలంగా ఉన్నచోట్ల కూడా మరోపార్టీ బలంగా ఉందని చెప్పడమంటే ఇందులో భాగమే. ఆ పార్టీని బలహీనపరిచి, ఓటర్లలో లేనిపోని గందరగోళాన్ని గురిచేయడమే అవుతుంది. ఇప్పటివరకు ఐఎస్‌డిఎస్(లోక్‌నీతి) సంస్థ వాస్తవానికి దగ్గరగా ప్రజల వద్దకు వెళ్లి సర్వే చేసిందని పలువురు చెబుతున్నారు. అందులో రజనీకోఠారి, యోగేంద్రయాదవ్, కేసీ సూరి, సందీప్‌శాస్త్రి, సంజయ్‌కుమార్ వంటివారు ఉన్నారు. ఆ దిశగా తమ సంస్థ ఉంటుందని పీపుల్స్‌పల్స్ నిర్వాహకులు చెబుతున్నారు. గెలిపిస్తామని చెప్పకుండా ప్రజలకు ఏమి చేస్తే గెలుస్తారన్నది మాత్రం చెప్పగలమని అంటున్నారు. సర్వేకు సంబంధించి ప్రశ్నలను కూడా రాజకీయ పార్టీలకు ముందుగానే అందించనున్నారు.

ఈఎస్ఐ వైద్య కళాశాలలో ఫీజుల ఖరారు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సనత్‌నగర్ ఈఎస్ఐ వైద్యకళాశాలలో ఫీజులు ఖరారయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలల్లోని ఫీజులనే ఈఎస్ఐకి వర్తింపజేస్తూ అడ్మినిస్ట్రేషన్ ఫీ రెగ్యులేటరీ కమిటీ (ఏఎఫ్ఆర్‌సీ) నిర్ణయించింది. ఈ మేరకు ఏఎఫ్ఆర్‌సీ చైర్మెన్ జస్టిస్ స్వరూప్‌రెడ్డి ఆధ్వర్యంలోని సభ్యుల బృందం గురువారం హైదరాబాద్‌లో సమావేశమైంది. కాగా, ప్రభుత్వ కోటాలో కన్వీనర్ కోటా ఏ (50 శాతం) రూ.60 వేలు, మేనేజ్‌మెంట్ బీ (35 శాతం) రూ.11.55 లక్షలు, ఎన్ఆర్ఐ సీ కోటా రూ.23.10 లక్షలు వసూలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇవే ఫీజులను 100 ఎంబీబీఎస్ సీట్లున్న ఈఎస్ఐలోనూ విద్యార్థులు చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఒకట్రెండు రోజుల్లో విడుదలయ్యే అవకాశం ఉంది.

'అవయవదానంపై అవగాహన కల్పించాలి'

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అవయవదానంపై సమాజంలో విస్తృత ప్రచారం, అవగాహన కల్పించాలని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి కోరారు. ఒకరు చనిపోయినా, వారి అవయవదానం తో ఇతరుల్లో జీవించే ఉంటారని చెప్పారు. గురువారం రవీంద్రభారతిలో జీవన్‌దాన్ కుటుంబ సభ్యుల సన్మానన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అవయవ మార్పిడులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. సమాజంలో కిడ్నీ, లివర్, గుండె వంటి అవయవాలు చెడిపోతుండటం విచారకరమన్నారు. కిడ్నీ బాధితులు పెరుగుతున్నారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అవయవ మార్పిడులను ఆరోగ్యశ్రీ పరిధిలో చేర్చామన్నారు.

శాస్త్ర పరిశోధనకు 3 శాతం నిధులు కేటాయించాలి

జనవిజ్ఞాన వేదిక నాయకులు

● యూనివర్సిటీ కేంద్రాలలో ఈ సైన్స్ ప్రదర్శనలు

● 9న సైన్స్ ప్రదర్శన



నవతెలంగాణ - అంబర్‌పేట్

శాస్త్ర పరిశోధనకు మనదేశ జీడీపీలో మూడుశాతం నిధులు కేటాయించాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వరరావు, సర్వేశ్వరావు, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ బిఎన్.రెడ్డి, రమేష్, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ కె.బాబురావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 9న దేశవ్యాప్తంగా జరగనున్న సైన్స్ ప్రదర్శన (మార్చ్)ను మన రాష్ట్రంలో కూడా జయప్రదంగా నిర్వహించాలని కోరారు. హైదరాబాద్‌లోని హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ..రాష్ట్రంలోని అన్నిజిల్లాల్లో ప్రధాన యూనివర్సిటీ కేంద్రాలలో ఈసైన్స్ ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు చెప్పారు. శాస్త్రీయ అవగాహన, నిర్ణయాల ప్రాతిపదికనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ విధానాలను రూపొందించాలని డిమాండ్ చేశారు. సైన్స్ పేరుతో చలామణి అవుతున్న అశాస్త్రీయ ఛాందస మౌఢ్య విధానాలను అరికట్టాలనే ప్రధాన లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం మనం జీడీపీలో కేవలం 0.8 శాతం నిధులు మాత్రమే శాస్త్ర సాంకేతిక రంగాలకు కేటాయిస్తున్నారని, దీన్ని కనీసం మూడుశాతానికి పెంచాలన్నారు. శాస్త్రసాంకేతిక రంగాల్లో యావత్ ప్రపంచం తోపాటు మనదేశం ఎంతో ప్రగతి సాధించిన ప్పటికీ...ఆ ఫలాలు మనదేశ ప్రజలకు అందట్లేదని విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం శాస్త్రరంగాలకు అతి తక్కువ నిధులు కేటాయి స్తున్నారని, అందులోనూ ఎక్కువశాతం అంతరిక్ష, అణుశాస్త్ర రంగాలకే వెచ్చిస్తున్నారని తెలిపారు. దీంతో ప్రాథమిక పరిశోధనలు కుంటుపడు తున్నాయని తెలిపారు. దేశంలో అత్యుత్తమ శాస్త్ర సాంకేతిక పరిశోధనలు జరగడం లేదన్నారు. ఇటీవల కాలంలో జరిగిన ఇండియా సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు వేదాలలో సైన్స్, గోమూత్రం వంటివి రుజువులు లేవని, అశాస్త్రీయ భావాలను సైన్స్ సిద్ధాంతాలుగా చెప్పించినందున వివాదస్పదమైన విషయాన్ని వారు గుర్తుచేశారు. మనరాష్ట్రంలో 9న జరగనున్న సైన్స్ ప్రదర్శన (మార్చ్)లో రాష్ట్రంలోని వివిధ సంస్థల శాస్త్రవేత్తలు యూనివర్సిటీలు, కళాశాలల సైన్స్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు సైన్స్ పరిశోధక విద్యార్థులు, శాస్త్ర ప్రచారకులు పాల్గొనాలని వారు కోరారు.

కాంగ్రెస్‌లోకి వెళ్లే ప్రసక్తే లేదు : డీఎస్

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

టీఆర్ఎస్ ఎంపీ డి శ్రీనివాస్ పార్టీని వీడి మళ్లీ కాంగ్రెస్‌లోకి వెళ్తారని సామాజిక మాధ్యమాల్లో, పేపర్లలో వచ్చిన వార్తలను ఆయన ఖండించారు. కాంగ్రెస్‌లోకి తిరిగి వెళ్లే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో డీఎస్ గురువారం మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తార్న వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తవమని చెప్పుకొచ్చారు. ఇక తన సూచన మేరకే దిగ్విజయ్‌సింగ్‌ను తొలగించారన్న వార్తల్లోనూ నిజం లేదని అన్నారు. టీఆర్ఎస్‌లో గౌరవంగా ఉన్నానని, తనకూ సీఎంకు ఎలాంటి విభేదాలూ లేవని చెప్పారు. తన హోదాకు తగ్గట్టుగా కేసీఆర్ గౌరవించారని తెలిపారు. అయితే కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడేందుకు డీఎస్ నిరాకరించారు. తానిప్పుడు టీఆర్ఎస్ అని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు అన్యాయం జరిగిందని ఆ పార్టీలో ఉన్నప్పుడే చెప్పానని వివరించారు.

మీడియా ఎదుట ఇన్ని అబద్ధాలా?

సీఎం వ్యాఖ్యలపై సీఐటీయూ ఫైర్

● పోరాటాలు లేకుండా ఎవరికి వేతనాలు పెంచారు?

● సమాన పనికి సమాన వేతనం ఇచ్చే నిజాయితీ ఉందా!

● వాగాడంబరమే తప్ప చిత్తశుద్ధి లేదు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని కార్మిక సంఘాలు, ప్రజాస్వామిక శక్తులపై సీఎం కేసీఆర్ మీడియా ఎదుట పచ్చి అబద్ధాలు చెప్పారని సీఐటీయూ రాష్ట్ర కమిటీ పేర్కొంది. అసహనంతో అందర్నీ దుర్భాషలాడుతూ వాగాడంబరాన్ని ప్రదర్శించారే తప్ప సమస్యల పరిష్కారంలో ఎక్కడా చిత్తశుద్ధిని చూపలేదని విమర్శించారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, సమానపనికి సమాన వేతనం, మున్సిపల్, గ్రామపంచాయతీ, ఆశాల సమ్మె, సింగరేణి డిపెండెంట్ ఉద్యోగాలు వంటి అన్ని అంశాల్లో సీఎం కేసీఆర్ చెప్పినవన్నీ అబద్ధాలేనని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, ఎం సాయిబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తే, ఒక్క హైదరాబాద్ తప్ప ఇతర మున్సిపాల్టీల్లో ఇప్పటి వరకు జీతాలు ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. ఆశావర్కర్లు 106 రోజులు సమ్మె చేస్తే, ఎవరూ అడక్కుండానే జీతాలు పెంచానని చెప్పడం పచ్చి అబద్ధం కాక మరేమిటన్నారు. వారి జీతాలు రూ.6వేలకు పెంచుతున్నామని ప్రకటించి, మూడునెలలు దాటినా ఇప్పటి వరకు జీవో ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి దశలోనే అంగన్‌వాడీలు సమరశీల సమ్మె చేశారని, దాని ప్రభావంతోనే వారి జీతాలు పెరిగాయే తప్ప, సీఎం కేసీఆర్ చెప్పినట్టు ఎవరూ అడక్కుండా పెంచినవి కాదని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజనం, గ్రామపంచాయతీ కార్మికుల జీతాలు ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించి, జీతం రూ.23వేలకు పెంచామని చెప్పడం మరో పెద్ద అబద్ధమని స్పష్టం చేశారు. విద్యుత్ సంస్థలో పర్మినెంట్ ఉద్యోగం చేస్తున్న అన్‌స్కిల్డ్ వేతనం రూ.20వేలకు పైగా ఉంది. ప్రభుత్వం నిర్ణయించిన కాంట్రాక్ట్ కార్మికుడి జీతం రూ.13వేలు. ఇదేనా సమాన పనికి సమాన వేతనం అని ప్రశ్నించారు. ఇవన్నీ ముఖ్యమంత్రి మోసకారితనానికి ఓ మచ్చుతునకలని చెప్పారు. సింగరేణిలో 25ఏండ్లుగా కాంట్రాక్టర్ల క్రింద కాంట్రాక్ట్ కార్మికులు దోపిడీకి గురౌతున్నారు. ఇది సీఎంకు, కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలకు కనిపించట్లేదా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోనే సుమారు 1లక్ష 40వేల మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారన్న విషయం మంత్రులు, అధికారులకు తెలియదా అని అడిగారు. కాంట్రాక్ట్ కార్మికుల్ని తాము క్రమబద్ధీకరిస్తుంటే కోర్టులు కొట్టివేస్తున్నాయని, ప్రభుత్వం ఏం చేస్తుందని సీఎం నిస్సహాయత వ్యక్తం చేయడం పెద్ద నాటకమని విమర్శించారు. స్వరాష్ట్ర తెలంగాణలో కాంట్రాక్ట్ వ్యవస్థను పాతరేస్తానని వాగ్దానం చేసింది ముఖ్యమంత్రే అని తెలిపారు. ఖాళీ పోస్టుల్ని భర్తీ చేస్తామని చెప్పారు. వీటన్నింటిలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. నిరుద్యోగులకు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు మధ్య తగాదాలు సృష్టిస్తూ ప్రభుత్వం అతితెలివి ప్రదర్శిస్తోందన్నారు. క్రమబద్ధీకరణకు హైకోర్టు నుంచి అభ్యంతరాలు వస్తున్నాయని చెప్తున్న సీఎం నిజంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉంటే...సుప్రీంకోర్టు ఇచ్చిన సమాన పనికి సమాన వేతనం తీర్పును అమలు చేసే నిజాయితీ ఉన్నదా అని సూటిగా ప్రశ్నించారు. కార్మికుల సమస్యల్ని ప్రభుత్వంతో చర్చించేందుకు సిద్ధమని అన్ని కార్మిక సంఘాలు అపాయింట్‌మెంట్ అడిగితే ఇవ్వని సీఎం వారి సంక్షేమం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మూర్ఖులకు అపాయింట్‌మెంట్ ఇస్తామా అనడమే పెద్ద మూర్ఖత్వమని సీఐటీయూ భావిస్తున్నదని స్పష్టంచేశారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ వాగాడంబర మాటలు కట్టిపెట్టి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎలా న్యాయం చేయోచ్చో పరిశీలించేందుకు అన్ని కార్మిక సంఘాలతో సమీక్షకు సిద్ధం కావాలని కోరారు. లేకుంటే సమస్యల పరిష్కారం నుంచి ప్రభుత్వం పారిపోయినట్టే భావించాల్సి వస్తుందని పేర్కొన్నారు.

నేటినుంచి డీ ఫార్మసీ కౌన్సెలింగ్


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డీ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు శుక్రవారం నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు డీ ఫార్మసీ ప్రవేశాల కన్వీనర్ ఏ వాణీప్రసాద్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ధ్రువపత్రాల పరిశీలన చేపడతామని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 9 నుంచి ఎంసెట్‌లో అర్హులైన ఎంపీసీ అభ్యర్థులు, ఉదయం 11 గంటల నుంచి బైపీసీ అభ్యర్థులు హాజరుకావాలని కోరారు. ఈనెల 4,5 తేదీల్లో అభ్యర్థులు వెబ్ఆప్షన్లు నమోదు చేయాలని తెలిపారు. ఈనెల 8న సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. డీ ఫార్మసీ కౌన్సెలింగ్ నిర్వహణ కోసం ఐదు హెల్ప్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

'వీవోఏలకు రూ.3 వేల గౌరవవేతనం'

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వీలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ల(వీవోఏ)కు రూ. 3 వేల గౌరవ వేతనం అందజేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు జీవో నెంబరు 58ని విడుదల చేసినట్టు చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి తెలంగాణలోని 18,836 మంది వీవోఏలకు ప్రయోజనం కలగనుందని వివరించారు. సామాజిక రుగ్మతలు రూపుమాపడంలో అక్షరాస్యత కీలకమన్నారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రైల్వే పోలీసు దాడుల్లో

రూ.30 లక్షల గంజాయి పట్టివేత

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

రైళ్లలో సాగుతున్న గంజాయి స్మగ్లింగ్‌పై కొరడా ఝుళిపించిన రైల్వే పోలీసు విభాగం రూ.30 లక్షల రూపాయల విలువైన గంజాయిని పట్టుకుంది. నలుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేసిందని ఆ విభాగం డైరెక్టర్‌జనరల్ టీ.కృష్ణప్రసాద్ గురువారం తెలిపారు. రాష్ట్రంలో డ్రగ్ సరఫరా, వినియోగానికి సంబంధించి పలువురు నిందితులు కార్యకలాపాలు వెలుగు చూసిన నేపథ్యంలో రైల్వే పోలీసు పరిధిలో తమ పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం సాగుతున్న ప్రత్యేక దాడులకు సికింద్రాబాద్ రైల్వే ఎస్‌పీ రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో రైల్వే ఇన్‌స్పెక్టర్లు జ్యోతి, రత్నం తదితరులతో కూడిన టీమ్‌లు పాల్గొన్నాయని తెలిపారు. ఇక ముందు కూడా ఈ టీమ్‌లు తమ దాడులను సాగిస్తాయని అన్నారు.

పీడీఎస్‌యూ నేతను విడుదల చేయాలి

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

పీడీఎస్‌యూ హైదరాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల కార్యదర్శి పి మహేశ్‌ను వెంటనే విడుదల చేయాలనీ, ఆయనపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యవతి డిమాండ్ చేశారు. అరెస్టును నిరసిస్తూ హైదరాబాద్‌లోని రాంనగర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. శ్రీహిందూ ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యం, పోలీసులు కుమ్మక్కై విద్యార్థి నాయకులపై కేసులు పెట్టడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్, నాగేశ్వర్‌రావు, కావేరి, నాగరాజు, అనీల్, విష్ణు, స్వాతి లు పాల్గొన్నారు


ఉన్నత విద్యామండలి చైర్మెన్‌గా పాపిరెడ్డి

● మరో మూడేండ్లు అవకాశమిచ్చిన ప్రభుత్వం

● కార్యదర్శిగా ఎన్ శ్రీనివాసరావు కొనసాగింపు

● వైస్ చైర్మెన్లుగా లింబాద్రి, వెంకటరమణ

● దస్త్రంపై సీఎం కేసీఆర్ సంతకం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్ఈ) చైర్మెన్ నియామకంపై నెలకొన్న అనేక ఊహాగానాలకు తెరపడింది. టీఎస్‌సీహెచ్ఈ చైర్మెన్‌గా తుమ్మల పాపిరెడ్డి మళ్లీ నియామకమయ్యారు. మరో మూడేండ్లు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన దస్త్రంపై ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు గురువారం సంతకం చేశారు. గురువారం అర్ధరాత్రి లేదా శుక్రవారం ఉత్తర్వులు విడుదలయ్యే అవకాశముంది. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లుగా కొనసాగుతున్న కె వెంకటాచలం, ఎస్ మల్లేష్‌లకు రాష్ట్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. వారి స్థానంలో ఓయూకు చెందిన లింబాద్రి, హెచ్‌సీయూకు చెందిన వెంకట రమణలను నియమించింది. కార్యదర్శిగా ప్రస్తుతం పనిచేస్తున్న ఎన్ శ్రీనివాసరావును కొనసాగిస్తున్నట్టు ప్రకటించింది. ఇప్పటికే కొత్తగా నియమించిన వారి పేర్లను ఉన్నత విద్యామండలి కార్యదర్శి శ్రీనివాసరావుకు అధికారికంగా చేరాయి. ఉత్తర్వులు రావడమే ఆలస్యం. శుక్రవారంతో చైర్మెన్ పాపిరెడ్డి, ఆదివారంతో వైస్ చైర్మెన్లు వెంకటాచలం, మల్లేష్‌ల పదవీ కాలం ముగియనున్న విషయం తెలిసిందే. గురువారం దీనిపై సమీక్షించిన ముఖ్యమంత్రి కేసీఆర్ చైర్మెన్‌గా పాపిరెడ్డి, వైస్ చైర్మెన్లుగా లింబాద్రి, వెంకటరమణలను నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. వారు ఈ పదవుల్లో 2020, ఆగస్టు వరకు కొనసాగుతారు. ఈ సందర్భంగా పాపిరెడ్డి నవతెలంగాణతో మాట్లాడుతూ మరో మూడేండ్లు చైర్మెన్‌గా అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరికి, మంత్రి కేటీఆర్‌కు, సహకరించిన అందరికీ కృతజ్ఞతలు చెప్పారు. ఉన్నత విద్యారంగాన్ని ముందుకు తీసుకుపోవడానికి అన్ని విధాలా కృషి చేస్తామని అన్నారు. విశ్వవిద్యాలయాలను, ఉన్నత విద్యాశాఖను సమన్వయం చేసుకొని తెలంగాణను విద్యారంగంలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

ఎస్ఆర్ఎస్‌పీ పునరజ్జీవ సభకు ఈటల పర్యవేక్షణ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

10న జరిగే ఎస్ఆర్ఎస్‌పి పునరజ్జీవ సభ ఏర్పాట్లను పర్యవేక్షించే బాధ్యతలను ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్‌కు అప్పగించారు. ఎస్ఆర్ఎస్‌పి పరిధిలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులను సమన్వయం చేసి సభను విజయవంతం చేసే బాధ్యతలు తీసుకోవాల్సిందిగా ముఖ్యమంత్రి కోరగా దానికి మంత్రి ఈటల అంగీకరించారు.

గొర్రెలు, చేప పిల్లల పంపిణీపై మంత్రి సమీక్ష

రాష్ట్రంలో గొర్రెలు, మత్స్య రంగ అభివృద్ధి కోసం పశుసంవర్ధక శాఖ మంత్రి శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన ఏర్పాటైన మంత్రి వర్గ ఉప సంఘం గురువారం సచివాలయంలో సమావేశం కానుంది. గొర్రెలు, చేపల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా చేయూతనిచ్చేందుకు చేపట్టవలసిన చర్యలపై అధ్యయనం చేసేందుకు గానూ ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రి వర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో రాష్ట్ర మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వరరావు, జగదీశ్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జోగు రామన్న, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు నిరంజన్‌రెడ్డి సభ్యులుగా ఉన్నారు.

గిరిజన క్రీడాకారున్ని అభినందించిన బుర్రా

శ్రీలంక రాజధాని కొలంబోలో జరిగిన మూడవ స్టూడెంట్స్ ఒలిపిక్స్ ఇంటర్నేషనల్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం ఇప్పలపల్లి గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి తిరుపతి నాయక్ జూడో క్రీడల విభాగంలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించటం పట్ల తెలంగాణ టూరిజం, క్రీడల శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం అభినందించారు.

పసుపు బోర్డు ఏర్పాటు చేయండి

ప్రధానికి ఎంపీ కవిత వినతి

● కనీస మద్దతు ధర ప్రకటించాలని విన్నపం



నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

దేశంలో పసుపు పండించే రైతుల ప్రయోజనాల కోసం ప్రత్యేకంగా పసుపు బోర్డును ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీకి ఎంపీ కవిత కోరారు. నిజామాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులతో కలిసి గురువారం పార్లమెంట్‌లోని ప్రధాని కార్యాలయంలో మోడీని కలిశారు. ప్రస్తుతం దేశంలో ఉన్న మసాలా దినుసుల బోర్డు 54 రకాల ఇతర పంట ఉత్పత్తులపై పని చేస్తోందని, ఫలితంగా పసుపు పంటను వ్యూహాత్మకంగా అభివృద్ధి చేయడంలో దృష్టి సారించలేకపోతుందని తెలిపారు. కాబట్టి పసుపు పంట కోసం ఓ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఇక పసుపు పంటకు ఇప్పటి వరకు కనీస మద్దతు ధర లేదని, ఫలితంగా రైతులు సంక్షోభంలో చిక్కుకుంటున్నారని తెలిపారు. 25 రకాల పంటలకు కనీస మద్దతు ధర ఉందని, ఆ జాబితాలో పసుపును చేర్చాలని కోరారు. పండించిన పసుపు పంటకు ఉత్తమమైన ధర రైతులకు లభించాలంటే పసుపు దిగుమతులపై నిషేధం విధించాలని కోరారు. ఈ సందర్భంగా పసుపు పంట కోసం అసోం, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు రాసిన లేఖ ప్రతులను ప్రధానికి అందజేశారు. సమావేశనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. తమ విజ్ఞప్తులపై ప్రధాని సానుకూలంగా స్పందించారని తెలిపారు. త్వరలోనే పసుపు బోర్డు ఏర్పాటువుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రిని కలిసిన వారిలో నిజామాబాద్ అర్బన్, రూరల్ ఎమ్మెల్యేలు బిగాల గణేష్‌గుప్తా, బాజిరెడ్డి గోవర్ధన్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తదితరులున్నారు.

అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతనం పెంపు : దత్తాత్రేయ

నవతెలంగాణ-న్యూఢిల్లీబ్యూరో

అసంఘటితరంగంలోని వ్యవసాయ, భవన నిర్మాణ, బీడీ, బొగ్గుగని కార్మికుల రోజువారీ కనీస వేతనాన్ని దాదాపు 42 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని కేంద్ర కార్మిక, ఉపాధి కల్పనా శాఖ మంత్రి బండారు దత్తాత్రేయ వెల్లడించారు. గురువారం ఢిల్లీలో జాతీయ కనీస వేతన సలహా బోర్డు చైర్మెన్ గోవర్ధన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఈ నిర్ణయం వల్ల లక్షలాది మంది కార్మికులకు ప్రయోజనం చేకూరనుందని తెలిపారు. బోర్డు నిర్ణయం ప్రకారం వ్యవసాయ కార్మికుల కనీస వేతనం రూ.211 నుంచి రూ.300, వ్యవసాయేతర కార్మికుల కనీస వేతనం రూ.250 నుంచి రూ.350 పెంచినట్టు తెలిపారు. అలాగే ప్రతిరాష్ట్రంలోనూ కనీస వేతన సలహా బోర్డులను ఏర్పాటుచేయాలని సూచించారు. ఈ బోర్డు లేకపోవడం వల్ల కనీస వేతన అమలు పర్యవేక్షణ లోపించిందని అన్నారు.

నిజాంసాగర్ ఎస్ఐని సస్పెండ్ చేయాలి

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం కొమలంచ గ్రామానికి చెందిన కుర్మ బాలమణి విచక్షణారహితంగా దాడిచేసిన ఎస్ఐ అంతిరెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని శ్రామిక మహిళ సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్ రమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అర్ధరాత్రి ఇంటిపై దాడిచేసి అసభ్యపదజాలంతో దూషించడమే కాకుండా, మహిళా కానిస్టేబుల్ లేకుండా చట్టవిరుద్ధంగా ప్రవర్తించిన ఎస్ఐపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆమె కుమారుడిపై దొంగతనం ఆరోపణలు వస్తే, బాలమణిపై దాడిచేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

నిజాలు రాస్తే కోపమెందుకు?

నిక్కచ్చిగా.. నిజాయితీగా ఉంటే అంత అక్కసా..?

- సీఎం కేసీఆర్‌వి పిట్టల దొర మాటలు
- ప్రజల పక్షాన నిలుస్తున్న నవతెలంగాణను విమర్శించడం సరైంది కాదు
- సీఎం వ్యాఖ్యలపై స్పందించిన వేములఘాట్ రైతులు

వేములఘాట్ నుంచి మదూరి శ్రీరామ్


'నిక్కచ్చిగా..నిజాయితీగా ఉంటే ఆ దొరకు మింగుడుపడదు. అతను చెప్పిందే వేదం... తాను చేసిందే శాసనం. చెవులు ఊపితేనే తన వాళ్లు. గట్లగాదంటే ఇష్టమొచ్చినట్టు సీఎం మాట్లాడుతుండ్రు. 'భూములు పోతున్నయి మొర్రో అంటుంటే బర్లిస్తం, గొర్లిస్తం, కోళ్లిస్తం, నలుగురికి ఒక ట్రాక్టర్లిస్తం, మళ్లీ మేమే గెలుస్తం, మా పాలనే వస్తుంది' అని ముఖ్యమంత్రి కేసీఆర్ పిట్టలదొర మాటలు మాట్లాడుతున్నరు అని సీఎం కేసీఆర్‌పై వేములఘాట్ రైతులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ప్రెస్‌మీట్‌లో 'నవతెలంగాణ'పై ముఖ్యమంత్రి తన అక్కసు వెళ్లగక్కడంతో ఆ గ్రామస్తులు స్పందించారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం మల్లన్నసాగర్ ముంపు గ్రామం వేములఘాట్‌ను సందర్శించిన 'నవ తెలంగాణ'తో వారు భావోద్వేగంతో మాట్లాడారు. నిజాయితీగా ఉంటూ ప్రజలపక్షాన పనిచేస్తున్న పత్రిక పట్ల సీఎం ఆ స్థాయిలో మాట్లడటం సరికాదన్నారు.

'మా భూములు కావాలంటూ సీఎం కేసీఆర్ జులై 22న ఫాంహౌస్‌కు చర్చలకు పిలిచిండు. 180 మంది రైతులదాకా వెళ్లినం. ఎకరానికి రూ.6లక్షలిస్తం. సంతకాలు పెట్టండి. ఎట్లయినా మల్లన్న సాగర్ ప్రాజెక్టు కట్టి తీరుదాం. ఆగేదే లేదంటూ దారుణంగా మాట్లాడిన సీఎంకు వందల ఎకరాల ఫాంహౌస్ అవసరమా?. ఆయన ఏమైన నాగలి పట్టి దున్నుతడా? ఆయన కొడుకు ఏమైన ఎవుసం చేస్తాడా? ఆళ్ల భార్యలేమైన పొలంల దిగి నాట్లు వేస్తరా? వాళ్లకెందుకు అంత భూమి? మా భూములు తీసుకుని సీఎం ఫాంహౌస్‌లో మాకు భూమి ఇస్తే సాగు చేసుకుని బతుకుతం. కానీ, ఆయన భూమి ఇవ్వడటగానీ మా భూములు కావాలంట? ఇంతకాలం మా ఊళ్లకు రాని ఎమ్మెల్యే రామలింగారెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పామ్‌హౌస్‌లోకి చర్చలకని వెళ్తే తిని వెళుండ్రి అంటూ మర్యాదగా మాట్లాడుతూ బతిమిలాడారు. నచ్చనికాడ మనస్ఫూర్తిగా ఎట్ల తింటం? తమకు ఫలించని చర్చలతో కన్నీండ్లతో వెనుదిరిగితే తిని పోయిండ్రు అంటూ ప్రచారం చేసుకుంటుర్రు. ఇదా.. సీఎం కేసీఆర్ నీచ సంస్కృతి. స్వరాష్ట్రంలో కేసీఆర్ దొర మా కడుపు మీద కొడుతున్నడు. తప్పకుండ మా పిల్లల ఉసురు తగిలిపోతడు. కడుపు మండి పోతాంది సారూ. మాకు అండగా ఉన్న పార్టీలపై, నవతెలంగాణ పత్రికపై కేసీఆర్ మింగుడుపడక ఇలాంటి వెకిలి మాటలు మాట్లాడుతున్నాడు' అని ముంపు గ్రామం వేములఘాట్ రైతులు ఘాటుగా జవాబిచ్చారు.




కడుపు మంటతో ఎట్ల దింటం..?
-వై. వినయ్‌రెడ్డి, వేములఘాట్ యువ రైతు

సీఎం చెప్పిదాంట్ల మాకు న్యాయం అన్పించలేదు. 'ఎట్లయితే గట్లయితది ఇంత దూరం వచ్చిండ్రు. ఆకలితో ఉన్నారెమో తినిపొండ్రి' అని అన్నడు. భూములు, ఇండ్లు సర్వం ఓ వైపు పోతంటే కడుపు మండుతాంది. అన్నం ఎట్ల దింటం. ఆర్డీఓ, కలెక్టర్లు తినెళ్లండ్రని బలవంతం చేసిర్రు, ఒత్తిడి చేసిర్రు. గేట్లు బంజేసి తింటేనే పంపుతాం అని బెదిరించిండ్రు తప్పని పరిస్థితుల్లో ఒక్కరిద్దరు మా గ్రామమోళ్లు కాదు కానీ.. ఎవరో తిన్నారు. కొంతమంది శనివారం ఒక్కపొద్దని చెప్పి తప్పించుకున్నరు. ఉన్నదున్నట్టు రాస్తున్న నవతెలంగాణ పత్రికపై సీఎం కేసీఆర్‌కు మింగుడు పడట్లేదు. అందుకే విమర్శలు చేస్తుండు.



ఎన్నో రకాలుగా హింసించిండ్రు....
- మల్లారెడ్డి, రైతు సంఘం నాయకులు

మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణం పేరిట భూములు లాక్కునేందుకు తమను ఎన్నో రకాలుగా హింసించిండ్రు. లాఠీచార్జీలు కూడా చేసిండ్రు. మేము అడిగిన పరిహారం మాత్రం ఇవ్వనంటుర్రు. గిట్లాంటోళ్లకాడ మేమేట్ల బుక్క దింటం. అసలు మింగుడు పడుద్దా? 2013 చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని అడిగామంతే. సీఎం చేసిన చర్చలు విఫలమైనయి. బువ్వ దినమంటే ఎట్ల దింటం. బువ్వ లేక వచ్చామనుకున్నారా..? నిజాయితీగా, నిర్మొహమాటంగా వార్తలు రాస్తున్న మీడియాపై అక్కసు వెళ్లగక్కడం ఎంత వరకు సమంజసం. మార్కెట్ రేటును రివైజ్‌చేసి మా భూములకు ధర చెల్లించాలి.



ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే ఎట్ల?
-ఎల్లంరెడ్డి, రైతు సంఘం నాయకులు , తొగుట

మల్లన్నసాగర్ బాధితుల పక్షాన నిలిచి పరామర్శిస్తున్న ప్రతిపక్షాలు, మీడియాపై సీఎం కేసీఆర్ విరుచుకుపడటం ఆయన నైజమే. ఇది కొత్తేం కాదు. తాను చెప్పిందానికి సరేనంటేనే ఆయనకు నచ్చుద్ది. లేదంటే అన్నీ ఆయనకు పనికిరానివే. చర్చలంటూ పిలిచి 'సర్వే చేపించిన. మళ్లీ నేనే గెలుస్త. నేనే మళ్లీ సీఎం అయిత' అంటూ ఏదేదో మాకు చెప్పిండు. గవన్నీ మాకెందుకు. మీరు గెలిస్తేంది? ఓడితేంది? మాకేంమొస్తది? ఫామ్‌హౌస్‌ల అన్నం తినాలంటూ కొందరిపై ఒత్తిడి చేసిండ్రు. పెద్దోలు జెప్పిరని ఒక్కరో ఇద్దరో మనసు చంపుకుని తినుంటరు. మేం తినలే. సొంత ఖర్చులతోనే వెళ్లొచ్చినం. నాకు తెలిసి మా ఊరు నుంచి పోయిన వారిలో ఒక్కరు కూడా అన్నం తినలేదు.



వ్యతిరేకంగా మాట్లాడితే కేసులు, అరెస్టులు ...
-పోరెడ్డి జనార్దన్, వేములఘాట్ రైతు

ఉన్నదున్నట్టు మాట్లాడితే, ప్రశ్నిస్తే వ్యతిరేకులు అంటూ అరెస్టులు, కేసులు చేపిస్తుండ్రు. నిజాయితీగా, నిక్కచ్చిగా రాస్తున్న నవతెలంగాణ పత్రికను పనికిమాలిన పత్రిక అంటూ మాట్లాడటం సీఎం కేసీఆర్‌కు తగదు. మాకు నచ్చేలా చల్లని విషయం చెబితే తినుండే వాళ్లమేమో. భూములు ఇచ్చినా, ఇవ్వక పోయినా డ్యాం కట్టడం ఆగదంటూ మాట్లాడిన సీఎం తిని పొమ్మంటే తింటామా? భూమికి భూమి ఇవ్వండి. లేదా మీ ఫాంహౌస్‌లో మాకు భూమి ఇవ్వండి.

(ఫైల్)



భూములు లాక్కొని బువ్వ పెడతరా..?
-ఏ. కర్ణాకర్‌రెడ్డి, వేములఘాట్ రైతు

భూమి గుంజుకుని బువ్వ తినమంటే ఎట్ల తింటం? బర్లు, గొర్లు, ట్రాక్టర్లు అంటూ పిట్టల దొరల మాటలు మాట్లాడుతున్న సీఎం కేసీఆర్ నవతెలంగాణ పత్రికను విమర్శించడం సరికాదు. ప్రజల పక్షాన నిలుస్తూ ప్రజల సమస్యలను రాస్తున్న పత్రిక నవతెలంగాణ పత్రిక ఒక్కటే. మాపై చేసిన లాఠీ చార్జీలు, నిర్బంధాలను కండ్లకు కట్టినట్టు చూపించిన టెన్‌టీవీనీ ఈ ప్రాంతంలో టెలికాస్టు కాకుండా రద్దు చేశారు. దీన్ని చూస్తుంటే ఎలుమ దొరలపాలనల ఉన్నట్టుంది. రాష్ట్రంలో దొంగలు, దొరలు ఒక్కటైండ్రు.



క్యాబినెట్‌లో తెలంగాణ దొంగలు, తెలంగాణ వ్యతిరేకులు
-కె. బాల్‌రెడ్డి, వేములఘాట్ రైతు

రాష్ట్రంల దొరలు, దొంగల పాలన సాగుతున్నది. సీఎం క్యాబినెట్‌లో దొంగలు, తెలంగాణ వ్యతిరేకులు కొనసాగుతుండ్రు. సీపీఐ(ఎం), సీపీఐ, కాంగ్రెస్, టీడీపీ వాళ్లు అభివృద్ధిని అడ్డుకుంటున్నారంటూ మాట్లాడుతున్న సీఎం మా గ్రామాల్లోకి వచ్చి మాతో ఎందుకు మాట్లాడట్లేదు. ఒకప్పుడు ఆంధ్రోళ్లు సమైక్య రాష్ట్రంలో వీపుమీద కొడితే ఇపుడు తెలంగాణలో సీఎం కేసీఆర్ దొర మా కడుపు మీద కొడ్తుండు. కేసీఆర్‌కు అన్ని ఎకరాల ఫాంహౌస్ అవసరమా.? గా భూమిని మాకు పంచివ్వు. నువ్వేమైనా నాగలిదున్నుతవా? మీ కొడుకు ఏమైన పొలం పనులు చేస్తాడా? మీ భార్య నాట్లేస్తుందా? మేం అసలైన రైతులం. సాగు చేస్తం. పంట పండిస్తం. మీకేందుకు భూములు, మాకివ్వండి.





రమ్మంటే న్యాయం చేస్తడనుకున్నం
- చింతకింది నర్సయ్య... రజకుడు

సారు..మా కష్టాలను విని రమ్మన్నారేమో అనుకున్నం. గాడ్కిబోతే బర్లు, గొర్లు, ట్రాక్టర్లు ఇస్తమని ఆశజూపిర్రు. ఉన్నవాటినే ఎంజేస్కోవాలో వశమైతలే. ఇగ గా బర్ల, గొర్ల దెచ్చుకుని నెత్తిన బెట్టుకోమా? కడుపు మండుతాంది. వ్యవసం జేసోటోనికి తెలుస్తది భూమిబోతే బాధ ఎట్టుంటదో. మాకు న్యాయం జేస్తనే భూమిస్తం. మొండిగా గట్లనే డ్యామ్ కడ్తరంటరా? అయితే మా శవాల మీద కట్టుండ్రి. మళ్ల గా జాగ ఏడ వెతుక్కోవాలి? మా బొందలు యాడ బెట్టుకోవాలి? ఓట్లు వేసి గెలిపిచ్చినందుకు మాకు వేస్తున్న శిక్ష ఇది.

పెండ్లాం, పిల్లలు ఏడుస్తుండ్రంటే వెకిలిగా నవ్విండు...



నా పెండ్లాం, పిల్లలు ఒప్పుకోరు. భూమి పోతున్నదని మనాది పెట్టుకుండ్రు. ఒకటే ఏడుస్తుండ్రు అంటే...'ఒప్పించుకొండ్రి. గివన్నీ నాకుజెప్తరా?' అంటూ సీఎం వెకిలిగా నవ్విండు. డీసీఎంలు ఇస్తాం. నలుగురు కలిసి తీసుకొండి అన్నడు. అంటే మేము తన్నుకోవాలనే గదా. గిసొంటి మాటలను మేము వినం. ఎంతకాలమైన సరే పోరాడుతం. మొత్తం భూసేకరణ అయిందని కలెక్టర్ కూడా అబద్దాలు చెబుతుండు. మీరు ఇచ్చినా, ఇవ్వకపోయినా ఆగదంటుండు. మాకు మా గ్రామాన్ని నిర్మించివ్వండి. వసతులు కల్పియ్యిర్రి. 2013 చట్టం ప్రకారం భూ సేకరణ చేయిండ్రి. అంతే తప్ప ప్రతిపక్షాలపై, మీడియాపై విమర్శలు తగవు.

- కె. భిక్షపతి, హమాలీ, రైతు

కలెక్టరే సప్పట్లు గొట్టమన్నడు...



చర్చల పేరిట ఫాంహౌస్‌కు పిలిసి మాకు నచ్చని మాటలు చెబుతున్న కేసీఆర్ మాటలకు సప్పట్లు గొట్టుండి అని కలెక్టర్ చెప్పిండు. నచ్చని మాటలు చెబితే సప్పట్లు ఎట్ల కొడ్తం? బర్లు..గొర్లు...ఎకరానికి రూ.6లక్షలిస్తమంటే కండ్లు మూసుకుని సంతకాలు పెడ్తమా? లోపలికి పత్రికలోల్లను సీఎం ఎందుకు రానియ్యలే? పత్రికోళ్లు వస్తే గుట్టు భయటపడుతదనుకున్నడా?కన్నీండ్లతో బయటకొస్తున్న మమ్మల్ని నవతెలంగాణ పలుకరించగా ఉన్నదున్నట్టు చెప్పినం. మాకు న్యాయం జరగాలని రాసిన ఆ పత్రికపై సీఎం కోపానికి వస్తుండు.

- బత్తుల మల్లేశం, వేములఘాట్

కేసీఆర్ మా ఉసురు తగిలిపోతడు



మమ్మల్ని చంపినా మా భూములివ్వం. ఇన్ని ఇండ్లు కూలగొట్టి పొలాలు గుంజుకుని మల్లన్నసాగర్ కట్టుండి. మమ్మల్ని ఇండ్లనే బొంద పెట్టుండ్రి. మా భూములు లాక్కుంటే మేం ఏం చేసి బతకాలే? మేం భూముల కోసం గిన్ని బాధలు పడ్తుంటే ఎన్నడన్న ఎమ్మెల్యే రామలింగారెడ్డి ముఖం చూపెట్టిండా? మా మంచిచెడు తెలుసుకున్నడా?ఫాంహౌస్‌లకి పోవంగనే అన్నం తినుపోరి అంటే ఎట్ల తింటం? ఈ సర్కారోళ్లను మైసమ్మ తల్లి మింగాలే. ఇంత అన్యాయమా?

గండ్ల నర్సమ్మ. వేములఘాట్ గ్రామస్తురాలు

సిల్లీ కామెంట్స్.. సింపుల్ కౌంటర్

సవాల్ జేస్తే జవాబిస్తవా ఓ పెద్ద సారూ!

సూపర్ లీడ్ లేదు..లీడ్ అంతకన్నా వద్దు. సీదా మేటర్‌లోకి వెళదాం. తెలంగాణ పెద్ద సారు..పబ్లిక్‌లోకి పోయేది లేదాయే. కలుద్దామని వస్తే, చచ్చినా రానియ్యరు. ఎప్పుడోసారి చుక్క తెగినట్టు ప్రెస్‌మీట్. అదే మహాద్భాగ్యం. శానొద్దులకు రెండు గంటలు దంచిండు. ఎవ్వరినీ వదల్లేదు. వాడూ, వీడూ, సన్నాసీ, ఆ నా కొడుకులు, ముండమోపిగాళ్లు, థర్డ్‌రేట్, దగాకోరు, పిశాచి, కురుస, భూతం, శిఖండి, దగుల్బాజీ, ఈడియాటిక్(ఆ నోటి వెంట జాలువారిన ఈ పదాలను ప్రస్తావిస్తున్నందుకు పాఠకులు క్షమించాలి) అంటూ సదరు కుర్చీకి తగని తిట్లే తిట్లు. మొత్తం, టోకున కడమోళ్లంతా వేస్టేనట! 'తాను మినహా' అందరూ అంతే అన్నట్టుగా ఎన్నెన్నో కబుర్లు. చెప్పిన వాటిల్లో ఏ ఒక్కటీ కొనముట్టక ముందే దేశంలోనే మహా గొప్పయినట్టు సందేశాలు, హావభావాలు. అట్లా నోరు జబర్దస్తిగా పారేసుకున్నారు కదా! మరి గీ ఆరంటే ఆరు సవాళ్లకు జవాబిస్తరా పెద్ద సారూ!

ఇల్లెందుల దుర్గాప్రసాద్

కామెంట్: ఉద్యోగాల నోటిఫికెషన్లపైన 16 కేసులు

కౌంటర్: మరి అంతటి లోపభూయిష్టంగా రూపునివ్వందే కోర్టులు విచారణకు స్వీకరిస్తాయా? నీళ్లు, నిధులు, నియామకాలు..మన ఉద్యమ ట్యాగ్ కదా! మరి ఎంత జాగ్రత్తగా ఉద్యోగాలిచ్చే ప్రక్రియను చేపట్టాల్సింది? దీనికి ఎంతటి ప్రాముఖ్యాన్నివ్వాల్సింది? గద్దెనెక్కాక డే వన్ నుంచే టాప్ ప్రియారిటీగా ఎందుకు ఎంచుకోలేదు? కొలువులివ్వడంలో ఎంత లేటయితే అంత బేఫికర్ అనే కదా! నౌకర్లపై ఖర్చు పెట్టాల్సిన నిధులు తమ లక్షిత అవసరాలకు వాడుకునే వెసులుబాటు ఉంటుందనే నింపాదిగా కాలక్షేపం చేయడంలేదా!

కామెంట్: లక్ష మంది కాంట్రాక్టు, పార్ట్‌టైం, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణపైనా న్యాయస్థానాన్ని ఆశ్రయించి అడ్డుతగిలారు.

కౌంటర్: అంతటి బలహీనంగా జీవోలు విడుదల చేస్తారా? కోర్టుకెక్కినా నిలదొక్కుకునేంత దృఢంగా లేని ఉత్తర్వులు అంత నిస్సారమా? అధ్యయనం మరీ పేలవమా? ఏండ్ల కమాన జాప్యం చేసి కోర్టుల గుమ్మందాకా పోయేలా వ్యతిరేకుల్లో ఆలోచన రేకెత్తడానికి పరోక్ష కారకులెవరూ? పర్మినెంట్ చేయరాదని సుప్రీం ఆదేశాలున్నాయా? అర్హత పరీక్షలో అవో ఇవో పెట్టి కార్యం నెగ్గలేరా? మరి అలాంటప్పుడు రెగ్యులరైజేషన్‌ను ఎన్నికల మేనిఫెస్టోలో ఎందుకు అలంకరించినట్టు? ఎటొచ్చి..కోర్టులు ప్లస్ పిటిషనర్ల పేరు చెప్పి..ఇక రెగ్యులర్ చేయడం డౌటేనన్నమాట! కావాలంటే జీతాలు పెంచుతారు. మరి ఇంతదానికి మూడేండ్లకు పైగా ఎందుకు సా..గదీసినట్టో. వారెవా!

కామెంట్: మల్లన్నసాగర్‌సహా ప్రాజెక్టులపై 164 కేసులా?

కౌంటర్: తొలుత ఒకదానిపై కేసు దాఖలైనప్పుడు కరెక్టుగా కసరత్తు చేస్తే ఇట్లా..బోలెడన్ని కేసులు కోర్టుల్లో నమోదయ్యేవా? న్యాయం, ధర్మం, చట్టాన్ని అనుసరిస్తే..అన్నింటికీ మించి మానవత్వాన్ని పాటిస్తే..చెప్పుకొన్నంత జటిలమయ్యేవా? అంటే..ఒకవేళ నిర్ణీత వ్యవధిలో సాగు, తాగు నీటి పథకాలు అందుబాటులోకి తేవడంలో విఫలమైతే..అవి మూలన పడితే..ఇదంతా ప్రతిపక్షాల కుట్ర. కోర్టులకు వోయి గిట్ల జేశిండ్రు. లేకుంటే గోదావరి నీళ్లతోని మీ పాదాలు కడిగెటోన్ని అంటారా? హబ్బ..ఏం ఇక్మత్ ఫో!



కామెంట్: అది గూండాయిజం

కౌంటర్: అవునా! నిజమా? ఇదేమి ఆపాదించుడు? ఇసుక మాఫియా లారీల రూపంలో అక్కడ డజను మందిని చంపింది. ఇంక చంపుతూనే ఉన్నది. ఎంత చెప్పినా, మొరపెట్టుకున్నా..మాఫియా వినకపాయే. పోలీసు, ఇతర శాఖలు కట్టడి చేయకపాయే. ఇగ ఆ అణగారిన వర్గాలు ఏం జేయాలి? మూణ్ణాలుగు లారీలను ఎవరో అంటుపెట్టిండ్రు.(తెలంగాణ ఉద్యమంల గసొంటియి ఎన్ని జేయలే?) అది గూండాయిజమా? ఆహా! ఆ మాత్రం కోపానికొస్తే..నలుగురు దళితులుసహా ఎనిమిది మందిని ఏడికాడ పల్ల జీరుడు, రహస్య అంగాలపై కరెంటు షాకులిచ్చుడు కరెక్టా? ఒక జాతీయ దళిత నాయకురాలు వచ్చి ఓదార్చితే తప్పా? ఆమె పేరు పైనా వెటకారపు వ్యాఖ్యానాలా? నిజానికి దౌర్జన్యం, గూండాయిజం చేస్తున్నది ఎవరో లోకం చూస్తున్నది. కలెక్టరు మొదలు కడ్తాల్ టోల్‌గేట్ సిబ్బంది దాకా ఎందరిపై ఎట్లెట్ల దాడులు జరుగుతున్నాయో అందరూ గమనిస్తున్నారు. మరి..ఆ ప్రబుద్ధులకు ఏడేడ '24 గంటల' కరెంటు షాకులు పెట్టిస్తరు?

కామెంట్: ఇక రాష్ట్రమంతా పర్యటిస్తా..

కౌంటర్: అబ్బో..ఎప్పుడో..! ఈడికి మూడేండ్లు అయిపాయే. కడుపుల సల్ల కదలకపోవట్టే. ఆ నడుమ కోట్లు పెట్టి స్పెషల్ బస్సు తెప్పిస్తిరి. ఎప్పుడోసారి బయటకు తీస్తున్నరు. కొత్తింట్లకు వచ్చి నెలలైపాయే. అయినా మామూలు జనానికి నో ఎంట్రీ. ఎట్లాంటి అర్హతలు ఉంటే కల్వనిస్తరు? భజన బృందాలకేనా ప్రవేశం?

కామెంట్: హుందాగా ఉంటున్నా..

కౌంటర్: బాబోయ్..హుందాగా మాట్లాడుతున్నారా? ఏమిటా బూతులు? ఆ సీటు స్థాయివేనా? ఆ రేంజ్ కుర్చీలో ఉన్నోళ్లు గతంలో ఎప్పుడైనా ఇట్లా పలికారా? హుందాగా ఉంటున్నాను అని అనుకుంటున్నారు కాబట్టి..ఈ మాత్రం తిడుతున్నారా? హమ్మో..లేకుంటే ఇంకెంతటి నీచంగా ప్రవహించేవో? అయ్యా..సారూ! మీకో దండం. మీ పాలనా వైశిష్ట్యానికి డబుల్ సలాం!!

అంతర్జాతీయం

ఇది పూర్తిస్థాయి యుద్ధమే..

రష్యా ఆర్థిక, సామాజిక సంబంధాల్ని దెబ్బతీయటమే లక్ష్యం

- అమెరికా ఆంక్షల చట్టాన్ని తప్పుబట్టిన మెద్విదేవ్
- సంబంధాలు మెరుగుపడే అవకాశం లేనట్టే !
- అక్కడి రాజకీయ శక్తులు ట్రంప్‌ను అధికారంలో నుంచి దింపేయవచ్చు !

మాస్కో : రష్యాపై అమెరికా ఆంక్షలు ఇరు దేశాల మధ్య పూడ్చలేని అగాధాన్ని తెచ్చిపెట్టింది. ఇరు దేశాల నాయకుల మధ్య మాటలు పదునుతేలుతున్నాయి. అమెరికా ఆంక్షల నిర్ణయం వెలువడటంతోనే...ఇక ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలహీనమైనాయి. ఏదో ఒక రోజు అమెరికా నుంచి మంచి మాట వినకపోతామా అని ఎదురుచూసిన రష్యా నాయకులను తీవ్రంగా నిరాశపర్చింది. అమెరికా యుద్ధాన్నే కోరుకుంటున్నదని తేలిపోయింది. కాకపోతే అది సైనిక రూపంలో లేదు ! ఆర్థిక ఆంక్షలు విధించటం, దౌత్య సంబంధాల పరంగా రష్యాను ఒంటరి చేయటం మొదలైనవాటిని అమెరికా ఎంచుకుంది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ...రష్యా ప్రధాని మెద్విదేవ్ తాజాగా 'ఫేస్‌బుక్' పేజీలో సుదీర్ఘమైన సందేశాన్ని ఇచ్చారు. ఇకపై ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడతాయన్న నమ్మకం లేదని ఆయన అన్నారు. ఆంక్షలు విధించటం ద్వారా రష్యాపై జరుపుతున్నది 'ఆర్థిక యుద్ధ'మేనని, దానిని సామాజిక అంశాల వైపూ తీసుకెళ్తారని ఆయన విశ్లేషించారు.

అమెరికా పార్లమెంట్ (చట్టసభ) ఆమోదించిన ఆంక్షల (రష్యాపై) బిల్లుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేసిన సంగతి తెలిసిందే. ఈ చట్టంలో ఉన్నట్టుగానే అమెరికా కంపెనీలు, వ్యక్తులు రష్యా పట్ల నడుచుకోవాల్సి ఉంటుంది. చట్టంలో పేర్కొన్న రష్యా వ్యక్తులతోగానీ, సంస్థలతోగానీ వర్తక, వాణిజ్య సంబంధాల్ని నెరుపరాదు. అంతేగాక ఆంక్షల్ని 'మీరూ అమలుజేయాలని' తమ మిత్ర దేశాలపై, ముఖ్యంగా యూరప్ దేశాలపై అమెరికా ఒత్తిడి తీసుకొస్తుంది. యుద్ధంకాకపోయినా...వాణిజ్యపరంగా, ఆర్థికపరంగా ఇది పూర్తిస్థాయి యుద్ధమే. ఇలాంటి వాతావరణంలో ఆ దేశంతో మెరుగైన సంబంధాల్ని కొనసాగించలేమని రష్యా ప్రధాని మెద్విదేవ్ తేల్చిచెప్పారు.

'ఫేస్‌బుక్' పోస్ట్‌లో మెద్విదేవ్ ఏమన్నారంటే...

ట్రంప్‌నకు ఇష్టం లేదు...

"రష్యాపై మళ్లీ ఆంక్షలు అనే నిర్ణయం అధ్యక్షుడు ట్రంప్‌నకు ఎంతమాత్రమూ ఇష్టం లేనిది. దీనిపై ఆయన ఏమాత్రమూ సంతోషంగా లేరు. అయినప్పటికీ బిల్లుపై సంతకం చేయాల్సి వచ్చింది. ఇంతకు ముందున్న చట్టం 'జాక్సన్-వానిక్' కన్నా తాజా చట్టం చాలా కఠినమైనది. 'జాక్సన్-వానిక్' ప్రకారం రష్యాపై ఆంక్షల్ని తొలగించాలంటే అధ్యక్షుడు ఒక్కడు నిర్ణయం తీసుకుంటే సరిపోయిదే. పూర్తి హక్కులు ఆయనవే. కానీ తాజా చట్టం ఆ హక్కును అధ్యక్షుడి నుంచి లాక్కుంది. తాజా చట్టం ప్రకారం...సెనెట్, శ్వేతసౌధం ఆమోదిస్తేగానీ ఆంక్షల తొలగింపు సాధ్యంకాదు"

- మెద్విదేవ్

"ఏదైనా అద్భుతం జరిగితే తప్ప...అమెరికా-రష్యా మధ్య సంబంధాలు మెరుగుపడే అవకాశం లేవు. రష్యా పట్ల వ్యతిరేకత కలిగిన రాజకీయ నేతలు అంతర్గతంగా తీసుకొొచ్చిన ఒత్తిడికి 'శ్వేతసౌధం' లొంగిపోయింది. ఈ ఘటనతో శ్వేతసౌధం (ట్రంప్ సర్కార్) బలహీనత, అసమర్థత బయటపడింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన కార్యనిర్వాహక అధికారాన్ని కాంగ్రెస్ (అమెరికా చట్టసభ) చేతుల్లోకి జారవిడిచారు. రష్యాతో సన్నిహిత సంబంధాల్ని కోరుకుంటున్న ట్రంప్ పట్ల అమెరికా రాజకీయ ప్రముఖులు వ్యతిరేకంగా ఉన్నారు. వారికి వారి దేశ ప్రయోజనాలు కూడా పట్టవు. చివరికి అమెరికా రాజకీయ శక్తులు ట్రంప్‌ను అధికారంలో నుంచి కూడా దింపేస్తాయి.

నవచిత్రం



సంపత్ నంది, గోపీచంద్, కేథరిన్, జె.పుల్లారావు, జె.భగవాన్

విజయపథంలో గౌతమ్‌నంద

గోపీచంద్, హన్సిక, కేథరిన్ త్రెస్సా హీరోహీరోయిన్లుగా సంపత్ నంది దర్శకత్వంలో జె.భగవాన్, జె.పుల్లారావు సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'గౌతమ్‌నంద'. ఈ చిత్రం ఇటీవల విడుదలైన నేపథ్యంలో గురువారం సక్సెస్‌మీట్‌ను ఏర్పాటు చేసింది యూనిట్. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ, 'ఈ నెల 28న విడుదలైన ఈ చిత్రాన్ని ఇంత మంచి హిట్ చేసిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. నేను ఇప్పటి వరకు చేసిన సినిమాలతో పోల్చితే నాకు బాగా సంతృప్తినిచ్చిన సినిమా ఇది. ఇంత మంచి కథను అందించిన దర్శకుడు సంపత్‌నందికి ధన్యవాదాలు. నేను నటించిన సినిమాలన్నింటిలో మొదటి మూడు రోజుల్లో ఎక్కువ కలెక్షన్లు వచ్చింది ఈ చిత్రానికే. సినిమాలో నా నటనతోపాటు పోరాట సన్నివేశాలను ప్రశంసిస్తున్నారు. ఇరగదీశావంటూ మెచ్చుకుంటున్నారు. అయితే సినిమా పైరసి అయ్యిందని తెలిసింది. దయచేసి ఎవరూ పైరసీని ప్రోత్సహించవద్దు. సినిమా మరింత పెద్ద హిట్ అయి డిస్ట్రిబ్యూటర్స్‌కి లాభాలు రావాలి' అని అన్నారు.

'మొదట్నుంచి చెప్పినట్టుగానే నేను చేసిన సినిమాల్లో కథాపరంగా బాగా సంతృప్తినిచ్చిన చిత్రమిది. సినిమాకు రేటింగ్స్ గొప్పగా లేకపోయినప్పటికీ ప్రేక్షకులు మాత్రం గుండెకు హత్తుకుని ఆదరిస్తున్నారు. నాకు ఇద్దరు రోల్ మోడల్స్ ఉన్నారు. అందులో మా ఫాదర్ ఒకరు, ఐఏఎస్ సాంబశివరావు మరొకరు. విడుదలైన ఫస్ట్‌డే సాయంత్రం వరకు నాకు కాల్స్ రాలేదు. ఫస్ట్‌డే సినిమా చూసిన తర్వాత మా ఫాదర్ ఫోన్ చేసి మంచి సినిమా తీశావురా అని, సాంబశివరావు ఫోన్ చేసి 'నీకెరీర్‌లో వన్ ఆఫ్ ది బెస్ట్ మూవీ' అని ప్రశంసించారు. అంతేకాదు వనస్థలిపురం నుంచి ఓ అమ్మాయి ఫోన్ చేసి 'మా ఫాదర్‌కి త్వరలో బైక్ కొనిస్తాను' అని చెప్పింది. ఇంతకంటే ఓ దర్శకుడికి గొప్ప కాంప్లిమెంట్స్ వస్తాయని నేననుకోను. ఇది కొత్త కథ కాదు. పాత కథనే కొత్తగా చెప్పే ప్రయత్నం చేశా. ఆదరిస్తున్న అందరికి ధన్యవాదాలు' అని దర్శకుడు సంపత్‌నంది తెలిపారు.

కేథరిన్ చెబుతూ, 'ఈ చిత్రంలో భాగం కావడం ఆనందంగా ఉంది. ఛాన్స్ ఇచ్చిన సంపత్‌నందికి థ్యాంక్స్. సినిమాను మరింత పెద్ద హిట్ చేయాలి' అని అన్నారు. 'ఈ సినిమా విజయపథంలో దూసుకుపోతోంది. విడుదలైన 6 రోజుల్లోనే 22 కోట్ల 25లక్షల 47వేల 437రూపాయలను కలెక్ట్ చేసింది. సినిమాను కొన్న వాళ్లంతా హ్యాపీగా ఉండటం సంతోషంగా ఉంది' అని నిర్మాతలు భగవాన్, పుల్లారావు చెప్పారు.

ఎన్టీఆర్, ఎంజీఆర్ ఫిలాసఫీల నేపథ్యంలో..



సురేష్‌బాబు, పరుచూరి వెంకటేశ్వరరావు, అనూప్ రూబెన్స్, తేజ, కాజల్, రానా, కేథరిన్

రానా, కాజల్, కేథరిన్ త్రెస్సా హీరోహీరోయిన్లుగా తేజ దర్శకత్వంలో సురేష్ ప్రొడక్షన్స్, బ్లూ ప్లానెట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై డి.సురేష్‌బాబు, ఎం.వి.కిరణ్‌రెడ్డి, సి.భరత్ చౌదరి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఈ నెల 11న విడుదల కానున్న నేపథ్యంలో బుధవారం హైదరాబాద్‌లో 'జోగేంద్ర యువగర్జన' పేరుతో ప్రత్యేక కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా రానా మాట్లాడుతూ, 'సినిమాల పరంగా, వ్యక్తిగతంగా, జీవితం పరంగా నందమూరి తారకరామారావు అంటే నాకు దేవుడులాంటివారు. ఎన్టీఆర్, ఎంజీఆర్ ఫిలాసఫీలు జోగేంద్ర అనే పాత్రలో ఉంటాయి. అందుకే ఈ సినిమా చేశా. ఈ చిత్రం నాకు ఎమోషనల్‌గా బాగా కనెక్ట్ అయ్యింది. ఈ సినిమా చేసినందుకు చాలా గర్వంగా ఫీలవుతున్నా. ఈ చిత్రాన్ని మా తాతగారు రామానాయుడు చూడలేకపోయారనే లోటు ఉంటుంది. నేను ఈ రోజు ఈ వేదికపై నిలబడ్డానంటే దానికి కారణం ఆయనే. ఆయన వెళ్ళిపోయాక చాలా పాజిటివ్స్ జరుగుతున్నాయి. పై నుంచి అన్నీ ఆయనే సెట్ చేస్తున్నారనిపిస్తుంది. మా నాన్న(సురేష్‌బాబు)తో ఫస్ట్‌టైమ్ కలిసి పనిచేస్తున్నా. సినిమా మీద తేజకు ఉన్న అవగాహన చాలా ఎక్కువ. ఇది జోగేంద్ర జీవిత చరిత్ర. అది రాయాలంటే జీవితంపై అవగాహన ఉండాలి. వెంకటేష్ అభిమానులు నాకు తోడు ఉన్నారన్న ధైర్యంతోనే నేను ఇన్ని సినిమాలు చేస్తున్నా. ఇదే సపోర్ట్ ఇస్తే హాలీవుడ్ సినిమా కూడా చేస్తాను. ప్రతి సినిమా చేస్తున్నప్పుడు కొత్తగా చేయాలని ఉంటుంది. ప్రతి పాత్ర కొత్తగా ఉండాలని అనుకుంటా. ఈ సినిమాలో చాలా సన్నగా కనిపిస్తాను. లావుగా కనిపిస్తాను. త్వరలోనే యువత కోసం ఓ భారీ కార్యక్రమం చేయబోతున్నాం' అని అన్నారు. "బాహుబలి' తర్వాత ఈ కథని ఓకే చేశాం. కథలంటే నాకు మామూలుగా భయం, అదీ నా కొడుకుతో సినిమా అంటే చాలా భయం. రానా ఈ కథ విని సెట్ అవుతుందనుకున్నాడు. ఆ తర్వాత ఆ కథని చాలా బాగా తయారు చేశారు. రానాకి యాక్టింగ్ బాగా వస్తుందా? రాదా? అని కూడా ఆలోచించాను. రష్ చూసిన తర్వాత నిర్మాత కిరణ్ బావుందనడంతో ధైర్యం వచ్చింది. క్యారెక్టర్ ఓరియెంటెడ్ పొలిటికల్ డ్రామా ఇది. కాజల్, రానా, కేథరిల్ చాలా బాగా చేశారు. వాళ్ళందరితో తేజ బాగా చేయించాడు' అని నిర్మాత సురేష్‌బాబు తెలిపారు.

దర్శకుడు తేజ చెబుతూ, 'కథ చెప్పగానే రానాకి నచ్చింది. ఆయనంత పొడవైన అమ్మాయి కావాలని కాజల్‌ని ఎంపిక చేశాం. స్టయిలీష్ పాత్ర కోసం కేథరిన్‌ను తీసుకున్నాం. కొత్తవాళ్ళతో సినిమా చేసి బోర్ కొట్టిందని పాత వాళ్ళతో తీశాను. ఈ నెల 11న విడుదల కానున్న ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరుకుంటున్నా' అని చెప్పారు. 'ఈ చిత్రం నాకు చాలా స్పెషల్. రానాతో నాకు ఎంత పరిచయం ఉన్నా అతను మాత్రం నాకు జోగేంద్రగానే గుర్తుండిపోతాడు. సినిమాను ఎలా చూడాలో, ఎలా ప్రేమించాలో తేజ వద్ద నేర్చుకున్నా. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటా. నాకాయన గురువులాంటివారు' అని కాజల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేథరిన్, భరత్ చౌదరి, నవదీప్, పరుచూరి బ్రదర్స్, తనికెళ్లభరణి, జయప్రకాష్ రెడ్డి, శివాజీరాజా తదితరులు పాల్గొని చిత్రవిజయాన్ని ఆకాంక్షించారు.

అభిమాన్ రీమేక్‌లో..!



అభిషేక్ బచ్చన్, ఐశ్వర్యరాయ్

అమితాబ్ బచ్చన్, జయాబచ్చన్ జంటగా నటించిన చిత్రం 'అభిమాన్'. 1973లో విడుదలైన ఈ చిత్రం అప్పట్లో ఓ సంచలనం. తాజాగా ఈ చిత్రాన్ని అభిషేక్ బచ్చన్, ఐశ్వర్యరాయ్ జోడీగా రీమేక్ చేస్తున్నారనే టాక్ బాలీవుడ్‌లో బాగా వినిపిస్తోంది. ఈ విషయమై ఫేస్‌బుక్ చాట్ ద్వారా అభిమానులు అభిషేక్‌ను అడగ్గా దీనిపై ఆయన క్లారిటీ ఇచ్చారు. "అభిమాన్' అనేది ఒక గొప్ప సినిమా. అదొక మ్యాజిక్. ఈ చిత్ర రీమేక్‌లో నన్ను, ఐశ్వర్యను చూడలేరు. మా తల్లిదండ్రులు నటించిన ఫేవరేట్ చిత్రాల్లో అది ఒకటి. దాన్ని రీమేక్ చేయడం చాలా డిఫికల్ట్. అయితే ఐశ్వర్య మాత్రం రీమేక్ చేసేందుకు ఆసక్తిగా ఉంది. త్వరలోనే దీనిపై ఓ క్లారిటీ వస్తుంది' అని అభిషేక్ తెలిపారు. అభిషేక్ ప్రస్తుతం 'పల్టన్', ఐశ్వర్యరాయ్ 'ఫాన్నీ ఖాన్' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు.

ప్రేమ కంటే స్నేహం గొప్పది..



వై.విజయ, కోట శ్రీనివాసరావు

జి.ఎల్.బి.శ్రీనివాస్ దర్శకత్వంలో ముళ్ళగూరు లక్ష్మీదేవి సమర్పణలో అనంతలక్ష్మీ క్రియేషన్స్ పతాకంపై ముళ్ళగూరు అనంతరాముడు, ముళ్ళగూరు రమేష్‌నాయుడు నిర్మిస్తున్న చిత్రం '2 ఫ్రెండ్స్'. సూరజ్ హీరోగా శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ చిత్రం గురించి నిర్మాత మాట్లాడుతూ, 'మాసంస్థకిది తొలి చిత్రం. యూనిట్ అంతా బాగా సహకరిస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్‌లో పలు కీలక సన్నివేశాలను చిత్రీకరించాం. వరంగల్ సమీపంలోని లక్నవరం, కంఠాత్మకూర్ ప్రాంతాల్లో హీరో, స్నేహితులపై స్వర్ణ మాస్టర్ నేతృత్వంలో 'మచ్చ.. మచ్చ' పల్లవితో సాగే పాటను నాలుగు రోజులపాటు చిత్రీకరించాం. ఈ పాటకు చిర్రావూరి విజయ్ కుమార్ సాహిత్యం అందించారు. ప్రేమకంటే స్నేహం గొప్పదనే కాన్సెప్ట్‌తో రూపొందుతున్న చిత్రమిది. కేవలం వినోదమే కాకుండా అంతర్లీనంగా యువతకు మంచి సందేశం ఇచ్చే విధంగా ఉంటుంది' అని అన్నారు. 'అభిరుచి గల నిర్మాత లభించడంతో సినిమాను తెలుగు, కన్నడ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కిస్తున్నాం. ప్రస్తుతం హైదరాబాద్‌లో కోట శ్రీనివాసరావు, జయప్రకాష్‌రెడ్డి, వై.విజయ, శ్రీలక్ష్మీ పై కామెడీ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాం. ఇందులో కన్నడ సూపర్ కమెడీయన్ సాధుకోకిల కూడా పాల్గొంటున్నారు' అని దర్శకుడు తెలిపారు.

ప్రభాస్‌కి జోడీగా..!



ప్రభాస్, శ్రద్ధాకపూర్

'బాహుబలి 2' తర్వాత ప్రభాస్ 'సాహో' చిత్రంలో నటిస్తున్నారు. సుజీత్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో కథానాయిక విషయంలో ఇంకా క్లారిటీ రాలేదు. బాలీవుడ్ నాయికలు కత్రీనా కైఫ్, దిశా పటాని, అలాగే అనుష్క, శ్రద్ధా కపూర్ వంటి పేర్లు వినిపించాయి. ఇందులో ఎవరూ ఫైనల్ కాలేదు. తాజాగా మరోసారి శ్రద్ధా కపూర్ పేరు వినిపించడం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్‌టాపిక్‌గా మారింది. ఆప్షన్‌గా ఉన్న ముగ్గురు కథానాయికలు తమ తమ ప్రాజెక్టుల్లో బిజీగా ఉండటంతో.. రెమ్యూనరేషన్ విషయంలో తేడా వచ్చినా ఫైనల్‌గా శ్రద్ధా కపూర్‌నే హీరోయిన్‌గా ఫిక్స్ చేసే పనిలో చిత్ర బృందం ఉన్నట్టు సమాచారం.

ఈ చిత్రం గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ప్రభాస్ మాట్లాడుతూ, 'నేను ఇప్పటి వరకు నటించిన ఏ చిత్రంలోనూ లేని విధంగా ఈ సినిమాలోని యాక్షన్ సన్నివేశాలుంటాయి. అయితే అందరూ అనుకుంటున్నట్టు ఇది సైన్స్ ఫిక్షన్ కాదు. చాలా హైటెక్‌గా ఉంటుంది. తెలుగులో ఈ తరహాలో ఇంత వరకూ రాలేదు. హాలీవుడ్ యాక్షన్ డైరెక్టర్ కెన్నీ గేట్స్ ఈ పోరాట సన్నివేశాలను కంపోజ్ చేస్తున్నారు. ఈ యాక్షన్ సీన్స్ అభిమానులను కచ్చితంగా థ్రిల్ చేస్తాయి. ఈ సినిమా షూట్‌ను బాగా ఎంజాయ్ చేస్తున్నా' అని తెలిపారు.



తాప్సీ

సర్‌ప్రైజ్‌లతో సంతోషం అవార్డుల వేడుక



ఆది, హెబా పటేల్, రెజీనా, సురేష్ కొండేటి

'సంతోషం' వార పత్రిక అధినేత సురేష్ కొండేటి వెనుక ఇండస్ట్రీ అంతా ఉంటుంది. ఇదంతా ఆయన చిరునవ్వుతో సంపాదించుకున్నదే. ఇండస్ట్రీకి వచ్చిన రోజు ఆయన ఎలా ఉన్నారో ఇప్పుడూ అలానే ఉన్నారు. అంతేకాదు 'మా' అసోసియేషన్ తరపున పేద కళాకారులకు ఆర్థికసాయాన్ని చేస్తున్నారు. ఆయన నిర్వహిస్తున్న ఈ అవార్డుల వేడుక వందేండ్లపాటు కొనసాగించాలని కోరుకుంటున్నా' అని 'మా' అధ్యక్షుడు శివాజీ రాజా అన్నారు.

సంతోషం వార పత్రిక అధినేత సురేష్ కొండేటి తన పత్రిక పేరిట గత 15ఏండ్లుగా అవార్డులను అందిస్తున్న విషయం విదితమే. సంతోషం 16వ వార్షికోత్సవం సందర్భంగా ఈ ఏడాది కూడా సినీ అవార్డులను అందజేయ బోతున్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 12న జరుగనుంది.

ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో కర్టెన్‌రైజర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆది మాట్లాడుతూ, "ప్రేమ కావాలి' చిత్రానికిగానూ డెబ్యూ హీరోగా నాకు సంతోషం అవార్డు వచ్చింది. అదిప్పుడు 15ఏండ్లు పూర్తి చేసుకోవడం చిన్న విషయం కాదు. విజయవంతంగా నడిపిస్తున్న సురేష్ కొండేటికి ధన్యవాదాలు. ఇలాంటి అవార్డ్ ఫంక్షన్స్ ఎన్నో జరగాలని కోరుకుంటున్నా' అని అన్నారు. 'నేను ఇండస్ట్రీలోకి వచ్చిన తర్వాత విన్న ఫస్ట్ అవార్డ్స్ ఇది. ఒక వ్యక్తిగా సురేష్ ఈ అవార్డ్స్‌ను కంటిన్యూ చేయడం ఈజీ కాదు. ఇది ఇలాగే యాభై ఏండ్లు కొనసాగాలని కోరుకుంటున్నా' అని రెజీనా తెలిపారు. సంతోషం సురేష్ చెబుతూ, 'గత 15ఏండ్లుగా నన్ను, నా పత్రికను ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. చిరంజీవి, నాగార్జున, బాలకృష్ణ, వెంకటేష్ ఇలా అందరు హీరోలు నన్నెంతగానో ప్రోత్సహిస్తున్నారు. నేనున్నన్ని రోజులు ఈ అవార్డు ఫంక్షన్స్ నిర్వహిస్తూనే ఉంటాను. నాగార్జున కారణంగానే ఈ అవార్డ్స్‌ను కంటిన్యూ చేస్తున్నాను. మొదటి వారికోత్సవంలో నాగార్జున ఫిల్మ్‌ఫేర్‌లా మనకు కూడా సంతోషం అవార్డ్స్ ఉంటే బాగుంటుందన్నారు. ఆయన కోరికను నెరవేరుస్తూ దక్షిణాది భాషల్లో అవార్డ్స్‌ను నిర్వహిస్తున్నాను. ప్రతి ఏడాది ఏదో ఒక సర్‌ప్రైజ్‌తో సంతోషం అవార్డ్స్ జరుగుతున్నాయి. ఈ ఏడాది కూడా అలాంటి సర్‌ప్రైజ్ ఎలిమెంట్స్‌తో అవార్డ్స్ వేడుక జరుగనుంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెబా పటేల్, కె.ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణ, కె.ఎస్.రవికుమార్, సి.కళ్యాణ్ కాంబినేషన్‌లో

యాక్షన్‌తో 102 షురూ..



ఫైట్ చేస్తున్న బాలకృష్ణపై క్లాప్ ఇస్తున్న దర్శకుడు బోయపాటి శ్రీను

నందమూరి బాలకృష్ణ తన 102వ చిత్రాన్ని కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో నటించబోతున్న విషయం విదితమే. సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై.లి పతాకంపై సి.కళ్యాణ్ నిర్మిస్తున్న ఈ చిత్ర ప్రారంభోత్సవం గురువారం రామోజీ ఫిల్మ్ సిటీలో అత్యంత వైభవంగా జరిగింది. బాలకృష్ణ ఫైట్ చేస్తున్న ముహూర్తపు సన్నివేశానికి బోయపాటి శ్రీను క్లాప్‌నివ్వగా, బి.గోపాల్ కెమెరా స్విచాన్ చేశారు. క్రిష్ గౌరవ దర్శకత్వం వహించారు.

ఈ సందర్భంగా దర్శకుడు కె.ఎస్.రవికుమార్ మాట్లాడుతూ, '18ఏండ్ల తర్వాత తెలుగులో నేను డైరెక్ట్ చేస్తున్న సినిమా బాలకృష్ణతో కావడం ఆనందంగా ఉంది. ఆయనతో నాకిది తొలి చిత్రం. గతంలో రెండు, మూడుసార్లు ప్రయత్నించినప్పటికీ ఇప్పటికి కుదిరింది. నాతో ఉన్న టీమ్ బాగా కుదరడంతో పాజిటివ్‌గా కనిపిస్తుంది. ఎం.రత్నం కథ అందిస్తున్నారు. సినిమా కచ్చితంగా హిట్ అవుతుందని నమ్ముతున్నా' అని అన్నారు.

'బాలకృష్ణ 102వ చిత్రాన్ని మా బ్యానర్‌లో చేయడం ఆనందంగా ఉంది. ఈ చిత్రాన్ని 101గానే చేయాల్సింది కానీ కుదరలేదు. కె.ఎస్.రవికుమార్‌కి 95శాతం సక్సెస్ ఉంది. ఆయనకు సినిమా తప్ప వేరే ఆలోచన ఉండదు. గుర్తుండి పోయే సినిమా చేయాలని ఏవేవో కథలు అనుకున్నప్పటికీ రత్నం చెప్పిన ఈ స్టోరీ బాగా నచ్చింది. సాధారణంగా బాలకృష్ణ సినిమాలంటే మాస్‌తోపాటు గుండెను పిండేసే ప్రేమాభిమానాలు, సెంటిమెంట్ ఉండాలి. అలాంటి కోవకు చెందిన కథే ఈ సినిమా. చిరంతన్ భట్ ఈ చిత్రానికి మంచి సంగీతం అందించబోతున్నారు. గురువారం నుంచి ఈ నెలాఖరు వరకు రామోజీ ఫిల్మ్ సిటీలో షూటింగ్ జరుగుతుంది. వచ్చే నెల 6 నుంచి కుంభకోణంలో షూటింగ్ జరుపనున్నాం. ఆ తర్వాత వైజాగ్, హైదరాబాద్‌లో చిత్రీకరణ చేస్తాం. అనంతరం పాటల షూటింగ్ ఉంటుంది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి వచ్చే సంక్రాంతికి ఈ సినిమా రిలీజ్ చేస్తాం. అందుకే ఎక్కడా గ్యాప్‌లు లేకుండా షూటింగ్ ప్లాన్ చేశాం. అన్నింటినీ మించి బాలకృష్ణ 101 సినిమా పూర్తయ్యిందో లేదో 102వ సినిమాను యాక్షన్ సీన్‌తో ప్రారంభించారు. ఇందులో బాలయ్య సరసన నయనతార హీరోయిన్‌గా నటిస్తోంది. బాలకృష్ణ, నయనతార కాంబినేషన్‌లో వచ్చిన రెండు సినిమాలు హిట్ అయ్యాయి. ఈ చిత్రంతో హ్యాట్రిక్ హిట్ కొడతారు. అలాగే ఈ చిత్రంలో మరో ఇద్దరు కథానాయికలు ఉంటారు. వారి వివరాలు త్వరలో వెల్లడిస్తాం. ప్రకాష్‌రాజ్, అశుతోష్‌రానా, అథర్ చీమా శక్తివంతమైన పాత్రలుపోషిస్తుండగా, వినోదాన్ని పంచే పాత్రలో బ్రహ్మానందం కనిపించనున్నారు' అని నిర్మాత సి.కళ్యాణ్ తెలిపారు.

రైటర్ రత్నం మాట్లాడుతూ, 'నన్ను పిలిచి మంచి కథ కావాలన్నారు. ముందు ఎన్నో కథలు అనుకున్నాం. కానీ చివరకు నేను ఇరవై నిమిషాలు చెప్పిన ఈ కథ నచ్చింది. కచ్చితంగా ఇది బాలయ్యకు హిట్ అవుతుందని రవికుమార్‌గారు ఫీల్ అయ్యారంటే ఈ సినిమా రేంజ్ ఏంటో తెలుస్తుంది' అని చెప్పారు.

మురళీమోహన్, బ్రహ్మానందం, ప్రకాష్‌రాజ్, అశుతోష్ రానా, ప్రభాకర్, శివపార్వతి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రాంప్రసాద్, సంగీతం: చిరంతన్‌భట్, ఎడిటర్: ప్రవీణ్ అంథోని, ఆర్ట్: పి.నారాయణరెడ్డి.

యుద్ధానికి వెళ్తున్నా..

'పోరాడుతున్న నాలాంటి కథానాయికలకు ప్రేక్షకులే బలం. వారు పంచే ప్రేమతోనే యుద్ధానికి వెళ్తాను' అని అంటోంది తాప్సీ. 'పింక్' చిత్రంతో తాప్సీ బాలీవుడ్‌లో టాక్ ఆఫ్ టౌన్‌గా మారింది. ఆ తర్వాత మంచి అవకాశాలనూ దక్కించుకుంటోంది. ఇటీవల పుట్టిన రోజు జరుపుకున్న తాప్సీ తనకు విషెస్ తెలిపిన అభిమానులందరికీ ధన్యవాదాలు చెబుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెట్టింది.

'నాకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ ధన్యవాదాలు చెప్పడానికి మాటలు సరిపోవు. అభిమానులు పంచే ప్రేమను చూస్తుంటే 'తాప్సీ నువ్వు జీవితంలో మంచే చేసుంటావ్' అని అనుకుంటున్నాను. ఇలాంటి పుట్టిన రోజు ఏడాదిలో ఎన్నోసార్లు రావాలని ఆశిస్తున్నా. ఎందుకంటే ఇలాంటి అరుదైన రోజులు మళ్ళీరావు. పోరాడుతున్న నాలాంటి నటికి ప్రేక్షకులు, అభిమానులే బలం. వారు నాపై పంచే ప్రేమతో యుద్ధానికి(షూటింగ్)కి వెళ్తున్నా' అని పోస్ట్‌లో పేర్కొంది. తాప్సీ ప్రస్తుతం 'జుడ్వా 2', 'ఆనందో బ్రహ్మ' చిత్రాల్లో నటిస్తోంది.

రానున్న 50 ఏండ్లలో భారత్‌లో సగం భాషలు కనుమరుగు

● పీఎస్ఎల్ఐ సంస్థ నివేదిక



న్యూఢిల్లీ : రానున్న 50 ఏండ్లలో భారత్‌లో మాట్లాడుతున్న సగం భాషలు కనుమరుగయ్యే ప్రమాదముందని పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా (పీఎస్ఎల్ఐ) సంస్థ పేర్కొన్నది. ఈ మేరకు ఓ సర్వే నిర్వహించినట్టు ఆ సంస్థ చైర్మెన్ జీఎన్ దేవీ వెల్లడించారు. దానిలోని వివరాల ప్రకారం..భారత్‌లో 780 భాషల్లో సంభాషణలు, ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నాయి. దేశ జనాభాలో 1.3బిలియన్ల మంది 400 భాషల్లో సంభాషిస్తున్నారు. రానున్న 50 ఏండ్లలో ఈ భాషలన్నీ కనుమరుగయ్యే ప్రమాదముందని దేవీ తెలిపారు. గడిచిన 50ఏండ్లలో 250 భాషలు కనుమరుగైన విషయాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. తద్వారా, పలు ప్రాంతాల్లో సంస్కృతి-సంప్రదాయాలు దెబ్బతిన్నాయన్నారు. భారతీయ భాషలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఆమె ఉద్ఘాటించారు. గిరిజన ప్రాంతాల్లో నిరక్షరాస్యుల జనాభా పెరగడం పట్ల ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన చిన్నారులు ప్రాథమిక విద్యలో భాగంగా 22 అధికార భాషల్లో ఏదో ఒక భాషను మాత్రమే నేర్చుకుంటున్నారని అన్నారు. గిరిజనులు అనాదిగా మాట్లాడుతున్న భాషలను తమ పిల్లలకు నేర్పించినా పెద్దగా ప్రయోజనం ఉండటంలేదన్నారు. కాగా, బీహార్ తూర్పు రాష్ట్రాల్లో మైథిలీ భాషకు వెయ్యేండ్ల చరిత్ర ఉందని రాజకీయ విశ్లేషకులు ఆశిష్ నాందే తెలిపారు. అయితే, ఇలాంటి భాషలు కనుమరుగు కాకుండా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టడం హర్షణీయమన్నారు. మిగతా భాషలు కూడా కనుమరుగు కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. ప్రపంచ వ్యాప్తంగా 6వేల భాషలను గుర్తించినట్టు తెలిపారు. వాటన్నింటిని ఆధారంగా చేసుకుని ఓ డాక్యుమెంటరీ రూపొందిస్తామని అన్నారు.

రాజీవ్ స్వగృహ ప్లాట్ల వేలానికి సిద్ధం

● త్వరలో వెబ్‌సైట్ లాంచ్ : ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాజీవ్ స్వగృహ నిర్మించిన ప్లాంట్లను ప్రభుత్వం ఉద్యోగులకు అమ్మేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. త్వరలోనే వెబ్‌సైట్ లాంచ్ చేయనున్నట్టు చెప్పారు. ఆన్‌లైన్ ప్రక్రియ కోసం త్వరలోనే వెబ్ సైట్‌ను ప్రారంభించనున్నట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ అన్ని వసతులతో కూడిన ప్లాట్లను నిర్మించిందని, వీటిని కొనుగోలు చేయాలనుకునే ప్రభుత్వం ఉద్యోగులు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకో వాలన్నారు. గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉన్న ప్లాట్లతోపాటు చిన్న చిన్న పనులు మిగిలి ఉన్న ప్లాట్లను యాథాతథ స్థితిలో విక్రయించేందుకు అన్ని చర్యలు తీసుకు ంటున్నట్టు వెల్లడించారు. విక్రయ మార్గదర్శకాలను వెబ్‌సైట్‌లో ఉంచుతామన్నారు.

పోలీస్ హౌసింగ్ ఈ ఏడాది టర్నోవర్ లక్ష్యం రూ.300 కోట్లు

● పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ దామోదర్

నవ తెలంగాణ, ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో 2017-18 ఆర్థిక సంవత్సరంలో తమ సంస్థ రూ.300 కోట్ల టర్నోవర్‌ను లక్ష్యంగా నిర్దేశించుకున్నదని రాష్ట్రపోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కె.దామోదర్ తెలిపారు. గురువారం తమ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. తమ సంస్థ కార్యకలాపాలు, ప్రస్తుత నిర్మాణపు లక్ష్యాలను దామోదర్ వివరించారు. 1971లో ప్రారంభమైన తమ సంస్థ రాష్ట్ర విభజన అనంతరం బంగారు తెలంగాణ లక్ష్యసాధన దిశగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నడుచుకుంటున్నదని తెలిపారు. పోలీసు, జైళ్లు, ఫైర్ సర్వీసుల విభాగాల నిర్మాణపు పనులేగాక సాంకేతిక విద్య, వేర్ హౌసింగ్, విశ్వవిద్యాలయాల నూతన భవన నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసి తన ప్రత్యేకతను చాటుకున్నదని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సైతం కొత్తగా ఏర్పడ్డ పోలీసు జిల్లాలు, కమిషనరేట్లలో నూతన భవనాలు, పోలీసు స్టేషన్లు, పోలీసు క్వార్టర్స్‌ల నిర్మాణాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పనులు నాణ్యతతో సాగేలా చూస్తున్నామని దామోదర్ తెలిపారు. అలాగే 30వేల పోలీసు క్వార్టర్స్ బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

ఓట్ల వరకే పేదలు.. ఏలుతున్న పెద్దలు



న్యూఢిల్లీ : ప్రజాస్వామ్యం... అంటే ప్రజల వలన, ప్రజల చేత, ప్రజల కోసం... కానీ అనుభవంలో మాత్రం మరో కోణం కనిపిస్తోంది. అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) ప్రకారం.. మన దేశంలోని మొత్తం 4,852 మంది ప్రజా ప్రతినిధుల్లో 3,650 మంది కోటీశ్వరులే. అంటే 71 శాతం మంది కరోడ్‌పతీలన్నమాట. లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల వివరాలను చూస్తే.. మొత్తం 543 మంది లోక్‌సభ సభ్యుల్లో 445 మంది అంటే 82 శాతం మంది, రాజ్యసభలో 84 శాతం మంది కోటీశ్వరులున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటువేసిన 4078 మంది ఎమ్మెల్యేలు 2,821 మంది అంటే 69 శాతం మంది కరోడ్‌పతులు. ఎన్నికల్లో పోటీచేసిన సందర్భంగా అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగానే ఈ గణాంకాలను ఏడీఆర్ విశ్లేషించింది. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం... 2011-12లో 120 కోట్ల మంది దేశ జనాభాలో 27 కోట్ల మంది అంటే 21.9 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. అదేవిధంగా ఆక్స్‌ఫర్డ్ పావర్టీ అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనీటియేటివ్ (ఏపీహెచ్ఐ) అధ్యయనం ప్రకారం... మనదేశంలోని 18 ఏండ్లలోపు వారిలో సగం మంది కటిక దారిద్ర్యంలో కొట్టుమిట్టాడుతున్నారు. భారతదేశంలో పేదరికంపై ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ జరిపిన అధ్యయన నివేదిక ప్రకారం.. 21.9 శాతం మంది దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారు. దేశంలో జన్మించిన ప్రతి వెయ్యి మంది శిశువుల్లో 38 మంది మొదటి పుట్టినరోజుకు ముందే చనిపోతున్నారు. ఇటీవల జరిగిన దేశ ప్రథమ పౌరుడి ఎన్నిక సందర్భంగా విశ్లేషించిన పై గణంకాలనుబట్టి చూస్తే... పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలను ధనికులు ఆక్రమిస్తున్నారు. ప్రభుత్వ విధానాల దిశను నిర్ణయిస్తున్నారు. ఎన్నికల సందర్భంగా ఓట్ల కోసం వారు వేసిన 'ఎరల'కు పేదలు బలవుతున్నారు. పార్లమెంటు, శాసనసభలను ఆక్రమిస్తున్న ధనికులు వారికి అనుకూలమైన ఆర్థిక విధానాలను రూపొందించుకుంటున్నారు. రాజకీయ అధికారాన్ని ధనికులు తమ గుప్పెట్లో పెట్టుకుంటున్న ఫలితంగా ఆర్థిక అసమానతలు మరింత పెరుగుతున్నాయి. ఆర్థిక సరళీకరణ, ప్రపంచీకరణను విధానాలు ప్రారంభమైననాటి నుంచి పార్లమెంటు, శాసనసభల్లో ధనవంతుల వాటా పెరుగుతోందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

జీఎస్టీ దెబ్బకు సేవలరంగం 'ఢాం'

(మొదటిపేజీ తరువాయి)

సర్వీసుల రంగాలు నిక్కీ/ ఐహెచ్ఎస్ మార్కిట్ సంయుక్త (పీఎంఐ) సూచీలో 46 పాయింట్లకు పడిపోయి నట్టు ఇప్పటికే వెల్లడి కావడంతో జీఎస్టీపై అనుమానాలు ముసురుకున్నాయి. తయారీ రంగానికి సంబంధించి జూన్‌లో నమోదైన 52.7 పాయింట్లకన్నా చాలా తక్కువ. అంతేకాదు, 2009 తర్వాత తొమ్మిదేండ్ల కనిష్టస్థాయి. పెద్ద నోట్ల రద్దు తర్వాత ఇప్పుడిప్పుడే కోలుకుంటుందనుకున్న ఆర్థిక వ్యవస్థపై జీఎస్టీ వచ్చి మరో దెబ్బ కొట్టింది. జూన్‌లో కొంతమేర వృద్ధిలోకొచ్చిందనుకున్న భారత ఆర్థిక వ్యవస్థ జులైకి సంబంధించిన పీఎంఐ డేటాతో మరోసారి తిరోగమన బాట పట్టినట్టుగా భావిస్తున్నామని ఐహెచ్ఎస్ మార్కిట్ ముఖ్య ఆర్థికవేత్త పాలియన్నా డెలిమా అన్నారు. జీఎస్టీ పట్ల నెలకొన్న అనుమానాలే ఈ కుదింపునకు కారణమని ఆయన తెలిపారు. కొత్తగా అమలులోకి వచ్చిన పన్నుల వ్యవస్థ వల్ల సేవల రంగం డిమాండ్ పడిపోయిందని..దాంతో,జులై నెల అనుబంధ సూచీలో ఈ రంగం 45.2కు దిగజారిందని నిపుణులు చెబుతున్నారు. తయారీ రంగంలో ఉత్పత్తి పడిపోవడానికి కూడా నూతన పన్నుల విధానంలో నెలకొన్న సందిగ్ధతే కారణమని..దాంతో, ఈ రంగం తొమ్మిదేండ్ల కనిష్టానికి దిగజారిందని వారు విశ్లేషిస్తున్నారు. తయారీ రంగంపై పీఎంఐని మంగళవారం ప్రకటించిన విషయం తెలిసిందే. బహుళ పన్నుల వ్యవస్థ స్థానంలో తెచ్చిన ఏకరూప పన్నుల వ్యవస్థ జీఎస్టీ వల్ల ఎలాంటి ఫలితాలు ఉండనున్నాయన్న దానిపై అన్ని వర్గాల్లోనూ అనుమానాలు నెలకొన్నాయి.

ఎవరు భయపెట్టినా నిర్వాసితులు జంకొద్దు

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న టీఆర్ఎస్

● ఇదేనా బంగారు తెలంగాణ?

● కమ్యూనిస్టులను విమర్శించడం కేసీఆర్‌కు తగదు: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-దుబ్బాక

'తాతలు, తండ్రుల నాటి నుంచి వస్తున్న భూమి. ఇన్ని రోజులు అన్నంపెట్టి ఆదుకున్న భూమిని ప్రాజెక్టులు, కాల్వల పేరిట ప్రభుత్వం లాక్కుంటూ సరైన పరిహారం అందించకపోవడం సరికాదు. ఏదేమైనా 2013 భూ సేకరణ చట్టం ప్రకారమే పరిహారం చెల్లించాలి' అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఎవరు భయపెట్టినా నిర్వాసితులు భయపడొద్దన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక శ్రీసాయి బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గురువారం నిర్వాసితుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. ప్రాజెక్టులు, కాల్వలు, పరిశ్రమల నిర్మాణానికి ఎవరూ అడ్డుపడటం లేదన్నారు. రైతులు, ప్రజలతో చర్చలు జరిపి, బాధితులను ఒప్పించి, సరైన పరిహారమందించి ప్రాజెక్టులు నిర్మించాలన్నారు. ఎక్కువ భూములు ముంపునకు గురికాకుండా చిన్న ప్రాజెక్టులు నిర్మించాలని సూచించారు. లేకపోతే గోదావరి, కృష్ణా నదులపై భారీ ప్రాజెక్టులు నిర్మించాలన్నారు. ఈ మూడేండ్లలో 3 వేల మంది రైతులకు పైగా ఆత్మహత్యలు చేసుకున్నారని వాపోయారు. ఇదేనా బంగారు తెలంగాణ? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రాంతంలో భూమి కోసం ఎర్రజెండా ఆధ్వర్యంలో రైతు కూలీలతో కలిసి పోరాటాలు చేసినపుడు ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టలేదన్నారు. ఆయన కమ్యూనిస్టులను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విచ్చలవిడిగా ప్రజా ధనంతో సీఎం జల్సాలు చేయడం కాదు రైతుల సంక్షేమం కోసం ఆలోచించాలన్నారు. అనంతరం రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నక్కల యాదవరెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గోపాలస్వామి, రైతు సంఘం మండలాధ్యక్షులు రంగారెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకులు జి భాస్కర్ మాట్లాడుతూ మల్లన్న సాగర్ ప్రధాన కాల్వ నిర్మాణం కోసం మండలంలోని అప్పనపల్లి, హసన్‌మీరాపూర్, పెద్దగుండవెళ్ళి, బల్వంతపూర్, చెల్లాపూర్, రాజక్కపేట గ్రామాల్లో అధికారులు సర్వేలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇందులో 335 ఎకరాల భూములు రైతులు నష్టపోతున్నారని, వారికి ఎకరాకు ప్రభుత్వం రూ.25 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

డిగ్రీలో క్రెడిట్స్ అమలు కోసం కమిటీ

● ఉన్నత విద్యామండలి నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డిగ్రీ విద్యలో క్రెడిట్స్ విధానం అమలు కోసం కమిటీని నియమించాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్ఈ) నిర్ణయించింది. గురువారం హైదరాబాద్‌లో ఆరు సంప్రదాయ విశ్వవిద్యాలయాల వీసీలతో సమావేశం జరిగింది. అనంతరం టీఎస్‌సీహెచ్ఈ చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం (సీబీసీఎస్)లో భాగంగా అన్ని డిగ్రీ కాలేజీల్లోనూ క్రెడిట్స్ విధానం అమలు చేయాల్సి ఉందన్నారు. గత విద్యాసంవత్సరం నుంచి డిగ్రీలో సెమిస్టర్ విధానం అమలైందని అన్నారు. క్రెడిట్స్ ఎలా ఉండాలి, ఆప్షనల్ సబ్జెక్టులు, భాషా సబ్జెక్టులకు కేటాయించిన క్రెడిట్స్‌ను ఆ కమిటీ పరిశీలిస్తుందని చెప్పారు. భాషా సబ్జెక్టులకు తక్కువ క్రెడిట్స్ ఉండడం వల్ల పీజీలో చేరేటపుడు కొంత ఇబ్బంది వచ్చే అవకాశముందన్నారు. అటానమస్ కాలేజీల్లో ఇప్పటికే క్రెడిట్స్ విధానం అమల్లో ఉందని చెప్పారు. ఆయా కాలేజీల ప్రతినిధులతో చర్చించాలని నిర్ణయించామన్నారు. డిగ్రీ కాలేజీలు, విద్యార్థుల ప్రవేశాలు, పరీక్షల నిర్వహణ, ఉత్తీర్ణత వంటి వివరాలన్నీ ఒకే వెబ్‌సైట్‌లో ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందుకోసం సీజీజీతో ఒప్పందం కుదుర్చుకుంటామన్నారు. ఈ సమావేశంలో విద్యా శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) కన్వీనర్ కె వెంకటాచలం, ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్, ఓయూ వీసీ ఎస్ రామచంద్రం, కేయూ వీసీ సాయన్న, పీయూ వీసీ రాజారత్నం, టీయూ వీసీ సాంబయ్య తదితరులు హాజరయ్యారు.

హైటెన్షన్ విద్యుత్ లైన్ సిబ్బంది నిర్బంధం

● పరిహారం ఇవ్వాలని 765కేవీ లైన్ బాధితుల మొర

నవతెలంగాణ - సంగారెడ్డి టౌన్

తమ భూముల నుంచి వెళ్తున్న 765కేవీ విద్యుత్ హైటెన్షన్ లైన్‌కు పరిహారం చెల్లించే వరకు పనులు చేయనీయబోమని సంగారెడ్డి మండలం ఫసల్‌వాది రైతులు స్పష్టం చేశారు. గురువారం వారు విద్యుత్ లైన్ ఏర్పాటు పనులను అడ్డుకున్నారు. సిబ్బందిని పంచాయతీ కార్యాలయం వద్ద నిర్బంధించారు. పరిహారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోయారు. ఘటనపై సమాచారం అందుకున్న వీఆర్ఓను వెంటనే పోలీసుస్టేషన్ వెళ్లి సమస్యను వివరించారు. పోలీసు సిబ్బందితో పంచాయతీ వద్దకు చేరుకుని కాంట్రాక్టర్ నుంచి పరిహారం ఇచ్చేలా అధి కారులకు విన్నవిస్తామని హామీనిచ్చి సిబ్బందిని విడిపించారు.

కాల్పుల్లో ఆర్మీ మేజర్, జవాను మృతి

(మొదటిపేజీ తరువాయి)

షోపియాన్‌లోని జైపోరా ప్రాంతంలో ఉగ్రవాదులు తలదాచుకున్నారని భద్రతా బలగాలకు నిఘావర్గాల ద్వారా సమాచారం అందింది. దీంతో ఆ ప్రాంతంలో బుధవారం రాత్రి బలగాలు జవాన్లు సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో జవాన్లపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. బలగాలు అప్రమత్తమై ఎదురుకాల్పులు ప్రారంభించాయి. అయితే.. ఘటనలో తీవ్రంగా గాయపడిన మేజర్ కమలేశ్ పాండే, తంజిన్ ఛల్తిమ్‌లను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి వారిద్దరూ చనిపోయినట్టు సైనికాధికారి ఒకరు వెల్లడించారు. మరోవైపు ఘటనా స్థలం నుంచి తప్పించుకున్న ఉగ్రవాదుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. కుల్గామ్ జిల్లా గోపాల్‌పోరా ప్రాంతంలో గురువారం ఉదయం భద్రతాదళాలు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ నేపథ్యంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఘటనా స్థలి నుంచి రెండు తుపాకులను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసు అధికారి ఒకరు తెలిపారు. మృతి చెందిన వారిలో ఒక ఉగ్రవాదికి మే 1న బ్యాంకు వాహనంపై జరిగిన దాడిలో ప్రమేయమున్నదని ఆయన అన్నారు. ఆనాటి ఘటనలో ఐదుగురు పోలీసులు, ఇద్దరు బ్యాంకు గార్డులు ప్రాణాలు కోల్పోయారు.

నాటకాలు ఆపండి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఉద్యమ సమయంలోను, ఆ తర్వాత ఎన్నికలప్పుడు టీఆర్ఎస్ పేదలకిచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టీ మాస్ ఫోరం ఆధ్వర్యాన గురువారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పైగల అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. టీ మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు, టీ మాస్ ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ నాయకులు తమ్మినేని వీరభద్రం, విమలక్క, జెబి రాజు, చెరుపల్లి సీతారాములు, జాన్‌వెస్లీ, పైళ్ల ఆశయ్య, రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, బైరాగి మోహన్, శ్రీరాం నాయక్, కూరపాటి రమేశ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ... గత మూడేండ్లుగా రాష్ట్ర ప్రజలకు ఎన్నో మాటలు, మరెన్నో వాగ్దానాలు చేసిన సీఎం కేసీఆర్.. వాటి అమల్లో మాత్రం పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఆయన ఇచ్చిన హామీలన్నీ ఆచరణలో శూన్యంగా మారాయని తెలిపారు. ఆంధ్రావాళ్లు వెళ్లిపోతే ఇంటికో ఉద్యోగం ఇస్తామంటూ ప్రజలను నమ్మించిన కేసీఆర్.. ఇప్పటి వరకూ ఎన్ని ఉద్యోగాలిచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ.. సిరిసిల్ల జిల్లా జిల్లెళ్ళ, నేరెళ్ల ఘటనపై ప్రభుత్వం న్యాయ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. అక్కడి దళితులు, ఇతర పేదల్ని పట్టుకుని పోలీసులు తీవ్రంగా హింసించారని చెప్పారు. ఇలాంటి అంశాలపై ప్రశ్నిస్తారనే భయంతోనే ఇందిరాపార్కు దగ్గరున్న ధర్నాచౌక్‌ను కేసీఆర్ ఎత్తేశారని తెలిపారు.

విమలక్క మాట్లాడుతూ.. పోలీసులు ఇచ్చిన రిపోర్టు ప్రకారం ఐదు లారీలు తగలబడితే, ముఖ్యమంత్రి ఆ సంఖ్యను పెంచి పది లారీలు తగలబడ్డాయంటూ చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. 'లారీల్ని తగలబెడితే ఊరుకుం టమా...? అని ముఖ్యమంత్రి ప్రశ్నిస్తున్నారు... మరి పదుల సంఖ్యలో జనాలు మరణిస్తే దాని గురించి సీఎం ఎందుకు మాట్లాడటం లేదు...?' అని ప్రశ్నించారు. ఇలాంటి చర్యలు మానుకోకపోతే ప్రజాగ్రహాన్ని చవి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

నిరాశ.. నిస్పృహలతో బురదజల్లే ప్రయత్నం

(మొదటిపేజీ తరువాయి)

పాతూరి సుధాకర్‌రెడ్డి, విప్ రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ భానుప్రసాద్‌లతో మీడియాతో మాట్లాడారు. తెలంగాణను ముందుకు తీసుకుపోదామని తాము ప్రయత్నం చేస్తుంటే, అనేక రకాల కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని మంత్రి ఈటల కాంగ్రెస్‌నేతలపై మండిపడ్డారు. నిరాశ నిస్పృహలతో ప్రతి చిన్న విషయానికి బురదజల్లే ప్రయత్నం చేసి, అభాసుపాలవుతున్నారు అన్నది మర్చిపోవద్దన్నారు. 2004లో జలయజ్ఞం చేపట్టి ఎన్ని ప్రాజెక్టులు పూర్తి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. నాలుగు వందల కోట్ల అంచనాలతో రెండేండ్లలో పూర్తి చేస్తామని మొదలు పెట్టిన మిడ్ మానేరును పది సంవత్సరాల్లో కూడా పూర్తి చేయకుండా రైతుల కళ్ళలో మట్టికొట్టారని ఎద్దేవా చేశారు. 16 వేల కోట్లతో ప్రారంభించిన ప్రాణహిత చేవెళ్ల అంచనాలు 35వేల కోట్లకు చేరుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. దేశాన్ని ఏలిన 45 ఏండ్లలో ప్రజల కనీస అవసరాలను తీర్చలేదన్నారు. మాకు అనుభవం లేకున్నా శభాష్ అనిపించుకుంటున్నామని, మూడేండ్లలో రెండువందల సమస్యలు పరిష్కరించామన్నారు. మాకు ఉద్యమం, పరిపాలన తెలుసునని నిరూపించామన్నారు. కాంగ్రెస్ మాదిరి భూఅక్రమణలు, కుర్చీలు కూలగొట్టే నైపుణ్యం లేదన్నారు. తెలంగాణలో ఇప్పటికే ఒక పార్టీ గల్లంతు అయ్యిందని, మిగిలిన వారికి కూడా అదే పరిస్థితి వస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వపనితీరుపై అనుభవం ఉన్న బడా నాయకులు కూడా విమర్శిస్తే ఎలా అని, ఇది మీ వయసుకు, అనుభావానికి తగదు అని ఆయన జానారెడ్డి, షబ్బీర్‌అలీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

అవును కాంగ్రెస్ విలనే; సుమన్

ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పినట్టు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అభివృద్ధికి విలన్‌గా మారిందని ఎంపీ బాల్క సుమన్ అన్నారు. అభివృద్ధి పనులు జరగకుండా న్యాయస్థానాల్లో కేసులు వేసింది నిజం కాదా.? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి రాజకీయ ఉన్మాదిగా మారారని వ్యాఖ్యానించారు. దళితుల గురించి మాట్లాడే నైతిక హక్కు టీడీపీ, కాంగ్రెస్‌కు లేదని ఆయన అన్నారు. ఇదే అంశంపై టీఎస్ ఆగ్రో చైర్మెన్ లింగంపల్లి కిషన్‌రావు, డైరీ డెవలప్‌మెంట్ చైర్మెన్ లోక్‌భూమారెడ్డి, గిరిజన కార్పొరేషన్ చైర్మెన్ గాంధీనాయక్ మాట్లాడారు.

29,30 తేదీల్లో మున్సిపల్ కార్మికుల సమ్మె

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల మాదిరిగానే అన్ని జిల్లాల్లో పనిచేస్తున్న మున్సిపల్, కార్పొరేషన్, నగర పంచాయితీ కార్మికులకూ వేతనాలు పెంచాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది. జేఏసీ నిర్ణయం మేరకు ఈనెల 29,30తేదీల్లో సమ్మె చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు గురువారం సమ్మె నోటీసులను కార్మిక శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, డీఎంఏ టీకే శ్రీదేవి, ఇన్‌చార్జ్ చీఫ్ సెక్రటరీ సునీల్‌శర్మలకు జేఏసీ ప్రతినిధులు అందించారు. ఈ కార్యక్రమంలో పాలడుగు భాస్కర్ (సీఐటీయూ), ఏసురత్నం, పి శ్రీనివాస్‌రావు(ఏఐటీయూసీ), వనమాల కృష్ణ(ఐఎఫ్‌టీయూ), ఎంకేబోస్, అల్వాల్ శివకుమార్ (టీఎన్‌టీయూసీ) తదితరులున్నారు.


కేంద్ర బీసీ బిల్లుకు రాష్ట్రం మద్దతు: జోగు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


కేంద్ర ప్రభుత్వ బీసీ బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణంగా మద్దతునిస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న అన్నారు. గురువారం హైదరాబాద్ మంత్రి నివాసంలో తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమ వాల్ పోస్టర్‌ను మంత్రి జోగు రామన్న ఆవిష్కరించారు. కేంద్ర బీసీ కమిషన్ బిల్లుకు రాజ్యాంగ హక్కును కల్పించాలని ఆయన ప్రధానిని కోరారు. కేంద్ర బీసీ బిల్లుకు సీఎం పూర్తి మద్దతును ప్రకటించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోడిని ప్రత్యక్షంగా కలిసి ఈ మద్దతు విషయాన్ని తెలిపారని చెప్పారు. కేంద్ర బీసీ కమిషన్ బిల్లుకు రాజ్యాంగ హక్కులు కల్పించడం వల్ల బీసీలకు రావాల్సిన ప్రయోజనాలు, రిజర్వేషన్లు, బీసీ ఉద్యోగులకు పోస్టింగ్స్‌లో ఒక హక్కుగా సంపూర్ణంగా అమలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో మాదిరిగా కేంద్రంలోనూ బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఉండాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న 119 పూలే బీసీ గురుకుల పాఠశాలలకు, సన్న బియ్యం, విదేశీ విద్య నిధి, సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల పాఠశాలల భవనాల నిర్మాణాలకు కేంద్రం గ్రాంటు మంజూరు చేయాలని కోరారు. చట్ట సభల్లో బీసీలకు 33 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు భిక్షపతి, దుర్గయ్య గౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్, విక్రంగౌడ్, కాలేరు నవీన్, జాజుల లింగం, ఈడిగ శ్రీనివాస్, సతీష్, సంజయ్, పాండుగౌడ్, ఓరుగంటి వెంకటేష్, శ్యాం, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

మూడు రెట్లు కానున్న అంధత్వం

● 2050 నాటికి ప్రపంచంలో 11.5 కోట్లమంది అంధులు : ఇంగ్లండ్ వర్సిటీ పరిశోధనలో వెల్లడి



న్యూఢిల్లీ: ప్రపంచంలో అంధుల సంఖ్య 2050 నాటికి మూడు రెట్లు పెరగనున్నదని పరిశో ధకులు హెచ్చరించారు. ప్రస్తుతం ప్రపంచంలో 3.6 కోట్ల మంది కంటి చూపును కోల్పోయి ఉన్నా రని, 2015 నాటికి ఈ సంఖ్య 11.5 కోట్లకు చేరే అవకాశమున్నదని వెల్లడించారు. అయితే.. వృద్ధుల జనాభా పెరగడం కూడా ఈ పరిస్థితికి ఓ కారణ మని తెలిపారు. అంధత్వం, దృష్టిలోపంపై ఇంగ్లం డ్‌లోని యాంగ్లియా రస్కిన్ యూనివర్సిటీ పరిశోధ కులు అధ్యయనం చేశారు. 188 దేశాల్లో 1990 నుంచి 2015 వరకు ఉన్న పరిస్థితిపై సర్వే నిర్వ హించారు. దీని ఆధారంగా 2050 నాటికి పరిస్థితి ఎలా ఉంటుందో అంచనా వేసినట్టు పరిశో ధకులు తెలిపారు. అయితే, ఇప్పటి నుంచే ఆయా దేశాలు తగు చర్యలు చేపట్టాలనీ, కంటి శస్త్ర చికిత్స లకు సంబంధించి ఎక్కువ నిధులను కేటాయిం చాలనీ కోరారు. ప్రస్తుతం దాదాపు 27 కోట్ల మంది దృష్టిలో పంతో బాధపడుతున్నారని, ఈ సంఖ్య 2050 నాటికి 58.8 కోట్లకు చేరవచ్చుని పేర్కొన్నారు. మరోవైపు.. ఆసియా దేశాల్లోనే ఎక్కువ మంది దృష్టిలోపంతో బాధపడుతున్నట్టు సర్వేలో వెల్లడైంది.



ఖాకీ దాడి

(మొదటిపేజీ తరువాయి)

దృశ్యాలను 10టీవీ చిత్రీకరించే ప్రయత్నం చేసింది. దీనిపై ఏసీపీ నుంచి వివరణ తీసుకునేందుకు ప్రయత్నం చేయగా సంబంధింత మహిళా రిపోర్టర్‌ను నోటికొచ్చినట్టు తిట్టారు. చేయి చేసుకున్నారు. మిగతా మీడియా ప్రతినిధులపైనా భౌతికంగా దాడి చేశారు. పోలీసుల దమనకాండను నిరసిస్తూ రంగారెడ్డి జిల్లాలోని దుబ్బచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన శోభ అనే మహిళా ఏఎన్ఎం పురుగులు మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా ఐసీయూలో కోలుకుంటున్నది.

ప్రభుత్వంపై ఏఎన్ఎంల ఆగ్రహం

ఈ సందర్భంగా రాజమణి (మెదక్), ఎం.దుర్గా (సంగారెడ్డి), ఏడీ సరిత (ఆర్‌సీ పురం), సీతా (నల్లగొండ), మంజుల (మెదక్), మీనా, విజయలక్ష్మీ (యాదాద్రి), జయ (వికారాబాద్), టీ.అమృత (నార్సింగ్), శశికళ (రంగారెడ్డి) 'నవతెలంగాణ'తో మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. సమస్యలు చెప్పుకుందామని వస్తే స్వయంగా ముఖ్యమంత్రే మగ పోలీసులతో దాడి చేయించారని విమర్శించారు. మహిళలను కన్నీరు పెట్టిస్తే వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వ పతనం తప్పదని హెచ్చరించారు. దౌర్జనం చేస్తే రాష్ట్రం బంగారు తెలంగాణ అవుతుందా అంటూ ప్రశ్నించారు. తమ సమస్యను ఇలా చెప్పుకొచ్చారు. '2002లో 1962 మంది మహిళలను మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్ఏ)లను ప్రభుత్వం కాంట్రాక్టు ఏఎన్ఎం లుగా నియమించింది. డీఎస్‌సీ, రోస్టర్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన నియామకాలు చేపట్టింది. వంద శాతం స్థూల వేతనం (గ్రాస్ సాలరీ) నెలకు రూ.7,150 చెల్లిస్తామని 2001 ఫిబ్రవరి 26న జీఓ నెం.217, 2002 మే 22న విడుదల చేసిన జీఓ నెం.459 ఉత్తర్వుల్లో పేర్కొంది. 2008 వరకు రాష్ట్ర ప్రభుత్వమే ఈ మొత్తం చెల్లిస్తూ వచ్చిందని తెలిపారు. అయితే, '2009లో కేంద్ర ప్రభుత్వం 'యూరోపియన్ కమిషన్' పేరుతో కొత్త పథకాన్ని ప్రవేశ పెట్టింది. రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేస్తున్న 1,193 మంది (తెలంగాణ 482, ఏపీ 711) ఏఎన్ఎంలను ఈ పథకంలో చేర్చుకుంది. ఇదే వేతనం చెల్లిస్తూ వచ్చిన కేంద్రం ఏడాది తరువాత ఆ పథకాన్ని ఎత్తివేసింది. నాటి నుండి తమకు కష్టాలు మొదలయ్యాయని కన్నీటి పర్యంతమయ్యారు. పథకం నుండి కేంద్రం తప్పుకున్న తరువాత కూడా తమను రాష్ట్ర ప్రభుత్వం స్కీం వర్కర్లుగానే గుర్తిస్తున్నదని వాపోయారు.

నాటి నుండి నేటి వరకు రాష్ట్ర ప్రభుత్వమే వేతనాలు చెల్లిస్తున్నా తమ పరిధిలో లేరని బుకాయిస్తున్నదని విమర్శించారు. ఏపీలో స్థూల వేతనం చెల్లించేం దుకు అక్కడి ప్రభుత్వం అంగీకరిస్తే, తెలంగాణ ప్రభుత్వం స్పందించడం లేదు. స్థూల వేతనం ప్రకారం ఒక్కో ఏఎన్ఎంకు నెలకు రూ.29,350 ఇవ్వాల్సి ఉండగా, రూ.10,020 మాత్రమే చెల్లిస్తున్న దని ఆవేదన వ్యక్తం చేశారు. యూరోపియన్ పథకానికి ముందు మిగిలిన 769 మందిని రాష్ట్ర ప్రభుత్వ పథకంలోనే కొనసాగడంతో వారందరూ పర్మినెంట్ అయ్యారని, యూరోపియన్ పథకంలో పనిచేసిన తమను పక్కనబెట్టడం న్యాయమా అంటూ ప్రశ్నించారు. ఇదే విషయమై అధికారులను సంప్రదిస్తే 'మీరు కేంద్ర ప్రభుత్వ పథకం స్కీంలో ఉన్నారు కాబట్టి పర్మినెంట్‌కు అనర్హులు అంటున్నారని తమ గోడును వెళ్లబోసుకున్నారు. ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ లలితకుమారి సైతం తాము క్రమబద్ధీకరణకు అర్హులమేనని, అలా చేయకపోతే 2015 పీఆర్‌సీ ప్రకారం వేతనాన్ని నెలకు రూ.10,020 నుంచి రూ. 21,230 పెంచాలని ప్రభుత్వానికి లేఖ రాసిందని గుర్తుచేశారు. అయినా, అమలు కాలేదని, న్యాయం చేయాల్సిందిగా ఏండ్ల తరబడి మంత్రులు, అధికారుల చుట్టూ వినతిపత్రాలు సమర్పిస్తున్నా కనికరం చూపడంలేదని వాపోయారు. ఓపిక నశించి నేరుగా ముఖ్యమంత్రినే కలుద్దామని ప్రగతిభవన్‌కు వస్తే పోలీసులు తమను మహిళలు అని కూడా చూడకుండా కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

దాడిని ఖండిస్తున్నాం : యాదానాయక్, బలరాం

యూరోపియన్ ఏఎన్ఎంలు, మీడియాపై పోలీసుల దాడిని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఖండించింది.

ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాదానాయక్, బలరాం ఒక ప్రకటన విడుదల చేశారు. న్యాయమైన డిమాండ్ కోసం గత కొంతకాలంగా ఏఎన్ఎంలు ఆందోళన, పోరాటాలు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం నుండి స్పందన రాకపోవడంతో ప్రగతిభవన్‌కు వస్తే పోలీసులతో దాడి చేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో మహిళలపై మగ పోలీసులు లాఠీచార్జి చేయడం సిగ్గుచేటన్నారు. ఘటనను కవర్ చేసేందుకు వచ్చిన మీడియాపై కూడా పోలీసులు దాడి చేయడం ప్రజాస్వామ్యానికే మాయని మచ్చఅని వాపోయారు. ఈ దాడులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఈసీ కాంట్రాక్టు ఏఎన్ఎంలకు పదో పీఆర్‌సీ ప్రకారం వేతనాలు పెంచి, వంద శాతం గ్రాస్ సాలరీ చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పోరాటాలు, ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

'హిమాన్షు' యాక్టివిటీలో లేదు

(మొదటిపేజీ తరువాయి)

అధికారి భన్వర్‌లాల్‌ను కలిసి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. హిమాన్షు మోటర్స్‌లో 2007 నుండి ఎలాంటి లావాదేవీలు జరగడం లేదన్నారు. ప్రతీ చిన్న విషయానికి ప్రతిపక్షాలకు రాజకీయరంగు పులుమడం అలవాటైందన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్ వివరణ కోరితే సమాధానం చెప్తామని చెప్పారు. కోర్టు కేసులతో కాంగ్రెస్ కార్యకర్తలకు సంబంధం లేని చెబుతున్న జానారెడ్డి, షబ్బీర్‌అలీ..164 కేసులు ఎక్కడ నుంచి వచ్చాయన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణతో పాటు ప్రాజెక్టుల నిర్మాణం గాకుండా కేసులు వేసినవారంతా కాంగ్రెస్‌పార్టీ నేతలేనని, ఆధారాలతో సహా తమ వద్ద ఉన్నాయని చెప్పారు. తాజాగా బుధవారం నాడు నేరెళ్లలో లారీ ప్రమాదం జరిగితే, దానిపైనా రాద్ధాంతం చేయడానికి కాంగ్రెస్‌పార్టీ నేతలు నానాయాగీ చేశారని, చివరికి ఆ లారీ తమ పార్టీ నేతది అని తేలడంతో నోరెళ్లబెట్టారని అన్నారు.

కేసీఆరే పెద్ద అసమర్థుడు

(మొదటిపేజీ తరువాయి)


ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా నిరుద్యోగులను సీఎం మోసం చేస్తున్నారని విమర్శించారు. అందుకే పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారని చెప్పారు. మొన్న మీడియా సమావేశంలో దుర్యోధనునిలా సీఎం ఏకాపాత్రాభినయం చేశారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతరం చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇటువంటి బెదిరింపులకు కాంగ్రెస్ భయపడబోదని హెచ్చరించారు.త విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల విషయంలో కోర్టుల్లో కేసులు వేయడం తమకు సంబంధం లేదన్నారు. నిరుద్యోగి శ్రవన్ కేసు వేస్తే, టీఆర్ఎస్‌కి సంబంధం ఉన్న న్యాయవాది సత్యారెడ్డి వాదించారన్నారు. సింగరేణి వారసత్వ ఉద్యోగాల విషయంలో జాగృతి సంస్థకు సంబంధం ఉన్న వ్యక్తులు కేసు వేశారన్నారు. మహిళను అవమానించినందుకు దేశ దళిత జాతికి సీఎం క్షమాపణ చెప్పాలన్నారు. "పొగరుబోతు, కండ్లు నెత్తికెక్కి మాట్లాడుతున్నారు. తెలంగాణ ఏర్పాటు విషయంలో స్పీకర్ స్థానంలో ఉండి ఎన్నో అంతరాలను, అనేక అభ్యంతరాలను ఎదుర్కొని తెలంగాణ బిల్లు పాస్ చేయించిన నాయకురాలునుద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేస్తావా? అ అర్హత నీకు ఉందా?" అని ప్రశ్నించారు. తెలంగాణ ఏమైనా నీ జాగీరా, పోలీసులు ప్రయివేట్ సైన్యమా అని ప్రశ్నించారు. వెంకయ్యానాయుడు కొడుకు కంపెనీ హర్ష నుంచి ఏ ప్రాతిపదికన 300 ఇన్నోవా కార్లు కొనుగోలు చేశారో, ఎన్ని సూటి కేసులు మారాయో చెప్పాలన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఆంధ్రా కాంట్రాక్టర్లకు కట్టబెట్టిన సీఎం... తెలంగాణ కాంట్రాక్టులను ఆంధ్రా కాంట్రాక్టర్లకు అమ్ముకున్నారని చెప్పారు. మిషన్ భగీరథ పథకం టెండర్లు లేకుండా కమీషన్లకు కక్కుర్తి పడి నామినేషన్ పద్ధతి వేల కోట్ల పనులు ఆంధ్రా కాంట్రాక్టర్లకు కట్టబెట్టింది మీరు కాదా అని ప్రశ్నించారు. విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులు, సింగరేణి వారసత్వ ఉద్యోగాల విషయంలో న్యాయపరంగా కొట్లాడకుండా కోర్టుకుత విజ్ఞప్తులు, అభినందలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు.అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన అంశం చట్టంలో ఉన్నా దాన్ని ముఖ్యమంత్రి సాధించలేకపోయారని విమర్శించారు. ఈ అంశంపై ప్రధాన మంత్రి నరేంద్రమోడీతో మాట్లాడాలంటేనే కేసీఆర్ గజగజ వణుకుతున్నారని చెప్పారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్యంగా ఉన్న సీఎం ఆ నెపాన్ని కాంగ్రెస్ పార్టీపై నెట్టివేస్తున్నారని చెప్పారు. టీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా ఏమైన కాంగ్రెస్ అడ్డుకుంటుందా అని ప్రశ్నించారు. కేటీఆర్ రాజీనామా చేయాలని, ఉప ఎన్నికలకు సిద్ధమని కొంత మంది కాంగ్రెస్ చేస్తున్న డిమాండ్‌కు పార్టీ కట్టుబడి ఉందా అన్న ప్రశ్నకు ఉత్తమ్ సమాధానం దాటవేశారు.

సెన్సెక్స్ ▼ 239	నిఫ్టీ ▼ 68	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10.గ్రా)	వెండి (కేజీ)	కోడిగుడ్లు	
32,237	10,013	63.69	రూ. 29,016	రూ. 40,600	హైదరాబాద్ 320	విజయవాడ 320
					ఒక్కగుడ్డుకు 3.80	చెన్నై 355
					వరంగల్ 322	ముంబయి 365






వస్త్ర వ్యాపారంలోకి పతంజలి



న్యూఢిల్లీ: యోగా గురువు వ్యాపారవేత్త రాందేవ్ బాబా త్వరలోనే వస్త్ర వ్యాపారంలోకి అడుగు పెట్టనున్నారు. సాంప్రదాయాల గురించి గొప్పగా చెప్పుకునే రాందేవ్ పాశ్చత్య బట్టలు జీన్స్ విభాగంలోనూ రాణించాలని లక్ష్యంగా పెట్టుకోవడం విశేషం. రాందేవ్ పతంజలి ఆయుర్వేద లిమిటెడ్ వచ్చే ఏప్రిల్ నుంచి పురుషులు, మహిళలు, పిల్లల కోసం బట్టల వ్యాపారాన్ని ప్రారంభించనుందని ఆ కంపెనీ అధికారిక ప్రతినిధి తెలిపారు. తొలి ఏడాదిరూ.5000 కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఊలు, కాటన్, నైట్ వేర్, మెషీన్ మేడ్, డెనిమ్ వంటి బట్టలను మార్కెట్‌లోకి తీసుకువచ్చే కసరత్తులో ఉన్నామన్నారు. ఈ వ్యాపారానికి 'పరిదాన్' అనే పేరును పెట్టాలని భావిస్తున్నామన్నారు.

నిరాశపర్చిన ఐఓసీ ఫలితాలు

న్యూఢిల్లీ : చమురు రంగ సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి నిరాశజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో సంస్థ నికర లాభం 45శాతం క్షీణించి రూ.8,268.98 కోట్ల నుంచి రూ.4,548.51 కోట్లకు పడిపోయింది. ఇదే సమయంలో కంపెనీ మొత్తం ఆదాయం ఏప్రిల్-జూన్ మాసంలో 20శాతం వృద్ధితో రూ.1,07,670.95 కోట్ల నుంచి రూ.1,29,418.11 కోట్లకు పెరిగింది. ఇక సమీక్ష త్రైమాసికంలో సగటు స్థూల శుద్ధి మార్జిన్ (జీఆర్ఎం) బ్యారెల్‌కి 4.32 డాలర్లుగా ఉండగా. అంతకు క్రితం ఏడాది ఒక బ్యారెల్ 9.98డాలర్లుగా నమోదైంది.

బ్యాంకింగ్ రంగ షేర్ల విలవిల



ముంబయి: గత రెండేండ్లుగా దేశ వృద్ధి రేటు అంతంత మాత్రంగానే ఉందంటూ ఆర్‌బీఐ తనసమీక్షలో పెదవి విరవడంతో మదుపర్లలో విశ్వాసాన్ని దెబ్బతీసింది. దీంతో బుధవారం జరిగిన ఆర్‌బీఐ ద్రవ్య పరపతి సమీక్షలో కీలక వడ్డీ రేట్లను పావు శాతం తగ్గించడంతో బ్యాంకుల లాభాలపై ప్రతికూల ప్రభావం చూపనుందన్న అంచనాలు బ్యాంకింగ్ రంగ స్టాక్స్ నష్టాలకు కారణమయ్యింది. దీంతో గురువారం బీఎస్ఈ సెన్సెక్స్ 238.86 పాయింట్లు క్షీణించి 32,237.88కి పడిపోయింది. ఎన్ఎస్ఇ సూచీ నిఫ్టీ కూడా 67.85 పాయింట్లు పతనమై 10,013.65 వద్ద ముగిసింది. నిఫ్టీలో ప్రభుత్వ బ్యాంకింగ్ సూచీ 2.89 శాతం నష్టపోయింది. వడ్డీ రేట్లపై సాగిన విశ్లేషణలతో నిఫ్టీలో బ్యాంకింగ్ సూచీ 2.2 శాతం విలువ కోల్పోయింది. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా 2 శాతం, కెనరా బ్యాంకు 2.8 శాతం, పంజాబ్ నేషనల్ బ్యాంకు 4 శాతం చొప్పున నష్టపోయాయి. యాక్సిస్ బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు, ఎస్‌బ్యాంకు సూచీలు 2 శాతం పైగా నష్టపోయాయి. మార్చితో ముగిసిన త్రైమాసికంలో ద్రవ్యోల్బణం సూచీ 4 శాతానికి చేరడంపై ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఆందోళన వ్యక్తం చేయడం మార్కెట్లను ఒత్తిడికి గురి చేసింది.

హైదరాబాద్‌లో 'మిస్సైల్ హౌజ్'

కేఆర్ఏఎస్ తయారీ యూనిట్ ప్రారంభం

- ఇక నగరం నుంచే భారీగా ప్రయివేటు మిస్సైల్స్ తయారీ
- ఆగ్నేయాసియా దేశాలకు ఎగుమతులు



నవతెలంగాణ, వాణిజ్య విభాగం: హైదరాబాద్‌లో మరో ప్రపంచ శ్రేణి సంస్థ తన కార్యకలాపాలను ప్రారంభించింది. 'కల్యాణి రఫేల్ అడ్వాన్స్ సిస్టమ్స్' (కేఆర్ఏఎస్) హైదరాబాద్‌లో తన ఫ్యాకర్టీని ప్రారంభించింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె. తారక రామారావు ఈ ఫెసిలిటీని ప్రారంభించారు. 49%-51% వాటాతో ఇజ్రాయిల్‌కు చెందిన రఫెల్ డిఫెన్స్ సిస్టమ్స్, కల్యాణి గ్రూపు ఈ సంస్థను ఏర్పాటు చేశాయి. భారత సాయుధ బలగాలకు అవసరమైన 'యాంటి-ట్యాంక్ గైడెడ్ మిస్సైల్స్' తయారీ నిమిత్తం 'కల్యాణి రఫెల్ అడ్వాన్స్ సిస్టమ్స్' ఈ ఫెసిలిటీని ప్రారంభించినట్టు కంపెనీ వర్గాలు తెలిపాయి. భారత్‌తో పాటు ఆగ్నేయాసియా దేశాలకు కూడా ఇక్కడి నుంచి మిస్సైల్స్‌ను సరఫరా చేసే యోచనలో కంపెనీ ఉంది. తమ తయారీ కేంద్రం దేశంలోనే మొదటి ప్రయివేటు రంగపు 'మిస్సైల్ హౌజ్'గా చరిత్రకు ఎక్కనుందని కల్యాణి గ్రూపు చైర్మెన్ బాబా కల్యాణి తెలిపారు. భారత ప్రభుత్వం నుంచి దాదాపు బిలియన్ డాలర్ల మేర మిస్సైల్స్ అందించే నిమిత్తం తమకు ఆర్డర్ లభించినట్టుగా ఆయన తెలిపారు. మేడిన్ ఇండియాలో భాగంగా 90% స్థానికంగానే లభించే ముడి సరుకుతోనే మిస్సైల్స్‌ను తయారు చేయనున్నట్లుగా ఆయన వివరించారు. ఈ ఫెసిలిటీతో 300 మందికి ప్రత్యక్షంగానూ.. దాదాపు 1000 మంది పరోక్షంగాను ఉపాధి లభించనున్నట్లుగా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రక్షణ, ఏరోనాటిక్స్ విభాగాలకు హైదరాబాద్ కేంద్రంగా మారుతోందని అన్నారు. అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నాయని వివరించారు. దాదాపు 10 నెలల వ్యవధిలోనే దాదాపు రూ.60-70 కోట్ల వ్యయంతో ఫెసిలిటీని ఏర్పాటు చేయడాన్ని ఆయన ప్రశంసించారు.

ఇన్ఫోసిస్‌లో మళ్లీ లుకలుకలు!



బెంగళూరు: సాఫ్ట్‌వేర్ దిగ్గజం ఇన్ఫోసిస్ బోర్డు సభ్యులకు, దాని వ్యవస్థాపకులకు మధ్య మరోమారు లుకలుకలు మొదలయ్యాయి. పనాయా కొనుగోలుకు సంబంధించిన విచారణ రిపోర్టును బహిర్గతం చేయాలంటూ సంస్థ వ్యవస్థాపకులు ఎన్ఆర్ నారాయణమూర్తి ఇటీవల బోర్డు సభ్యులకు రాసిన లేఖతో మళ్లీ వివాదం రాజుకుంది. 200 మిలియన్ డాలర్లతో కొనుగోలు చేసిన పనాయా విషయంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని మార్కెట్ రెగ్యులేటరీ సంస్థ సెబీ ఆరోపించింది. సెబీ ఆరోపణలపైనా, మాజీ సీఎఫ్ఓ రాజీవ్ బన్సాల్ సెవరెన్స్ ప్యాకేజీలో తలెత్తిన వివాదం విషయంలోనూ, ప్రస్తుత సీఈవో అత్యధికమైన ఖర్చులపై వచ్చిన ఆరోపణల విషయంలోనూ కంపెనీ అంతర్గతంగా విచారణను చేపట్టింది. జూన్‌లోనే వీటిపై కంక్లూజిన్ అండ్ సమ్మరీ ఫైండింగ్ స్టేట్‌మెంట్‌ను ప్రచురించింది. కానీ మొత్తం రిపోర్టులను బహిర్గతం చేయాలని నారాయణమూర్తి డిమాండ్ చేస్తున్నారు. కంపెనీ పారదర్శకత, జవాబుదారీతనం కోసం ఈ రిపోర్టును అందించాలని ఆయన కోరుతున్నారని సంబంధిత వర్గాలు చెప్పాయి. అయితే ఈ రిపోర్టును ప్రజల ముందుకు తీసుకొచ్చేందుకు కంపెనీ ఏ మాత్రం అంగీకరించడం లేదు. ఈ రిపోర్టును బహిర్గతం చేస్తే, పనాయా ఇన్వెస్టర్లకు, దాని లిమిటెడ్ పార్టనర్లకు మధ్యనున్న క్లయింట్ రహస్య ఒప్పందాలను ఉల్లంఘించినట్టు అవుతుందని కంపెనీ పేర్కొంటోంది.

ఇక చిట్‌ఫండ్ మోసాలకు చెక్!

- ముసాయిదా బిల్లు సిద్ధం చేసిన కేంద్రం
- త్వరలోనే పార్లమెంట్ ముందుకు
- ప్రభుత్వ బ్యాంకుల్లోనే పారు బాకీలధికం
- లోక్‌సభలో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ
- బ్యాంకింగ్ నియంత్రణ బిల్లుకు మోక్షం



న్యూఢిల్లీ: చిట్‌ఫండ్ సంస్థల మోసాలకు చెక్ పెట్టే దిశగా తమ సర్కారు దృష్టి సారించిందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం లోక్‌సభలో తెలిపారు. ఇందులో భాగంగా తమ ప్రభుత్వం ఇప్పటికే ఒక ముసాయిదా బిల్లును రూపొందించినట్టుగా వెల్లడించారు. ఒక్క రాష్ట్రానికే పరిమితం కాకుండా వివిధ రాష్ట్రాలలో కార్యకలాపాలను నిర్వహిస్తున్న చిట్‌ఫండ్ కంపెనీల మోసాలు పెరిగిపోతున్నాయని ఆయన అన్నారు. ఆయా సంస్థలు అమాయక ప్రజల నుంచి వందల కోట్లలో సొమ్మును వసూలు చేసి మోసం చేస్తున్న సంఘటనలు పెరిగిపోతుండడం పట్ల జైట్లీ లోక్‌సభలో విస్మయం వ్యక్తం చేశారు. రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న చిట్‌ఫండ్ల నియంత్రణకు సంబంధించి పలు రాష్ట్రాల్లోసొంత చట్టాలు ఉన్నాయని ఆయన వివరించారు. బహుళ రాష్ట్రాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న సంస్థల మోసాలకు చెక్ చెప్పేలా ఇప్పటికే తమ సర్కారు ఒక ముసాయిదా బిల్లును రూపొందించిందని ఆయన తెలిపారు. త్వరలోనే దీనిని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నట్లుగా జైట్లీ వెల్లడించారు.

ప్రభుత్వ బ్యాంకుల్లోనే మొండి బాకీలెక్కువ..

బ్యాంకింగ్ రంగంలో పేరుకుపోయిన మొండి బాకీల సమస్య పరిష్కారానికి కేంద్రం వేగంగా చర్యలు చేపడుతోందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. బ్యాంకింగ్ నియంత్రణ (సవరణ) బిల్లు-2017పై లోక్‌సభలో జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు అంశాలపై వివరణనిచ్చారు. మొండి బాకీల సంస్కరణల అమలు ప్రక్రియ త్వరలోనే ప్రారంభమవుతుందని తెలిపారు. పారు బాకీల సమస్య పరిష్కార చర్యల్లో ఆర్‌బీఐ ఇప్పటికే 12 బడా రుణ ఎగవేత సంస్థలను గుర్తించినట్టుగా తెలిపారు. త్వరలోనే మరిన్నింటిపై చర్యలు మొదలుపెట్టే అవకాశం ఉన్నట్టుగా వివరించారు. ఎన్‌పీయే నియంత్రణ బిల్లుకులోక్‌సభ మూజువాణి ఓటుతో గురువారం సమ్మతి తెలిపింది దీంతో బ్యాంకింగ్ రెగ్యూలేషన్ (ఎమండ్‌మెంట్) బిల్లు-2017 అందుబాటులోకి వచ్చినట్టయింది. బ్యాంకుల నుంచి రుణాలను తీసుకొని నిధులను ఇతర అవసరాలకు మళ్లించిన వారిపై క్రిమినల్, రికవరీ చర్యలు తీసుకొనేందుకు గాను ఈ కొత్త చట్టంలో చర్యలు తీసుకోనున్నట్టుగా మంత్రి ప్రకటించారు.కంపెనీలు, ఉద్యోగాలను కాపాడుకోవడంతో పాటు దివాళా కంపెనీలు బ్యాంకులకు బకాయిలను తిరిగి చెల్లించే విధంగా తగు చర్యలను చేపట్టేలా చూడడమే ఈ కొత్త బిల్లు ప్రధాన ఉద్దేశమని ఆయన వివరించారు. 2008లో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం ఏర్పడక ముందు బ్యాంకుల జారీ చేసిన రుణాలే ఎక్కువగా మొండి బాకీల జాబితాలో ఉన్నట్టుగా తెలిపారు. ఇప్పుడు వీటిని తిరిగి వసూళు చేసేందుకే తాము పలు వినూత్న చర్యలు తీసుకుంటున్నట్టుగా తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థల్లోనే ఎక్కువగా మొండి బాకీలు నమోదై ఉన్నట్టుగా మంత్రి తెలిపారు. వృద్ధికి చోదకంగా నిలిచే పరిశ్రమలకు ఆర్థిక దన్నునిచ్చేందుకే బ్యాంకులు పరిశ్రమలకు ఎక్కువగా రుణాలను మంజూరు చేస్తూ వచ్చాయని అన్నారు. ప్రయివేటు రంగ బ్యాంకులు రిటైల్ రుణాలపైనే ఎక్కువగా దృష్టి సారించినందునే ఆ బ్యాంకుల్లో మొండి బాకీల బెడద తక్కువని ఆయన విశ్లేషించారు.

ఒకే రకమైన జీఎస్టీ శ్లాబ్ వీలుపడదు

దేశంలో కొత్తగా అమలులోకి తీసుకువచ్చిన 'వస్తుసేవల పన్ను' (జీఎస్టీ) శ్లాబ్‌లను రానున్న కాలంలో హేతుబద్దీకరించే అవకాశాలు లేకపోలేదని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ లోక్‌సభకు సూచనప్రాయంగా తెలిపారు. 12%, 18% జీఎస్టీ శ్లాబ్‌లపై ప్రధానంగా కొన్ని వర్గాల నుంచి ఆక్షేపణలు అందుతున్నాయని ఆయన అన్నారు. జీఎస్టీ ప్రక్రియ పూర్తిగా పట్టాలెక్కిన తరువాత.. ఈ రెండు శ్లాబ్‌లను ఏకం చేస్తూ త్వరలోనే కొత్త పన్ను శ్లాబ్‌ను అందుబాటులోకి తీసుకవచ్చే అవకాశం లేకపోలేదని ఆయన అన్నారు. దేశం మొత్తం ఒకే పన్ను శ్లాబ్‌ను తీసుకువచ్చే అంశంపై ఆయన స్పందిస్తూ చెప్పులను, బీఎండబ్ల్యూ కారును ఒకే విధంగా పరిగణనలోకి తీసుకొని పన్ను విధించడం సాధ్యం కాదని అన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన అత్యధికంగా ప్రజలున్న భారత్ వంటి దేశంలో ఒకే రకమైన జీఎస్టీ పన్ను శ్లాబ్‌ను తీసుకురావడం వీలుపడదని ఆయన పార్లమెంట్‌కు తేల్చి చెప్పారు.

మోడీ ఎంత తిరిగినా ఫలితమేదీ..?


- రాజ్యసభలో నిలదీసిన ప్రతిపక్షాలు



న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విదేశాంగ విధానం వల్ల, ఇరుగు పొరుగు దేశాలతో సంబంధాలు దెబ్బతిన్నాయని విపక్షాలు మండిపడ్డాయి. అమెరికాతో స్నేహం ద్వారా భారత్.. ప్రపంచంలో తనని తాను దిగజార్చుకుందని విమర్శించాయి. ప్రధాని మోడీ ఎన్ని దేశాలు తిరిగినా భారత్‌కు పెట్టుబడులు తేలేక పోయారని విపక్షాలు రాజ్యసభలో ఎద్దేవా చేశాయి. చైనాతో వివాదాన్ని చర్చల ద్వారానే పరిష్కరించేందు క షి చేస్తున్నామని కేంద్రం స్పష్టం చేసింది.భారత దేశ ప్రస్తుత విదేశాంగ విధానంపై రాజ్యసభలో గురువారం వాడి వేడి చర్చ జరిగింది. బహుళ దేశాల ప్రయోజనాలే పరమార్థంగా మోడీ సర్కార్ పనిచేస్తున్నదని సీపీఐ(ఎం) విమర్శించింది. స్వాతంత్రానికి పూర్వం నుంచి పాలస్తీనాతో భారత్‌కు ఎంతో అనుబంధం ఉన్నదని... మోడీ ఇజ్రాయిల్ పర్యటన దీనికి విఘాతం కల్పించిందని ఏచూరి అన్నారు. గతంలో అలీనవిధానం ద్వారా ప్రపంచానికే మార్గదర్శకంగా భారత్ నిలబడిందని ఏచూరి తెలిపారు. అణ్వాయుధాల విధ్వంసానికి భారత్ నేత త్వం వహించిందని, రాజీవ్‌గాంధీ ఐక్యరాజ్యసమితిలో ఎజెండాను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఇండియా-అమెరికా అణు ఒప్పందం వల్ల భారత్‌కు జరిగిన మేలేంటీ? అమెరికా న్యూక్లియర్ టెక్నాలజీని భారత్‌కు బదిలీ చేసిందా అని ప్రశ్నించారు.డోక్లామ్‌కు సంబంధించి చైనా భారత్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్తత... పాకిస్తాన్, నేపాల్ తదితర ఇరుగు పొరుగు దేశాలతో మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై కాంగ్రెస్ నేత ఆనంద్‌శర్మ కేంద్రాన్ని ఎండగట్టారు. 65 దేశాల్లో పర్యటించిన ప్రధాని దేశానికి ఏమి ఒనగూర్చారని నిలదీశారు. పాకిస్తాన్‌పై సర్జికల్ స్ట్రయిక్స్ చేశామని మోడీ గొప్పలు చెప్పుకుంటున్నా...ఇంతవరకు ఆ దేశం దాన్ని అంగీకరించలేదని ఆనంద్‌శర్మ చెప్పారు. ఇండియా-రష్యాల మధ్య సంబంధాలు క్షీణిస్తున్నాయని, రష్యా పాక్‌తో సైనిక విన్యాసాలు జరపడం ఆందోళన కలిగిస్తోందన్నారు.

9న ఛలో ఢిల్లీని జయప్రదం చేయండి

- ఉపాధి హామీ చట్టం, కనీస వేతనాల కోసం వ్యకాస జాతీయ ఉపాధ్యక్షులు వెంకట్ పిలుపు
- గోడ పత్రిక ఆవిష్కరణ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామీణ ఉపాధి హామీ చట్టం, అటవీ హక్కుల చట్టం, 2013 భూసేకరణ చట్టం, ఆహార భద్రతా చట్టం, కనీస వేతనాల కోసం అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఈనెల తొమ్మిదిన ఛలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చిందని ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు బి.వెంకట్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఛలో ఢిల్లీ పోస్టర్‌ను సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి. ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.ఆంజనేయులు, నాయకులు ఆర్.రాహూల్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. పనిదినాలను ఏడాదికి 200 రోజులకు, వేతనాన్ని రోజుకు రూ.400కు పెంచాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించకపోగా, ఉన్న సబ్సిడీలను కేంద్రంలోని ఎన్డీయే సర్కారు ఎత్తివేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కిరోసిన్, చక్కెరపై సబ్సిడీని బీజేపీ తొలగించిందని చెప్పారు. రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల వస్తువులను అందించాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టాన్ని నీరుగార్చారని వివరించారు.

కేసీఆర్... నీ వాచాలత్వాన్ని కట్టిపెట్టు...

అసలు నువ్వు సీఎం పదవికి అర్హుడివేనా...? :

- ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై తమ్మినేని ఆగ్రహం
- బూతులు లంకించుకోవటం వల్ల ఉపయోగం లేదని వ్యాఖ్య
- నువ్వో పచ్చి అవకాశవాదివి
- కమ్యూనిస్టులుగా ప్రజల గుండెల్లో ఉంటాం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'హిమాన్షు మోటార్ల వ్యవహారానికి సంబంధించి వామపక్షాలుగా మేం లేవనెత్తిన అంశాలపై సూటిగా సమాధానమివ్వని ముఖ్యమంత్రి...బూతులు లంకించుకున్నారు.. కమ్యూనిస్టులు, విపక్షాలనుద్దేశించి వాడు, వీడు, నా కొడుకులు అంటూ ఇష్టానుసారంగా మాట్లాడారు. ఇప్పటికైనా ఆయన తన వాచాలత్వాన్ని కట్టిపెట్టాలి. నోరు అదుపులో ఉంచుకోవాలి. నిన్న ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాటలు విన్న తర్వాత అసలు కేసీఆర్ సీఎం పదవికి అర్హుడేనా...? అన్న అనుమానం కలుగుతున్నది...' అని సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిపాలనను, అందులోని లోపాలను చక్కదిద్దుకోవాల్సిందిపోయి... విమర్శించిన విపక్షాలపైన, లోపాలను ఎత్తి చూపిన వారిపైనా సీఎం చౌకబారు విమర్శలు చేయటం దారుణమని వ్యాఖ్యానించారు.

గురువారం ట్యాంక్‌బండ్‌పైగల అంబేద్కర్ విగ్రహం వద్ద తమ్మినేని విలేకరులతో మాట్లాడుతూ... సీఎం వ్యవహారశైలిని తూర్పారబట్టారు. రాష్ట్రంలో ప్రజలను, ప్రతిపక్షాలను గౌరవించే పరిస్థితే లేకుండా పోయిందన్నారు. కమ్యూనిస్టు పార్టీల గురించి ముఖ్యమంత్రి స్థాయిలో కాకుండా ఒక చవకబారు వ్యక్తిలాగా ఆయన మాట్లాడారని విమర్శించారు. లెఫ్ట్ పార్టీలది గతించిన చరిత్ర అని కేసీఆర్ అంటున్నారు... అయితే ఒక్కసారి ఆయన గత చరిత్ర తిరగేయాలి.. 2004, 2009, 2014 ఎన్నికల సందర్భంగా ఇదే కమ్యూనిస్టు పార్టీల చుట్టూ ఆయన తిరిగారు.. పొత్తు కోసం వెంపర్లాడారని తమ్మినేని గుర్తుచేశారు. ఆనాడు కమ్యూనిస్టులు నీతి, నిజాయితీగలవారు, దేశభక్తులు అంటూ పొగిడిన నోటితోనే ఇప్పుడు తెగడటం కేసీఆర్ పచ్చి అవకాశవాదానికి నిదర్శమని ఎద్దేవా చేశారు. సీఎం వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. హిమాన్షు మోటార్ల వ్యవహారానికి సంబంధించి.. అందులో కేటీఆర్ డైరెక్టర్‌గా ఉన్న విషయానికి సంబంధించి ఒక్క మాట కూడా చెప్పని కేసీఆర్.. తన వాచాలత్వంతో ఆ అంశాన్ని దాటవేశారని విమర్శించారు. వామపక్షాలు ఎలక్షన్ కమిషనర్‌కు సమర్పించిన ఆధారాల్లో వాస్తవం లేదా? అని ప్రశ్నించారు. మేం సమర్పించిన డాక్యుమెంట్లు, కేటీఆర్ డైరెక్టర్‌గా ఉన్న విషయం, 2016లో ఆయన సంతకంతో యాన్యువల్ రిటర్న్‌ను సమర్పించటం నిజం కాదా? అని ప్రశ్నించారు. వీటన్నింటికీ సమాధానం చెప్పాలని సీఎంను డిమాండ్ చేశారు. కమ్యూనిస్టులుగా ఓట్లు, సీట్ల విషయంలో తాము బలహీనంగా ఉన్నా ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడుతూ వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతామని తమ్మినేని చెప్పారు. అదే కమ్యూనిస్టుల త్యాగనిరతి అని తెలిపారు. గతంలో అయినా, ఇప్పుడైనా, భవిష్యత్తులోనైనా.. ఎప్పుడైనా సరే.. ప్రభుత్వాల వైఫల్యాలను ఎత్తిచూపటంలోను, వాటిని నిప్పులా కడిగేయటంలోనూ ముందుంటామని చెప్పారు.

చరిత్రలో కలిసి పోతారు...
'నవతెలంగాణ'పై సీఎం వ్యాఖ్యలకు తమ్మినేని ఖండన

"ప్రజలు, ప్రతిపక్షాలు, పత్రికలు.. ఈ మూడింటినీ లెక్క చేయకుండా వ్యవహరించిన పాలకులందరూ కాలగర్భంలో, చరిత్రలో కలిసి పోయారు. వారికి పట్టిన గతే కేసీఆర్‌కూ పడుతుంది. పత్రికలపై సీఎం అక్కసు వెళ్లగక్కటం, ప్రగతి భవన్ వద్ద కవరేజీకి వెళ్లిన జర్నలిస్టులపై పోలీసులు దాడి చేయటం తదితరాంశాలను పరిశీలిస్తే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.. తెలంగాణ వస్తే అంతా మారిపోద్దని భావించిన ప్రజలకు సీఎం కేసీఆర్ తన చర్యల ద్వారా కనువిప్పు కలిగిస్తున్నారు..."

ఈ రాష్ట్రం ఎటుపోతున్నది: విమలక్క

"సమాజంలో జరిగే ప్రతి అంశాన్ని ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత పత్రికలు, మీడియాపై ఉంటుంది. అందుకనుగుణంగా జర్నలిస్టులకు స్వేచ్ఛ ఉండాలి. దాన్ని కూడా హరించి వేసే విధంగా రాష్ట్రంలో పాలన సాగుతున్నది. పత్రికలపట్ల కేసీఆర్ అనుసరిస్తున్న వైఖరి గర్హనీయం. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. మీడియా ప్రతినిధులపై జరిగిన దాడిపట్ల ప్రభుత్వం స్పందించాలి. బేషరతుగా క్షమాపణ చెప్పాలి..."

భావ ప్రకటనా స్వేచ్ఛకు గొడ్డలిపెట్టు...
ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు

"పత్రికలను నిందించటం, మీడియాపై దాడి చేయటం లాంటివి భావ ప్రకటనా స్వేచ్ఛకు గొడ్డలిపెట్టు వంటివి. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియాపైన్నే అక్కసు వెళ్లగక్కి, దాడులు చేస్తే ఎలా...? అలాంటప్పుడు ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉన్నట్టా? లేనట్టా?"

ప్రజాస్వామ్యం అపహాస్యం : సీఎం కామెంట్‌పై ఉత్తమ్

ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు మీడియాను, పత్రికలను, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా మాట్లాడారని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇదో పేపరా? అంటూ సీఎం ఎద్దేవా చేయడాన్ని ఆయన ఖండించారు. ముఖ్యమంత్రి స్థాయిలో బెదిరింపులకు గురి చేయడం తగదన్నారు. అధికార మదంతో సీఎం చిల్లర, మల్లరగా మాట్లాడి స్థాయి తగ్గించుకుంటున్నారని చెప్పారు. ముఖ్యమంత్రికి అధికారంలో కోల్పోతామనే భయం పట్టుకుందన్నారు. అందుకే అర్థరహితంగానూ, అడ్డగోలుగా మాట్లాడుతున్నారని చెప్పారు. ఇలాంటి బెదిరింపుధోరణులకు భయపడేది లేదన్నారు.

ఆటుపోట్లు కొత్తకాదు:
ప్రజల పత్రిక నవతెలంగాణ: రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ ప్రజల పత్రిక, ఆ పత్రికకు ప్రజలే ప్రధాన ఎజెండా అని తెలుగుదేశం తెలంగాణ కార్యనిర్వాహక అధ్యక్షులు ఎ రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజల పక్షాన పోరాడుతుందని, వార్తలు, వ్యాసాలు రాస్తుందన్నారు. ఇది గుమస్తా తెలంగాణ కాదు, ఏది చెబితే అది రాయడానికి అని అభిప్రాయపడ్డారు. సమస్యలు లేవనెత్తుతుంది, పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. అది గుర్తించకుండా మాటలతో దాడిచేయడం, ప్రకటనలు ఇవ్వకుండా దొంగదెబ్బ కొట్టాలని చూడటం సరికాదన్నారు. నువ్వు ప్రకటనలు ఇవ్వనంత మాత్రాన ఆపత్రిక మూత పడుతుందనే పగటి కళలు కనొద్దని సీఎంకు హితవు పలికారు. ఇలాంటి ఆటుపోట్లను, ఇబ్బందులను ఎదుర్కొవడం కమ్యూనిస్టులు, వాళ్ల పత్రికలకు కొట్టిన పిండి



అని చెప్పారు. ఎంతమంది లొంగినా నవతెలంగాణ లొంగదు, ఇది ముమ్మాటికీ నిజం అని వివరించారు. పాలకుల అరాచకాలను ఎప్పటికప్పుడు ఎండగట్టే పత్రిక నవతెలంగాణ అని కొనియాడారు.

సీఎం తీరు కొత్తేం కాదు :
బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె లక్ష్మణ్

పత్రికలపై సీఎం కేసీఆర్ అసహనం కొత్తేం కాదు. గతంలో ఆంధ్రజ్యోతి, ఏబీఎన్, టీవీ9 వంటి మీడియాలపైనా ఆయన ప్రతాపం చూపారు. తనకు వ్యతిరేకంగా వార్తలు వస్తే సహించలేక పోవడం దొరల అహంకారానికి నిదర్శనం. 'నవతెలంగాణ' దినపత్రికపై సీఎం వ్యాఖ్యలు సరికాదు. మల్లన్నసాగర్ భూసేకరణ విషయంలో మేం కూడా బాధితుల పక్షాన నిలిచాం. ప్రాజెక్టులకు వ్యతిరేకం కాదు. సరైన పరిహారం ఇవ్వాలనే డిమాండ్ చేశాం. 'నవతెలంగాణ' కూడా అదే చెప్పింది. దీంట్లో తప్పుపట్టడానికి ఏముంది? తెలంగాణలో ప్రజాస్వామ్య పాలన ఉందనే విషయాన్ని సీఎం విస్మరిస్తున్నారు.

సీఎం అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు :
ప్రతిపక్షాలపై నిందలు : జానారెడ్డి

అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికే ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు ప్రతిపక్షాలపై నిందలు వేస్తున్నారని ప్రతిపక్ష నేత జానారెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రి తన భాష తీరును మార్చుకోవాలని, ఆయన మాటలు అభ్యంతరంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు. గురువారం అసెంబ్లీలోని మీడియా హాలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటం చేసిన కమ్యూనిస్టు పార్టీలను విమర్శిస్తావా? అని మండిపడ్డారు. ప్రతిపక్షాలపై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు, విమర్శలు ఆయనకే వర్తిస్తాయన్నారు. తాను మాట్లాడదల్చుకుంటే కేసీఆర్ కంటే మూడు రెట్లు ఎక్కువగా మాట్లాడగలనని, కానీ హుందాతనం అడ్డొస్తుందన్నారు. సింగరేణి కారుణ్య నియామకాలకు మద్దతుగా అసెంబ్లీలో మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు వారసత్వ ఉద్యోగాలపై కోర్టుకు వెళ్లింది తెలంగాణ జాగతి మాజీ సభ్యుడేనన్నారు. కడుపు మండిన వాళ్లు కోర్టులకు వెళ్లడం వారి హక్కు అన్నారు. చట్టాల్లో లోపాలను సవరిస్తే కోర్టులు ఎందుకు అడ్డుకుంటాయన్నారు. మీడియా ప్రతినిధులపై పోలీసులు దాడి చేయడాన్ని ఆయన ఖండించారు.

కేసీఆర్ క్షమాపణ చెప్పాలి; షబ్బీర్ అలీ

రాజకీయ జన్మిచ్చిన కాంగ్రెస్ మీదే కేసీఆర్ అహంకారంతో మాట్లాతున్నారని మండలిలో ప్రతిపక్ష నేత షబ్బీర్‌అలీ అన్నారు. మీరాకుమార్‌పై కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. మహిళలను కించపరిచే విధంగా మాట్లాడటంపై మండిపడ్డ ఆయన, వెంటనే మీరాకుమార్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళితులపై కూడా సీఎం చులకనగా మాట్లాడారని విమర్శించారు. దళితులు, బీసీలపై థర్డ్‌డిగ్రీ ప్రయోగించిన పోలీసులపై చర్య తీసుకోకుండా..వారికే సీఎం మద్దతు పలకడం దారుణమని వ్యాఖ్యానించారు. హిమాన్ష్ మోటార్స్‌లో కేటీఆర్ భాగస్వామి కాకుంటే ఆబిడ్స్ సెంటర్‌లో ముక్కు నేలకు రాస్తానని అన్నారు.

కేసీఆర్ వీధిరౌడీ : భట్టి

ముఖ్యమంత్రి కేసీఆర్ వీధిరౌడీలా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. నేరెళ్ల ఘటనతో దళితులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, క్రమబద్దీకరణ అంశంలో కోర్టు పెట్టిన చీవాట్లతో కేసీఆర్‌కు మతిభ్రమించిందన్నారు. కేసీఆర్‌కు ధైర్యమంటే ప్రాణహిత ప్రాజెక్టుపై చర్చిద్దాం రమ్మని ఆయన సవాల్ విసిరారు. సీఎంగా ఉన్న వ్యక్తి 500 రోజులుగా సచివాలయానికి రారా.?అని నిలదీశారు. మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ అహంకారంతో నోటికొచ్చినట్టు కేసీఆర్ మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉమ్మడి ప్రభుత్వం మీపై ఇదే విధంగా వ్యవహరిస్తే ఎక్కడ ఉండేవాడివని ప్రశ్నించారు. అతితెలివిగా మాట్లాడడం మానుకోవాలని ఆయన హితవు పలికారు.

భావ ప్రకటన స్వేచ్ఛకు సంకెళ్లు...
'నవతెలంగాణ'పై సీఎం కామెంట్లపై మేధావుల ప్రతిస్పందనలు

ముఖ్యమంత్రి కేసీఆర్ నవతెలంగాణ దినపత్రికపై చేసిన వ్యాఖ్యలు.. భావ ప్రకటనా స్వేచ్ఛకు సంకెళ్లవంటివని పలువురు వామపక్ష నేతలు, మేధావులు విమర్శించారు. ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభమైన మీడియాపై దాడి చేయటం దేశానికి అత్యంత ప్రమాదకరమని వారు వ్యాఖ్యానించారు.

ప్రజల నాలుక నవతెలంగాణ
మల్లు స్వరాజ్యం, సాయుధ పోరాట యోధురాలు

"సీఎం కేసీఆర్ నియంతృత్వ పాలన సాగిస్తున్నారు. తెలంగాణలో పోలీసులు రజాకార్లను మించిపోయారు. నేరెళ్ల ప్రజలపై పోలీసుల పాశవిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. వారిని చిత్రహింసలకు గురిచేసిన విధానం రజాకార్ల రోజులను గుర్తు చేశాయి. ఇది ప్రజాస్వామ్యమా? రాచరికమా? కమ్యూనిస్టుల వెనకున్నది ప్రజలే. వారి గురించి సోయిలేని మాటలు మాట్లాడటం సరికాదు. నవతెలంగాణ ప్రజలను చైతన్యపరుస్తున్నది. ప్రజల నాలుకగా పనిచేస్తున్న ఆ పత్రిక మీద అవాకులు చవాకులు పేలడం సమంజసం కాదు. ఆ పత్రికను విమర్శించే హక్కు కేసీఆర్‌కు లేదు. ప్రజల పక్షం వహించే ఆ పత్రిక అర్థం కావాలంటే ప్రజాస్వామ్యం, ప్రజల హక్కుల గురించి ఇంకా తెలుసుకోవాల్సి ఉంది..."

తిప్పికొట్టాలి: ప్రొఫెసర్ తిరుమలి

"ఎన్నికలు దగ్గరకొస్తున్నకొద్దీ విపక్షాలపైన, పత్రికలపైనా ఈ దాడి మరింత పెరుగుతుంది. అందుకని అందరం ఐక్యంగా ఉద్యమించాలి. తద్వారా కేసీఆర్ చర్యలను తిప్పికొట్టాలి. ప్రజాస్వామ్యంలో భావ ప్రకటనా స్వేచ్ఛను హరించటం అత్యంత ప్రమాదకరం..."

నవతెలంగాణ నిజాలు రాస్తుంది : ఆర్.కృష్ణయ్య

ప్రజాస్వామ్యంలో పత్రికలు ప్రభుత్వం వైపు కాకుండా ప్రజల పక్షాన ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, నిరుద్యోగుల హక్కుల కోసం గొంతై నిలవాలి. నవతెలంగాణ పత్రిక ప్రజల హక్కుల కోసం నిలబడి ప్రభుత్వానికి ప్రజల గోస వినిపిస్తుంది. ప్రభుత్వానికి నవతెలంగాణ వత్తాసు పాడడం లేదని ఈర్షతో ముఖ్యమంత్రి పత్రికకు వ్యతిరేకంగా మాట్లాడడం సరైంది కాదు. నవతెలంగాణ ప్రజల పక్షాన నిలబడి నిర్మాణాత్మకమైన విమర్శలు చేస్తున్నది. దాన్ని ప్రభుత్వం అర్థం చేసుకొని ప్రజలకు అవసరమైన నిర్ణయాలు తీసుకోవాలి. ముఖ్యమంత్రి నవతెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడడం సరైంది కాదు. నవతెలంగాణ పత్రికకు నా పూర్తి మద్దతు ఉంటుంది.

సందర్భం

తల్లిపాల వారోత్సవాలు



బ్రెస్ట్ ఫీడింగ్

శిశువుకు తల్లిపాలను మించిన ఆహారం లేదు. ఇందులో పోషక విలువలు పుష్కలం. తల్లిపాలు తాగినప్పుడే బిడ్డకు ఆరోగ్యం. రోగ నిరోధక శక్తిని ఇది పెంచుతుంది. కనీసం ఆరు నెలలు నిండే వరకైనా తల్లిపాలు పట్టించడం శ్రేయస్కరం.

ప్రతి శిశువుకు అమ్మపాలు చాలా అవసరం. జన్మనిచ్చిన కొద్ది సేపటి నుంచే తల్లి తన బిడ్డకు పాలివ్వడం ప్రారంభించడం తప్పనిసరి. సాధారణ కాన్పు అయినవారు ఒకట్రెండు గంటల్లోనే పాలు ఇవ్వొచ్చు. సిజేరియన్ జరిగిన వారు నొప్పి తగ్గిన 4,5 గంటల్లోపే పాలు పట్టించాలి. దీంతో శిశువులకు విరేచనాలు సక్రమంగా అవుతాయి. ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఎదురుకావు. ఎలాంటి ఇన్ఫెక్షన్లూ రావు. బిడ్డ తగిన బరువు పెరగడానికి తల్లిపాలు ఎంతో దోహదం చేస్తుంది. తల్లి పాలు పిల్లలకు తొందరగా జీర్ణమవుతాయి. వీటిలో ప్రోటీన్లు, విటమిన్లు, కార్బోహైడ్రేట్లు, మినరల్స్, కాల్షియం, పొటాషియం తదితర పోషకాలు ఉంటాయి.

ఆరోగ్యానికి భరోసా

తల్లి పాలలో ప్రొటెక్టివ్ యాంటీబాడీస్ ఉంటాయి. దీంతో శిశువులో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. తల్లిపాలతో వైరస్ ఇన్ఫెక్షన్స్, అలర్జీలు రాకుండా ఉంటాయి. తల్లిపాలు నోచని శిశువులకు మోకాళ్ల వంకర తిరగడం లాంటి సమస్యలు ఎదురుకావచ్చు. బ్రెస్ట్ ఫీడింగ్ చేస్తుంటే మహిళలకు వెంటనే ప్రెగ్నెన్సీ రాకుండా ఉంటుంది. పాలివ్వడం వల్ల యూటెరస్ తిరిగి మామూలు సైజుకు చేరుకుంటుంది.

అవగాహన అవసరం

తొలి గర్భం ధరించే మహిళలు బిడ్డకు పాలిచ్చే విషయంలో అవగాహన కలిగి ఉండాలి. వీరిని ముందుగానే మానసికంగా సిద్ధం చేయాలి. శిశువుకు పాలిచ్చే విషయాన్ని ఏడు, ఎనిమిది నెలల గర్భంతో ఉన్నప్పుడే తెలియజేయాలి. పాలిస్తే అనర్థకమని కొందరు తల్లులు భావిస్తారు. ఇలాంటి అపోహలను తొలగించాలి.

బిడ్డకు పాలిచ్చే బ్రెస్ట్ నిపుల్‌ని కరెక్ట్‌గా ఉండేటట్టు చూసుకోవాలి. పాలిచ్చేటప్పుడు నిపుల్ చుట్టూ శుభ్రపర్చుకోవాలని తల్లులకు చెప్పాలి.

ఇది తప్పనిసరి

శిశువుకు ఆరు నెలల వరకు తప్పనిసరిగా తల్లి పాలివ్వాలి. శిశువు ఆరోగ్యంగా ఉండాలంటే తొమ్మిది నెలల వరకు పాలివ్వడం శ్రేయస్కరం. ఇక ఐదు నెలల నుంచి పాలతో పాటు పండ్లు, ఇతర పోషకాహారాన్ని అందజేయడం మంచిది. బిడ్డకు ప్రతి రెండు, మూడు గంటలకోసారి తప్పనిసరిగా తల్లి పాలివ్వాలి. ఒక వేళ శిశువు గాఢ నిద్రలో ఉంటే నాలుగు గంటలకైనా పాలివ్వాలన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. కనీసం ఐదు నిమిషాలపాటైనా పాలివ్వాలి. పెరుగుతూ ఉండే శిశువుకైతే 10,15 నిమిషాలపాటు పాలిస్తే మంచిది. కడుపునిండా పాలు తాగగానే పిల్లలు వెంటనే పడుకుంటారు. కొంతమంది తల్లులకు సరిగ్గా పాలురావు. అలాంటి వారు వచ్చినంత మేరకు పాలిచ్చిన తర్వాత తక్కువ పడితే బాటిల్‌తో పాలు పట్టొచ్చు.

సురక్షితమే..



పాలిచ్చే తల్లులు ఆరోగ్యంగా ఉంటారు. అంతేకాదు.. బిడ్డకు పాలివ్వడం వల్ల మొదటి ఆరునెలలలోపు అండం విడుదల కాదు. దీంతో గర్భం దాల్చే అవకాశం లేదు. అంటే.. బిడ్డకు పాలివ్వడం సహజ కుటుంబ నియంత్రణగా ఉపయోగపడుతుందన్నమాట. పిల్లలకు పాలిచ్చే తల్లులు వైద్యుల సలహా లేకుండా ఎలాంటి మందులూ వాడొద్దు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు వైద్యులు సలహామేరకు శిశువులకు పాలివ్వాలి.

– డాక్టర్ పి.రమేష్ బీ దాంపురి,
పిల్లల వైద్య నిపుణులు



అమ్మకు ఆహారం

పాలు సక్రమంగా రాని బాలింతలకు కాల్షియం, ఇతర మందులు అవసరం. ఈ మహిళలు ఎక్కువ క్యాలరీలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలి. ప్రోటీన్లు, విటమిన్లు ఉన్న ఆహారంతోపాటు పాలు, బ్రెడ్, రొట్టెలు తీసుకోవాలి. పాలిచ్చే తల్లికి తగినంత నిద్ర ఉండాలి. నీళ్లు బాగా తాగాలి. ఇవన్నీ సక్రమంగా ఉన్నప్పుడు బిడ్డకు తల్లి తగినంత పాలివ్వగలుగుతుంది. తల్లి పాలు కడుపు నిండా తాగిన పిల్లలు అవసరమైన బరువు పెరుగుతారు.

కొందరు తమ బిడ్డకు ఎక్కువగా పాలిస్తారు. ఇది మంచిదికాదు. దీంతో శిశువుకు వాంతులు వస్తాయి. బిడ్డకు పాలు సమృద్ధిగా అందాలంటే తల్లి బలమైన పోషకాహారం తీసుకోవాలి. మంచి ప్రొటీన్లు, కాల్షియం, విటమిన్లు, ఐరన్ గల ఆహారం తినాలి. ప్రొటీన్లు ఎక్కువగా లభ్యమయ్యే పాలు, గుడ్లు, మాంసం, చేపలు ఎక్కువగా తీసుకోవాలి. విటమిన్–ఏ ఎక్కువగా ఉండే క్యారెట్, గుమ్మడి వంటి కూరగాయలు తినాలి. పోషకాలు ఎక్కువగా ఉండే ఉడికించిన బఠాణీలు, బీన్స్, మొలకెత్తిన గింజలు తీసుకోవాలి. ఫోలెట్ అధికంగా లభ్యమయ్యే ఆకు కూరలు ఎక్కువగా తినాలి. పండ్లు, పప్పు ధాన్యాలను ఎక్కువగా తీసుకోవాలి. మసాలాలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవద్దు.

సమతులాహారంలో పాలు, పాల ఉత్పత్తుల ప్రాధాన్యం

పాలు, పాల పదార్థాల్లో ఆరోగ్యానికి కావాల్సిన అనేక పోషకాలు లభిస్తాయి. అంతేకాదు.. పాక్షికంగా వెన్న తీసిన పాలు శరీరానికి మేలు చేస్తాయి. కావాల్సిన పోషకాలు అందించడమే కాకుండా శరీరంలో కొవ్వు పెరగకుండా దోహదపడతాయి.

పాలు, పెరుగు, జున్ను (పనీర్, చీజ్)లో లభించే పోషకాలు

పోషకాలు	ఆరోగ్యానికి చేకూర్చే ప్రయోజనం
క్యాల్షియం	దంతాలు, ఎముకల పటిష్టతను మెరుగుపరుస్తాయి.
ఫాస్పరస్	శారీరక శక్తిని అందిస్తుంది
మెగ్నీషియం	కండరాల పనితీరును మెరుగుపరుస్తుంది
ప్రోటీన్స్ (మాంసకృత్తులు)	శరీర పెరుగుదల, మరమ్మతులకు దోహదపడతాయి
ఫ్యాట్, కార్బొహైడ్రేట్లు	శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తాయి
విటమిన్ బీ12	ఆరోగ్యకరమైన కణ ఉత్పత్తికి ఉపయోగపడుతుంది
విటమిన్–ఏ	కంటి చూపును మెరుగుపరుస్తుంది.
	రోగ నిరోధకశక్తిని పెంచుతుంది
జింక్	రోగ నిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది
రెబోఫ్లేవిన్	కాంతివంత, ఆరోగ్యవంత చర్మానికి దోహదపడుతుంది
ఫోలెట్	ఆరోగ్యకర, శక్తిమంత కణ ఉత్పత్తికి దోహదపడుతుంది

రోజూ గ్లాసు పాలు (200 ఎంఎల్) తాగితే లభించే పోషకాలు

పోషకాలు	గ్లాసు పాలలో లభించే పరిమాణం		
		కాపర్	Traces
		సెలీనియం	2ఎంజీ
ప్రోటీన్స్(మాంసకృత్తులు)	7.2 గ్రా	విటమిన్–ఏ	39 మైక్రోగ్రామ్
క్యాల్షియం	247 ఎంజీ	థయామిన్	0.1 ఎంజీ
కొవ్వు	6 గ్రా	రెబోఫ్లామిన్	0.5 ఎంజీ
ఫాస్పరస్	194 ఎంజీ	నయాసిన్	0.2ఎంజీ
సోడియం	89 ఎంజీ	విటిమిన్ –బీ6	0.12 ఎంజీ
పొటాషియం	321 ఎంజీ	విటిమిన్–బీ12	1.9/1/4 గ్రా
క్లోరైడ	179 ఎంజీ	విటమిన్–సీ	4 ఎంజీ
ఐరన్	0.04 ఎంజీ		

సమతుల్యాహారంలో పాలు, పాల పదార్థాలను వినియోగించటం చాలా అవసరం. 200 మి.లీటర్ల పాలు, 150 గ్రాముల పెరుగు లేదా 300 గ్రాముల చీజ్ రోజూ తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి కావాల్సిన క్యాల్షియం లభిస్తుంది.

అంతేకాకుండా ఈ రోజుల్లో ప్రొబయోటిక్ డెయిరీ ఉత్పత్తులు మార్కెట్లో లభిస్తున్నాయి. వీటి వల్ల కూడా కొన్ని ప్రధానమైన ఉపయోగాలు ఉన్నాయి. వీటిలో శరీరానికి మేలు చేసే బ్యాక్టీరియా ఉంటాయి. ప్రొబయాటిక్ డెయిరీ ఉత్పత్తుల వల్ల కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి. అవేమిటంటే...

- జీర్ణక్రియలో/జీర్ణవ్యవస్థలో సమతుల్యమైన బ్యాక్టీరియా సంఖ్యను పెంపొందిచటానికి దోహదపడుతాయి. అజీర్తిని నివారిస్తాయి.



- హృద్రోగాలను అదుపు చేయడంలో తోడ్పడతాయి.
- ఒత్తిడిని తగ్గిస్తాయి.
- బ్లడ్ ప్రెషర్(రక్తపోటును) నియంత్రిస్తాయి.
- రోగ నిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తాయి.
- అంటువ్యాధుల బారిన పడకుండా కాపాడతాయి.
- చెడు కొలెస్ట్రాల్‌ని అదుపులో ఉంచుతాయి.
- హానికారక బ్యాక్టీరియాను నివారిస్తాయి.

టెన్షన్ వద్దు

హోమియో వైద్యంతో థైరాయిడ్ నియంత్రణ

థైరాయిడ్ సమస్య అనేది సర్వసాధారణమైపోయింది. మారుతున్న జీవన శైలి, పాశ్చాత్య అలవాట్లు, పెరుగుతున్న మానసిక, శారీరక ఒత్తిళ్లు, జన్యుపరమైన లోపాలు ఈ గ్రంథిపై ప్రభావం చూపుతున్నాయి. థైరాయిడ్ అసమతుల్యత కారణంగా భారతదేశంలోని 42 మిలియన్ల మంది సతమతమవుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి.


మానవ శరీరంలోని ముఖ్యమైన గ్రంథుల్లో థైరాయిడ్ ఒకటి. ఇది మన శారీరక ఎదుగుదల్లో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఈ గ్రంథి పనితీరు గతి తప్పడం లేదా అసమతుల్యతకు గురికావడం వల్ల అనేక రుగ్మతలు దాడి చేస్తాయి. అయితే.. థైరాయిడ్ సమస్యలన్నీ ఒక్కటి కావు. అందరిలోనూ అన్ని లక్షణాలు ఉండాలని లేదు. జన్యు నిర్మాణాన్నిబట్టి అవి ఉంటాయి. చాలామంది థైరాయిడ్ సమస్యను సకాలంలో గుర్తించరు. అశ్రద్ధ, అజ్ఞానం కారణంగా సరైన నిర్ధారణ పరీక్షలు చేయించుకోరు. సకాలంలో చికిత్స పొందరు. తద్వారా అనేక దీర్ఘకాలిక వ్యాధులను కొనితెచ్చుకుంటారు.

థైరాయిడ్ సైనసైటిస్, ఇన్‌ఫెక్షన్లు

శిశువు జన్మించినప్పుడు బరువు అధికంగా లేదా చాలా తక్కువగా ఉండటం, ఎదుగుదల లోపాలు, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత లోపాలు, మందబుద్ధి, తరచూ జలుబు, దగ్గు, తరచూ ఇన్‌ఫెక్షన్లు, జ్వరం, అలర్జీల బారిన పడటం కనిపించొచ్చు. అలాగే మధ్య వయసులో నీరసం, త్వరగా అలసిపోవడం, చిరాకు, కోపం, ఆందోళన, గుండె దడ, మానసిక ఒత్తిడి, సైనసైటిస్, మైగ్రేన్ లేదా తలనొప్పి, ముఖంలో వాపు, తరచూ టాన్సిల్స్ లేదా నోటి ఇన్‌ఫెక్షన్లు, తరచూ తుమ్ములు, వాంతులు, విరేచనాలు, ముక్కు నుంచి నీరు కారడం తదితర లక్షణాలు ఉంటాయి.

థైరాయిడ్ సోరియాసిస్

థైరాయిడ్ గ్రంథి అసమతుల్యతో చాలామందిలో చర్మంపై పొలుసులు లేదా పొట్టు రాలడం, పొడిబారడటం, పిగ్మంటేషన్ సమస్యలు కనిపిస్తాయి. వీటితోపాటు సొరియాసిస్ లక్షణాలు మొదలవుతాయి. లేదా ఎక్కువవుతాయి. సొరియా సిస్ లక్షణాలు శరీరంలో ఎక్కడైనా మొదలుకావచ్చు. ముఖ్యంగా తలలో డాండ్రాఫ్ లేదా చుండ్రుగా కనిపించొచ్చు. అజాగ్రత్త చేస్తే జుట్టు రాలిపోతుంది. చెవుల వెనుక పొట్టుతో కూడిన పొలుసులు మొదలవుతాయి. ఆ తర్వాత శరీరమంతటా అవి వ్యాపిస్తాయి. మరికొంత మందిలో కేవలం చర్మం పొడిబారడం పిగ్మెంటేషన్ లేదా మచ్చలు కనిపిస్తాయి. వీటితోపాటు గొంతు ముందు భాగంలో వాపు రావడం, అధిక ఆందోళన, మానసిక వ్యాకులత, నీరసం, గుండె దడ, గ్యాస్ట్రో సమస్యలు, మలబద్ధకం ఉంటాయి. ముఖ్యంగా మహిళల్లో



సొరియాసిస్ లక్షణాలతోపాటు థైరాయిడ్ హార్మోన్లు వల్ల నెలసరి సక్రమంగా లేకపోవడం, కడుపు నొప్పి, తెల్లబట్ట కావడం, మైగ్రేన్ తలనొప్పి లాంటి లక్షణాలు కనిపిస్తాయి.

థైరాయిడ్ ఆర్థరైటిస్

థైరాయిడ్ అసమతుల్యత వల్ల బరువు పెరగడం లేదా తగ్గడం, జుట్టు రాలడం, తెల్లబడటం, కండ్ల కింద నల్ల చారలు రావడం, గొంతు పైన వాపు రావడం, కీళ్ల నొప్పులు, కండరాలు పట్టేయడం, కాళ్ల వాపులు, నరాలు లాగడం, కాళ్లు లాగడం, తిమ్మిర్లు, నడకలో మార్పు రావడం, తలనొప్పి, తల తిరగడం, బైర్లు కమ్మడం, మల, మూత్ర విజర్జనపై నియంత్రణ కోల్పోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.

సంతానలేమి

థైరాయిడ్ అసమతుల్యత వల్ల సంతాన లేమి సమస్య తలెత్త వచ్చు. ఇది ఒకే రకమైన కారణాల వల్ల మొదలు కావచ్చు. అందువల్ల దీన్ని అసమతుల్యత సంబంధిత అనారోగ్యంగా గుర్తిస్తారు. అయితే.. ఏదీ అనివార్యం కాదు. పూర్తిగా మానవ జన్యు నిర్మాణం, ప్రేరేపకాలపై ఆధారపడుతుంది. ముఖ్యమైన విషయమేమిటంటే.. ఒకే ప్రేరేపకం అందరిలో ఒకే రకమైన అనారోగ్యాన్ని కలిగించాలనేమీ లేదు. ఇది పూర్తిగా జన్యువులపై ఆధారపడి ఉంటుంది. గర్భాశయం, ఫాలోపియన్ ట్యూబ్స్, అండశయాలు, సర్విక్స్ సంతానోత్పత్తికి ముఖ్య పాత్ర పోషిస్తాయి. వీటిలో ఏ ఒక్క అవయవం ఇన్‌ఫెక్షన్ల బారిన పడినా సంతాన లేమికి దారి తీస్తుంది. ఫైబ్రాయిడ్స్, పీసీఓడీ, నెలసరి సమస్యలు, హార్మోన్ల అసమతుల్యత తదితర ఆరోగ్య సమస్యలకు సరైన చికిత్స తీసుకోకపోవడం థైరాయిడ్ వల్ల కలిగే సంతాన లేమిపై తీవ్ర ప్రభావం చూపెడుతుంది.

స్పాండిలైటిస్

జీవక్రియ అసమతుల్యత వల్ల కలిగే ఒత్తిడి థైరాయిడ్ గ్రంథి తట్టుకోలేనంతగా ఉన్నప్పుడు ప్రతిక్రియలు ఏర్పడతాయి. థైరాయిడ్ అసమతుల్యకు గురై స్పాండిలైటిస్‌కి దారి తీస్తుంది.

అరచేతిలో లేదా అరకాళ్లలో తిమ్మిర్లు, మంటలు, అకస్మాత్తుగా నొప్పి రావడం, సూదలతో గుచ్చుతున్నట్టు మంటలు, అప్పుడప్పుడు నొప్పి రావడం, చిన్న శ్రమ చేసినా కాళ్లు, చేతులు నొప్పి రావడం,

నడుమునొప్పి, కండరాలు అకస్మాత్తుగా బిగుసుకుపోవడం, మెడనొప్పి, తలనొప్పి, కండరాలనొప్పి, డిస్క్ సమస్యల వల్ల భరించలేనంత నొప్పితో కదలలేకపోవడం, కంటి చూపులో మార్పులు రావడం, కండ్లు తిరగడం, సిమాటక లక్షణాలు, నరాలపై ఒత్తిడి వల్ల కనిపించడం, పురుషుల్లో లైంగిక సమస్యలు, నరాల బలహీనత, నరాల నొప్పి తదితర లక్షణాల ఉంటాయి.

థైరాయిడ్ అలర్జీలు

థైరాయిడ్ సమస్యల వల్ల తొందరగా అలర్జీకి గురవుతారు. చర్మంపై దురద, దుద్దర్లు, ఇన్‌ఫెక్షన్లు కనిపిస్తాయి. ఆహారం జీర్ణం కాకపోవడం, విరేచనాలు, వాంతులు, కండ్ల దురద, దగ్గు చెవుల ఇన్‌ఫెక్షన్, గ్యాస్టిక్ సమస్యలు వస్తాయి. అశ్రద్ధ కారణంగా థైరాయిడ్ సమస్యలను రోగి గుర్తించకపోవచ్చు. నిర్లక్ష్యం చేస్తే ఇది దీర్ఘకాలంలో ఒబెసిటి, కొలెస్ట్రాల్, అస్టియోప్రాసిస్, బీపీ, డయాబెటిస్, లివర్, కిడ్నీ సమస్యలకు దారి తీస్తుంది.

నిర్ధారణ

టీ3, టీ4, టీ5హెచ్ లాంటి సాధారణ పరీక్షలతోపాటు రక్త కాల్షియం, థైరాయిడ్ యాంటీబాడీస్, ఎక్స్‌రే, సీటీ, ఎంఆర్ఐ స్కానింగులు, బయాప్సీ తదితర ఆధునిక పరీక్షలు వ్యాధి లక్షణాలను అంచనా వేసేందుకు దోహదపడతాయి.

– డాక్టర్ శ్రీకర్ మను
చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్,
డాక్టర్ మనూస్ హోమియోపతి
ఫోన్ : 9032108108



హోమియో వైద్యం

థైరాయిడ్, దాని పర్యావసానంగా వచ్చే ఆరోగ్య సమస్యలు వంశపారపర్యంగా వస్తాయని, వీటికి సరైన చికిత్స లేదని ప్రచారం ఉంది. ఇది అపోహ మాత్రమే. కొన్ని కారణాల వల్ల థైరాయిడ్ గ్రంథి అసమతుల్యతకు గురవుతుందని, తద్వారా జటిల అనారోగ్య పరిస్థితులు ఎదురవు తాయని పలు అధ్యయనాల్లో తేలింది. అయితే.. కొన్ని వందల ఏండ్ల క్రితమే ఈ విషయ పరిజ్ఞానం హోమియో వైద్యంలో ఉందని ఆధునిక సమాజం గుర్తించింది. అన్ని కోణాల నుంచి శారీరక క్రియల పనితీరును తెలుసుకుని వ్యాధి మూలాలను కనుగొనడంలో హోమియో అగ్రభాగాన నిలిచింది. ఈ వైద్యం ద్వారా థైరాయిడ్ నియంత్రణతోపాటు అనేక వ్యాధుల నుంచి విముక్తి కలిగించడమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది.

ప్రొ కబడ్డీలో నేడు

బెంగళూర్ x చెన్నై
రాత్రి 8 గంటలకు
పుణె x ఢిల్లీ
రాత్రి 9 గంటలకు
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం




చటేశ్వర్ పుజారా
128 నాటౌట్
(225 బంతుల్లో 10X4, 1X6)

50కి వందనం

కెరీర్ 50వ టెస్టులో శతక్కొట్టిన పుజారా

అదే పరుగుల ప్రవాహం, అంతకంటే రెట్టించిన దూకుడు, ప్రత్యర్థిపై మరింత ఆధిపత్యం వెరసి కొలంబో టెస్టులో టీమ్ ఇండియా జోరుకు ఎదురులేకుండా పోయింది. తొలి రోజే మనోళ్లు మరో రెండు సెంచరీలు బాదటంతో కొలంబో కోహ్లిసేన పక్షాన నిలిచింది!. సంప్రదాయ ఆటలో ఆరితేరిన టెస్టు స్పెషలిస్టులు పుజారా, రహానె ధాటికి శ్రీలంక తల్లడిల్లింది. అడ్డుకట్ట వేయలేక.. అబ్బురపరిచే విన్యాసాలకు ప్రేక్షక పాత్ర వహించింది.

అర్థ శతక టెస్టు హీరో చటేశ్వర్ పుజారా కొలంబోలో శతకంతో చెలరేగాడు. లంకలో లంకపై వరుసగా మూడో సెంచరీ సాధించిన చటేశ్వర్ రెండో టెస్టులో భారత్‌ను ముందంజలో నిలిపాడు. రహానె సైతం శతక్కొట్టడంతో తొలి రోజే భారత్ 300 ప్లస్ పరుగులు చేసింది. పుజారా, రహానె అజేయ ఇన్నింగ్స్‌లతో నిలిచిన వేళ.. కొలంబోలోనూ కోహ్లిసేన భారీ స్కోరు దిశగా సాగుతోంది.



అజింక్య రహానె
103 నాటౌట్
(168 బంతుల్లో 12X4)

సెషన్ల వారీగా..

తొలి సెషన్	
పరుగులు	101
ఓవర్లు	28
వికెట్లు	01
రెండో సెషన్	
పరుగులు	137
ఓవర్లు	30
వికెట్లు	02
మూడో సెషన్	
పరుగులు	106
ఓవర్లు	32
వికెట్లు	00

- అజింక్య రహానె అజేయ సెంచరీ
- ప్రస్తుతం భారత్ స్కోరు 344/3
- శ్రీలంకతో రెండో టెస్టు తొలి రోజు

నవతెలంగాణ-కొలంబో

లంకలో టీమ్ ఇండియా జోరు కొనసాగుతోంది. 50 టెస్టు వీరుడు చటేశ్వర్ పుజారా (128 నాటౌట్, 225 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్), అజింక్య రహానె (103 నాటౌట్, 168 బంతుల్లో 12 ఫోర్లు) అజేయ సెంచరీలతో చెలరేగటంతో కొలంబోపై కోహ్లిసేన పట్టు సాధించింది!. పుజారా, రహానెల శతకాలకు తోడు ఓపెనర్ లోకేశ్ రాహుల్ (57) రాణించటంతో తొలి రోజు భారత్ 344/3తో భారీ స్కోరు దిశగా సాగుతోంది. శిఖర్ ధావన్ (35) మరోసారి ఇన్నింగ్స్‌ను ధాటిగా ఆరంభించగా, కెప్టెన్ విరాట్ కోహ్లి (13) స్వల్ప స్కోరుకే అవుటయ్యాడు. నాల్గో వికెట్‌కు అజేయంగా 211 (51.1 ఓవర్లలో) పరుగుల ద్వి శతక భాగస్వామ్యంతో దూసుకెళుతున్న పుజారా, రహానెలు శ్రీలంక బౌలర్లతో ఆటాడుకున్నారు. లంక బౌలర్లలో రంగన హెరాత్ (1/83), పెరీరా (1/68) చెరో వికెట్ తీసుకున్నారు. పచ్చిక లేని పిచ్‌పై మనోళ్లు ధనాధన్ మోత మోగిస్తున్న వేళ.. టీమ్ ఇండియా వరుసగా రెండో టెస్టులో 600 ప్లస్ స్కోరు ఆశిస్తోంది.

రాణించిన రాహుల్ : భారత్ 101/1

రెండో టెస్టులోనూ కీలక టాస్ నెగ్గిన టీమ్ ఇండియా తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నది. పచ్చిక లేని పిచ్‌పై బ్యాటింగ్‌కు వచ్చిన భారత్ శుభారంభం చేసింది. ఫామ్‌లో ఉన్న ఓపెనర్లు శిఖర్ ధావన్ (35, 37 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), లోకేశ్ రాహుల్ (57, 82 బంతుల్లో 7 ఫోర్లు) తొలి వికెట్‌కు అర్ధ సెంచరీ భాగస్వామ్యం నమోదు చేశారు. శిఖర్ ధావన్ సహజశైలిలో రెచ్చిపోయాడు. ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో చెలరేగిన గబ్బర్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ధావన్ దెబ్బకు పది ఓవర్లలోపే భారత్ 50 పరుగులు దాటేసింది. స్వీప్ షాట్లతో స్పిన్నర్లను చితక్కొట్టిన ధావన్... అదే రీతిలో పెరీరానూ బాదబోయాడు. కానీ వికెట్ల ముందు దొరికిపోయి పెవిలియన్‌కు చేరాడు. తొలుత అంపైర్ నిరాకరించినా శ్రీలంక రివ్యూకు వెళ్లి తొలి వికెట్ పడగొట్టింది. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన చటేశ్వర్ పుజారా (128) మరో వికెట్ పడనీయలేదు. రాహుల్‌కు చక్కటి సహకారం అందించాడు. 7 ఫోర్ల సాయంతో 72 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన.. వరుసగా ఆరో హాఫ్ సెంచరీతో రికార్డు సృష్టించాడు. లంచ్ సమయానికి రాహుల్ (52), పుజారా (14)లు క్రీజులో నిలిచారు. శ్రీలంక సీమర్ నువాన్ ప్రదీప్ ఈసారీ ఆరంభంలో వికెట్ పడగొట్టడంలో విఫలమయ్యాడు. రంగన హెరాత్ తొలి నుంచే స్పిన్ దాడి చేసినా ప్రయోజనం లేకపోయింది.

పుజారా, రహానె జోరు : భారత్ 238/3

లంచ్ తర్వాత కొద్దిసేపటికే రాహుల్ (57) రనౌట్‌గా నిష్క్రమించాడు. రన్‌ను తనే పిలిచినా.. పుజారా తొలుత స్పందించి మళ్లీ వెనక్కి వెళ్లాడు. అప్పటికే రాహుల్ మిడ్ పిచ్‌లో ఉన్నాడు. వెనక్కి వెళ్లినా.. జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ సమయంలో కెప్టెన్ విరాట్ కోహ్లి (13, 29 బంతుల్లో 2 ఫోర్లు) ఆశించిన మేరకు రాణించలేదు. రెండు ఫోర్లతో గాలె ఫామ్ కొనసాగిస్తున్నట్టే కనిపించినా.. హెరాత్ బౌలింగ్‌లో స్లిప్స్‌లో క్యాచౌట్‌గా



రాహుల్ 57
(82 బంతుల్లో 7X4)

నిష్క్రమించాడు. అప్పటికి భారత్ స్కోరు 38.5 ఓవర్లలో 133/3.

డ్రింక్స్ విరామానికి కొద్ది ముందు పుజారాతో జతకలిసిన అజింక్య రహానె (103) శ్రీలంక బౌలర్లతో ఆడుకున్నాడు. ఈ సెషన్లో భారత్ రెండు వికెట్లు కోల్పోయినా.. 137 పరుగులు చేసింది. అర్ధ సెంచరీని 112 బంతుల్లో అందుకున్న పుజార తర్వాత చెలరేగిపోయాడు. రహానె సైతం దూకుడుగా ఆడాడు. దీంతో ఈ సెషన్ ఆఖరి 15 ఓవర్లలో భారత్ ఏకంగా 85 పరుగులు పిండుకున్నది. పుజారా, రహానె ఇద్దరూ నెమ్మదిగా ఆడే బ్యాట్స్‌మెన్ అయినా.. 5.66 రన్‌రేట్‌తో స్కోరు బోర్డును ఉరకలెత్తించారు. దీంతో శ్రీలంకకు రెండు వికెట్ల ఆనందం ఎంతోసేపు నిలువలేదు. టీ సమయానికి పుజారా (89), రహానె (41) మంచి జోరుమీదున్నారు.

6 టెస్టుల్లో లోకేశ్ రాహుల్‌కు ఇది వరుసగా ఆరో అర్ధ శతకం. గుండప్ప విశ్వనాథ్, రాహుల్ ద్రవిడ్‌లు మాత్రమే వరుసగా ఇన్ని హాఫ్ సెంచరీలు చేశారు.

క్లాసికల్ విధ్వంసం : భారత్ 344/3

మూడో సెషన్ ఆట తొలి రోజు మ్యాచ్‌కే హైలైట్. పుజారా, రహానెలు క్రీజులో కుదురుకుని, బౌలర్లపై ఆధిపత్యం చెలాయించారు. దీంతో ఆఖరి సెషన్లో లంకేయులు కనీసం ఒక్క వికెట్ కూడా తీయలేకపోయారు. అర డజను ఫోర్లతో రహానె అర్ధ సెంచరీ పూర్తి చేయగా.. మరో ఎండ్‌లో పుజారా రెచ్చిపోయాడు. తర్వాతి 50 పరుగుల్ని కేవలం 52 బంతుల్లోనే సాధించాడు. ఓ దశలో 94 బంతులాడి 28 పరుగులే చేసిన పుజారా.. క్లాసికల్ విన్యాసాలతో స్ట్రయిక్‌రేట్‌ను అమాంతం పెంచుకున్నాడు. 9 ఫోర్లు సహా ఓ సిక్సర్ కొట్టిన పుజారా 164 బంతుల్లో కెరీర్ 13వ సెంచరీ అందుకున్నాడు. ఇక అర్ధ సెంచరీ తర్వాత మరింత దూకుడుగా ఆడిన రహానె.. డజను ఫోర్లతో 151 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. సెంచరీ తర్వాత రహానె ఎల్బీగా అవుటైనా.. రివ్యూకు వెళ్లి అజేయంగా నిలిచాడు. ఇక డ్రింక్స్ విరామం తర్వాత రహానె క్యాచౌటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకుని అజేయ శతకంతో నిలిచాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 344/3తో నిలువగా.. పుజారా (128), రహానె (103)లు క్రీజులో కొనసాగుతున్నారు.

స్కోరు వివరాలు :

భారత్ తొలి ఇన్నింగ్స్ : శిఖర్ ధావన్ (ఎల్బీ) దిల్‌రువన్ పెరీరా 35, లోకేశ్ రాహుల్ రనౌట్ (చండిమాల్/డిక్‌వాలా) 57, చటేశ్వర్ పుజారా బ్యాటింగ్ 128, విరాట్ కోహ్లి (సి) ఎంజెలో మాథ్యూస్ (బి) రంగన హెరాత్ 13, అజింక్య రహానె బ్యాటింగ్ 103, ఎక్స్‌ట్రాలు : 08, **మొత్తం : (90 ఓవర్లలో 3 వికెట్లకు) 344.**

వికెట్ల పతనం : 1-56, 2-109, 3-133.

బౌలింగ్ : నువాన్ ప్రదీప్ ఫెర్నాండో 17.4-2-63-0, రంగన హెరాత్ 24-3-83-1, దిముత్ కరుణరత్నె 3-0-10-0, దిల్‌రువన్ పెరీరా 18-2-68-1, పుష్పకుమార 19.2-0-82-0, డిసిల్వ 8-0-31-0.

2 వేగంగా 4000 పరుగులు చేసిన మూడో భారత బ్యాట్స్‌మన్ పుజారా. చటేశ్వర్ 84 ఇన్నింగ్స్‌ల్లో బాదగా.. సెహ్వాగ్ (79), గవాస్కర్ (81)లు ముందున్నారు. ద్రవిడ్ సైతం 84 ఇన్నింగ్స్‌ల్లోనే సాధించాడు.

3 శ్రీలంకలో ఆడిన మూడు టెస్టుల్లోనూ పుజారా సెంచరీ సాధించాడు. 2015లో కొలంబోలోనే అజేయంగా 145 చేయగా.. తాజాగా గాలెలో 153, ఇప్పుడు 128 బాదాడు.

6 శ్రీలంకలో భారత్ నమోదు చేసిన డబుల్ సెంచరీ భాగస్వామ్యాలు. ఐతే ఒకే సిరీస్‌లో రెండుసార్లు ద్వి శతక భాగస్వామ్యాలు నమోదు కావటం ఇదే తొలిసారి. గాలెలో ధావన్, పుజారాలు 253 చేయగా.. ఇక్కడ పుజారా, రహానెలు అజేయంగా 211 బాదారు.

743 శ్రీలంకపై వరుసగా రెండు టెస్టుల్లో తొలి రోజు భారత్ సాధించిన పరుగుల మొత్తం. గాలెలో 399/4, కొలంబోలో 344/3. వరుసగా రెండు టెస్టుల్లోనూ తొలి రోజు 300 ప్లస్ పరుగులు చేసిన ఏకైక జట్టు భారతే.

దేశవాళీ పెంపు 50 శాతం!

న్యూఢిల్లీ : దేశవాళీ క్రికెటర్ల మ్యాచ్ ఫీజును కనీసం 50 శాతం పెరగనున్నది. ఈ మేరకు బీసీసీఐ తాత్కాలిక అధ్యక్షుడు సి.కె ఖన్నా తెలిపారు. గంగూలీ సారథ్యంలోని సాంకేతిక కమిటీ ఆటగాళ్ల ఫీజు పెంపు అంశాన్ని లేవనెత్తింది. 2007 నుంచి దేశవాళీ ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో మార్పు లేదు. ' దేశవాళీ ఆటగాళ్ల మ్యాచ్ ఫీజును రివ్యూ చేయాల్సిన అవసరం ఉంది. నా అభిప్రాయం ప్రకారం కనీసం 50 శాతం పెంచటం తప్పనిసరి. ఇదే విషయాన్ని కోశాధికారి అనిరుద్ చౌదరితో మాట్లాడాను. దీనిపై అతడు చర్చిస్తున్నాడు' అని సి.కె ఖన్నా అన్నారు. ప్రస్తుతం రంజీ ఆటగాడు ఒక రోజుకు రూ. 1000 చొప్పున, ఓ మ్యాచ్‌కు రూ. 40,000 ఫీజుగా అందుకుంటున్నారు. వచ్చే బీసీసీఐ సర్వ సభ్య సమావేశంలో దీనిపై నిర్ణయం వెలువడే అవకాశం కనిపిస్తోంది.

ఆఫీస్ బేరర్లను వెల్లడించండి

ముంబయి : బీసీసీఐ అనుబంధ రాష్ట్ర సంఘాలకు పాలకుల కమిటీ (సీవోఏ) మరో ఆదేశం జారీ చేసింది. రాష్ట్ర అసోసియేషన్లు తమ ఆఫీస్ బేరర్ల వివరాలను ఆగష్టు 8 లోగా ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించింది. ఈ మేరకు వినోద్ రాయ్ రాష్ట్ర సంఘాలకు ఈమెయిల్ పంపించారు. ఢిల్లీ అసోసియేషన్‌లో ఆఫీస్ బేరర్ల ప్రతినిధులు ఓటింగ్‌లో పాల్గొంటుండగా.. ఆంధ్రా, సౌరాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్ వంటి అసోసియేషన్ల కొంత మంది గ్రూప్‌తో నడపబడుతున్నాయి.

క్రికెట్ క్లబ్‌లను ఆధీనంలో ఉంచుకుని ఆఫీస్ బేరర్ల ఎన్నికలో చక్రం తిప్పుతున్న వైనం హైదరాబాద్‌లో కనిపిస్తోంది. దీంతో బంధుప్రీతి, గుత్తాధిపత్యం, ప్రతినిధుల ఓటింగ్‌కు తెరదించేందుకు వీలుగా సీవోఏ ఈ నిర్ణయం తీసుకున్నది. దీనిపై రాష్ట్ర సంఘాలు ఏ విధంగా స్పందిస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

ప్రైజ్ మనీ వెనక్కి తీసుకోవాలి

న్యూఢిల్లీ : డోపింగ్‌లో పట్టుబడిన అథ్లెట్ల నుంచి ప్రైజ్ మనీని వెనక్కి తీసుకునే విధంగా మార్గదర్శకాలు రూపొందించాలని ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ స్పోర్ట్స్ అధ్యక్షుడు విజయ కుమార్ మల్హోత్రా పేర్కొన్నారు. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖకు రాసిన లేఖలో మల్హోత్రా ఈ మేరకు కోరారు. దేశంలో డోపీల సంఖ్య పెరుగుండటంతో కఠిన చర్యలు తప్పవని మల్హోత్రా అన్నారు. ' డోపీలుగా తేలిన అథ్లెట్ల నుంచి పూర్తి ప్రైజ్ మనీ వెనక్కి తీసుకునే విధంగా క్రీడా శాఖ తగిన చర్యలు తీసుకోవాలి. డోపింగ్‌ను క్రిమినల్ నేరంగా పరిగణించే ప్రతిపాదిత చట్టంలో దీన్ని చేర్చాలి. అథ్లెట్లకు ఉద్యోగాలిచ్చిన సంస్థలు సైతం డోపింగ్‌పై కఠినమైన మార్గదర్శకాలు కల్గి ఉండాలి. మార్కెట్‌లో అల్లోపతిక్, ఆయుర్వేదిక్, సిధా మెడిసిన్ విరివిగా లభ్యమవుతున్నాయి. ఇక క్రీడాకారులకు నిషేధిత ఉత్ప్రేరకాలపై నిరంతరం అవగాహన కల్పించాలి' అని మల్హోత్రా లేఖలో పేర్కొన్నారు.



క్వార్టర్స్‌లో ప్రణయ్

ఆక్లాండ్ : న్యూజిలాండ్ బ్యాడ్మింటన్ ఓపెన్‌లో హెచ్.ఎస్ ప్రణయ్ క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. నాల్గో సీడ్ ప్రణయ్ 21-18, 21-19తో వీ నాన్‌పై గెలుపొందాడు. 46 నిమిషాల ప్రీ క్వార్టర్స్ పోరులో ప్రణయ్ వరుస గేముల్లో అలవోక విజయం సాధించాడు. నేడు జరిగే క్వార్టర్స్‌లో లిన్ యు సీన్ (చైనీస్ తైపీ)తో ప్రణయ్ తలపడనున్నాడు. మాజీ నేషనల్ చాంపియన్, ఏడో సీడ్ సౌరభ్ వర్మ సహచర షట్లర్ పారుపల్లి కశ్యప్‌కు షాకిచ్చాడు. 21-18, 13-21, 21-16తో మూడు గేముల పాటు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో వర్మ విజయం సాధించాడు. యువ షట్లర్ సిరిల్ వర్మ 13-21, 14-21తో చైనీస్ తైపీ షట్లర్ చేతిలో ఓటమిపాలయ్యాడు.

మరింత చెత్తగా ఓడారు

43-36తో టైటాన్స్‌పై పట్నా గెలుపు

నవతెలంగాణ-హైదరాబాద్ : తెలుగు టైటాన్స్ మరింత చెత్త ఓటమితో సొంతగడ్డపై సీజన్‌ను ముగించింది. వరుసగా ఐదో మ్యాచ్‌లో ఓడినన తెలుగు టైటాన్స్.. పేలవ ఫామ్ కొనసాగిస్తోంది. గచ్చిబౌలిలో జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 43-36తో తెలుగు టైటాన్స్‌పై తిరుగులేని విజయం సాధించింది. సీజన్‌లో టైటాన్స్‌పై పట్నాకిది వరుసగా రెండో విజయం. టైటాన్స్ స్టార్ రైడర్ రాహుల్ చౌదరి 12 పాయింట్లతో మెరిసినా.. పట్నా విజయం అడ్డుకోలేకపోయాడు. తొలి అర్ధబాగంలో 16-23తో వెనుకంజలో నిలిచిన టైటాన్స్.. ద్వితియార్థంలో మరింత వేగంగా వెనక్కి వెళ్లిపోయింది. కూతకెళ్లి పర్‌దీప్ నర్వాల్ 12, మోను గోయంత్ 10 పాయింట్లు



పిల్లలతో కలిసి మ్యాచ్‌ను వీక్షిస్తున్న వీవీఎస్ లక్ష్మణ్

తీసుకురావటంతో పట్నా 40-22తో విజయం లాంఛనం చేసుకున్నది. డిఫెన్స్‌లో వినోద్ కుమార్, జయదీప్‌లు చెరో నాల్గు టాకిల్స్‌తో చెలరేగారు. ఆఖరి ఐదు నిమిషాల్లో కోలుకున్న టైటాన్స్ వరుస పాయింట్లతో ఓటమి అంతరాన్ని ఏడు పాయింట్లకు కుదించగల్గింది. రాకేశ్ కుమార్ నాల్గు టాకిల్స్‌తో మెరిసినా ప్రయోజనం లేకపోయింది.

ఒప్పందం కుదిరింది

మెల్‌బోర్న్ : ఆటగాళ్ల అసోసియేషన్, క్రికెట్ ఆస్ట్రేలియా మధ్య నెలకొన్న కాంట్రాక్టు వివాదానికి తెరపడింది. సుదీర్ఘ మంతనాలు, చర్చల అనంతరం బోర్డుతో ఆటగాళ్లు సహేతుక ఒప్పందం కుదుర్చుకున్నారు. గత ఐదేండ్లుగా ఉన్న కాంట్రాక్టు ఒప్పందం మొన్న జూన్ 30తో ముగిసింది. దీంతో అప్పటి నుంచి ఆస్ట్రేలియా టాప్-230 క్రికెటర్లు నిరుద్యోగులుగా ఉన్నారు. ఇరు పక్షాలకు ఆమోదయోగ్యమైన ఒప్పందం కుదిరినట్టు బోర్డు సీఈవో జేమ్స్ సూథర్‌లాండ్, ఆటగాళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు నికోలస్ పేర్కొన్నారు. వివాదం ముగియటంతో బంగ్లాదేశ్ పర్యటనకు మార్గం సుగమమైంది.



దేవేంద్ర, సర్దార్‌లకు ఖేల్‌రత్న

- పుజారా, హర్మన్‌ప్రీత్‌లకు అర్జున
- 17 మందికి అర్జున అవార్డులు

అవార్డుల కమిటీ సిఫారసు

న్యూఢిల్లీ : భారత అత్యున్నత క్రీడా పురస్కారం రాజీవ్ ఖేల్‌రత్న అందుకున్న తొలి పారాఅథ్లెట్‌గా దేవేంద్ర జజారియా నిలువనున్నాడు. 2017 ఏడాదికి గాను ఖేల్‌రత్న పురస్కారానికి తొలి ప్రాధాన్యతగా దేవేంద్ర జజారియా సిఫారసు చేయబడ్డాడు. హాకీ ఇండియా మాజీ కెప్టెన్, దిగ్గజ మిడ్ ఫీల్డర్ సర్దార్ సింగ్ సైతం ఖేల్‌రత్నకు సిఫారసు చేయబడ్డాడు. గురువారం సమావేశమైన విశ్రాంత న్యాయమూర్తి సి.కె ఠక్కర్ సారథ్యంలోని అవార్డుల కమిటీ ఖేల్‌రత్నకు ఇద్దరు, అర్జున అవార్డులకు 17 మందిని సిఫారసు చేసింది. అవార్డులపై క్రీడామంత్రిత్వ శాఖ తుది నిర్ణయం తీసుకుంటుంది. 34 ఏండ్ల దేవేంద్ర ఏథెన్స్ ఒలింపిక్స్ సహా రియో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు సాధించాడు. 2013 ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లోనూ పసిడి నెగ్గిన జజారియా.. ప్రపంచ రికార్డులు బద్దలుకొట్టాడు. 31 ఏండ్ల సర్దార్ సింగ్ వివిధ టోర్నీల్లో హాకీ ఇండియాను విజయపథాన నడిపించాడు. క్రికెటర్లు చటేశ్వర్ పుజారా, హర్మన్‌ప్రీత్ కౌర్‌లు అర్జున అవార్డులకు సిఫారసు చేయబడ్డారు.

ఖేల్‌రత్న : దేవేంద్ర జజారియా (పారా అథ్లెట్), సర్దార్ సింగ్ (హాకీ) **అర్జున అవార్డు :** వి.జె సురేఖ (ఆర్చరీ), కుష్బీర్ కౌర్ (అథ్లెటిక్స్), అరోకిన్ రాజీవ్ (అథ్లెటిక్స్), ప్రశాంతి సింగ్ (బాస్కెట్‌బాల్), ఎల్. దేవేంద్రో సింగ్ (బాక్సింగ్), చటేశ్వర్ పుజారా , హర్మన్‌ప్రీత్ కౌర్ (క్రికెట్), బెంబెమ్ దేవి (బాక్సింగ్), ఎస్ఎస్‌పి చావార్సియ (గోల్ఫ్), ఎస్.వి సునీల్ (హాకీ), జస్వీర్ సింగ్ (కబడ్డీ), పి.ఎన్ ప్రకాశ్ (షూటింగ్), అమల్‌రాజ్ (టేబుల్ టెన్నిస్), మారియప్పన్ తంగవేలు (పారా అథ్లెట్), సత్యవర్ట్ కడియన్ (రెజ్లింగ్), సాకెత్ మైనేని (టెన్నిస్), వరుణ్ భాటి (పారా అథ్లెట్).

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.